www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 14-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 28

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి తె. 4.20 తదుపరి అష్టమి; నక్షత్రం: పుష్యమి మ. 1.05 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె.3.07-4.53; దుర్ముహూర్తం: ఉ.8.20-9.12, రా.10.15-10.58; అమృతఘడియలు: ఉ.6.13-7.56; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.35

హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆధార్ కార్డులో ఫొటో, నీ ముఖం ఒకటేనా?

పోలింగ్ బూత్‌లో ముస్లిం మహిళకు..

హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత ప్రశ్న

నికాబ్ తొలగింపు.. ఓటేయకుండా వెళ్లిన మహిళ

నెట్టింట వైరల్‌గా మారిన వీడియో

పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఎల్‌వో

మలక్‌పేట రాణాలో కేసు.. మంగళ్‌హాట్‌లో మరోటి

రియాసత్‌నగర్‌లో రిగ్గింగ్ అని మాధవీలత ఫిర్యాదు

13



నికాబ్ తీయమని అడుగుతున్న మాధవీలత



హైదరాబాద్ శివారు పీర్జాదిగూడలోని ఓ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళా ఓటర్లు

జన సునామీ

ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లు

కడపటి వార్తలు అందే సమయానికి 81% పోలింగ్!.. పల్లెలు, పట్టణాలనే తేడా లేదు.. తొలి ఓటర్లు, విద్యావంతుల్లో జోష్

దేశ విదేశాల నుంచి సొంతూళ్లకు.. నార్వే, మారిషస్ తదితర దేశాల నుంచీ రాక.. 'సంక్రాంతి' తరహాలో ఎన్నికల సందడి

ఓపిగ్గా క్యూలో నిలబడ్డ జనం.. ఒక లక్ష్యం, కసితో మీట నొక్కిన వైనం.. ఉదయం 6.30 నుంచే బూత్‌ల ముందు బారులు

3 వేలకుపైగా కేంద్రాల్లో రాత్రి పది దాకా పోలింగ్.. కొన్నిచోట్ల అర్ధరాత్రీ క్యూలో ఓటర్లు





ఉండవల్లిలో ఓటేసిన చంద్రబాబు

గుంటూరు జిల్లా ఉండవల్లిలోని పోలింగ్ కేంద్రంలో భారీ స్థాయిలో పోటెత్తిన ఓటర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మళ్లీ సంక్రాంతి వచ్చినట్లు.. జాతరేదో జరుగుతున్నట్లు.. ఇంట్లో వేడుకకు విచ్చేసినట్లు.. 'పదండి ఓటేద్దాం' అంటూ నవ్యాంధ్ర ఓటర్లు పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు. సకుటుంబ సపరివార సమేతంగా ఓట్ల వేడుకలో పాల్గొన్నారు. అమ్మా, నాన్నలతో కలిసి కొత్తగా ఓటొచ్చిన టీనేజ్ అమ్మాయి... అవ్వా తాతలతో కలిసి వచ్చిన సాఫ్ట్‌వేర్ కుర్రాడు... స్కూటీపై కలిసొచ్చిన కొత్త దంపతులు... 'పదరా పోదాం' అంటూ మిత్రబృందం! ఎటు చూసినా ఓట్ల సందడి! సోమవారం ఉదయం 6.30 గంటలకు బూత్‌ల తలుపులు తెరవకముందే బారులు తీరారు. ఏడు గంటలకు ఈవీఎంలపై మొదలైన ఓటు మీట సవ్వడి... సాయంత్రం ఆరుదాకా కొనసాగింది. సాధారణంగా ఉదయం మందకొడిగా మొదలై, తర్వాత పుంజుకొని, సాయంత్రానికి పోలింగ్ జోరు తగ్గుతుంది. కానీ... ఈసారి అలా లేదు. అత్యధిక బూత్‌ల వద్ద రోజంతా ఓటర్ల బారులు కనిపించాయి. మూడువేలకు పైగా బూత్‌లలో రాత్రి 10 దాకా... కొన్నిచోట్ల అర్ధరాత్రి దాకా కూడా పోలింగ్ కొనసాగడం గమనార్హం. 'వీళ్లకు ఓపిక తక్కువ. ఓట్లు వేసేందుకు రారు' అనే అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ... విద్యావంతులు, ఉద్యోగులు, యువత, ఎగువ మధ్య తరగతి

మిగతా 3వ పేజీలో...

ఎమ్మెల్యే చెంప చెళ్లుమంది

వరుసలో రండి.. అన్నందుకు ఓటరు చెంపపై కొట్టిన తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని

అంతే దీటుగా బదులిచ్చిన ఓటరు

ఆయన్ను చితగ్గొట్టిన ఎమ్మెల్యే అనుచరులు

ఈసీ ఫైర్.. ఎమ్మెల్యే గృహ నిర్బంధానికి ఆదేశం

ఏపీలో వైసీపీ అరాచకం

ఎన్డీయే అభ్యర్థులు, ఏజెంట్లపై హింసాకాండ

'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడికి యత్నం

పలు చోట్ల గాలిలోకి కాల్పులు.. లాఠీచార్జి

3

పోలింగ్ డే.. కూల్ కూల్

5 డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రతలు

పోలింగ్ కేంద్రాలకు భారీగా ఓటర్లు

రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు 14

గుండెపోటుతో ఎన్నికల ఉద్యోగి, ఐదుగురు ఓటర్ల మృతి 13

పోలింగ్‌పై బహిష్కరణాస్త్రం!

పాలమూరు జిల్లా ఎదిరలో ఓటేయని 3,300 మంది 13

పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా..

పలు జిల్లాల్లోనూ ఆందోళనలు

64.74%

రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శాతం

ఓటింగ్ మరో 2% వరకు పెరిగే అవకాశం!

స్వల్ప ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

76.47%తో ప్రథమ స్థానంలో భువనగిరి

హైదరాబాద్‌లో అత్యల్పం.. 39.02%

నేటి మధ్యాహ్నానికి తుది వివరాలు: సీఈవో

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అక్కడక్కడా స్వల్ప ఘటనలు మినహా అంతా ప్రశాంతంగా సాగిపోయింది. పౌరులు ఇచ్చిన తీర్పు ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తమైంది. సోమవారం రాత్రి 11 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 64.74% పోలింగ్ నమోదైంది. ఆలస్యంగా వచ్చి క్యూ లైన్లలో ఉన్నవారినీ పరిగణనలోకి తీసుకుని, కొన్నిచోట్ల

మిగతా 13వ పేజీలో...

దేశంలో మోదీ వ్యతిరేక వేవ్



కొడంగల్‌లో సీఎం రేవంత్

కొత్త శక్తిగా అవతరిస్తాం



బర్కత్‌పురలో కిషన్‌రెడ్డి

ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర



చింతమడకలో కేసీఆర్

నాలుగో దశలో 67% ఓటింగ్

దేశవ్యాప్తంగా 96 స్థానాలకు పోలింగ్

శ్రీనగర్‌లో 38%.. దశాబ్దాల్లో అత్యధికం

ఏపీ, బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు

ఇప్పటిదాకా 379 స్థానాల్లో ఎన్నికలు

దేశ ప్రజల మద్దతు మా కూటమికే

నాలుగు దశల పోలింగ్‌తో సుస్పష్టమైంది: ప్రధాని నరేంద్ర మోదీ

12



వాహనాలన్నీ హైదరాబాద్ వైపే!

ఊళ్ల నుంచి నగరానికి తిరిగి వస్తున్న ఓటర్లు

పంతంగి టోల్‌గేటు వద్ద ట్రాఫిక్ జామ్ 3

2 రోజుల్లో కోటిన్నర మంది! 13

టీఎస్ఆర్టీసీ బస్సుల్లో రికార్డు స్థాయి రాకపోకలు

10లో 93.6%, 12లో 87.9% ఉత్తీర్ణత

సీబీఎస్ఈ ఫలితాల విడుదల.. జూలై 15 నుంచి సప్లిమెంటరీ 12

సుశీల్ మోదీ కన్నుమూత



క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచిన బీజేపీ సీనియర్ నేత

సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని

బిహార్ డిప్యూటీ సీఎంగా 11 ఏళ్లు పని చేసిన సుశీల్ మోదీ 12

పాక్ బాంబు అంటే 'ఇండీ'కి బెదురు

అందుకే కూటమి నేతల క్లీన్‌చిట్

భారత సర్జికల్ స్ట్రయిక్స్‌ను మాత్రం సందేహిస్తారు

యూపీఏ హయాంలో ఈడీ రూ.35లక్షలు జప్తు

ఎన్డీయే పదేళ్లపాలనలో రూ. 2200 కోట్లు స్వాధీనం

అందుకే ఈడీపై దాడి: మోదీ


12

దక్షిణాదిన భారీ విజయం సాధిస్తున్నాం

ఎన్నికల ఫలితాలు వచ్చేలోగా షేర్లు కొనేయండి

తర్వాత స్టాక్‌మార్కెట్ పుంజుకుంటుంది: షా

వారాణసీలో నేడు ప్రధాని నామినేషన్


ALPHORES-CBSE
Education decides the future of a Nation.
It should be practised very effectively...
ALPHORES DOES IT
Always Ahead of others despite the
STATE/CBSE/REGULAR/IIT & NEET COACHING
GRADE X
98.6%
V.SHREYASH REDDY
493/500
GRADE X
98.6%
G. CHAITRA
493/500
GRADE XII
96.6%
N. HEMANTH
483/500
Dr. V.NARENDER REDDY
CHAIRMAN
97.4% A. AKSHAYA 487/500
97.4% M.LAKSHMI SANJUKTHA 487/500
97.2% G.SAHASRA 486/500
97.2% D.RITHWIK 486/500
97.2% G.LASYA SRI 486/500
97% J.SARUYUH 485/500
97% T.SWARAGNYA 485/500
96.8% K.AISHWARYA 484/500
96.8% B. SAI RISHIK REDDY 484/500
96.8% K.DEV ASHISH 484/500
96.4% P.SAHASRA 482/500
96.4% S.LAXMIMANOGNYA 482/500
96.4% L.PRANAYNI 482/500
96.4% G.SRIVALLIKA 482/500
96.2% MIRZA MOHD SAFIULLA BAIG 481/500
96.2% SAI SUHAAS 481/500
GRADE XII
95.2% SHUBODH CHOUDHARY 476/500
95.2% G.SAI MANJUNATH REDDY 476/500
95% G.LAHARI 475/500
94.4% V.SRIMUKHI 472/500
93.8% G.RATHAN RAO 469/500
93.4% NIKESH CHOPRA 467/500
93% K VISHAL REDDY 465/500
92% AMIT CHOPRA 460/500
92% K.SRINIDHI 460/500
91.4% S.SAKETH PATEL 457/500
91.2% SARDAR JASPREETH SINGH BAL 456/500
96% CH.SAM ROHITH KUMAR 480/500
96% J.SREEJA 480/500
95.8% B.SRINIDHI 479/500
95.8% A.SREEJA 479/500
95.8% K.SAI SHAINY 479/500
95.8% M.RUSHIL VARENYA 479/500
95.8% A.ASHRITHA REDDY 479/500
95.8% V.VENNELA REDDY 479/500
95.6% G.SHEFALI 478/500
95.6% G. HARDIK 478/500
95.6% P.SHRUTWIKA 478/500
95.6% V.SUHANI 478/500
95.4% A.VEERA HEMANTH 477/500
95.2% D.SRIHITHA 476/500
95.2% B.SAI DEEKSHITH 476/500
95.2% B.ROHITH 476/500
95.2% MD ABDUL MUNEEB 476/500
95% SHAIK JUNAID 475/500
95% S. ANUP SAI 475/500
94.8% N. SARANI CHANDRA 474/500
94.6% K. SRINIDHI 473/500
94.6% T.DEVANSHI 473/500
94.4% K.VERONICA HRUTHI 472/500
94.4% K.SATHWIK PATEL 472/500
94.4% R.AKHILA 472/500
94.2% TARANPREET KAUR 471/500
94% L.ADITYA 470/500
94% B.SAHASRA RATHOD 470/500
93.8% MA.ASHRAFF ARMAN 469/500
93.8% D.ARADDHYA 469/500
93.8% T.RISHINDRA 469/500
93.8% G.VISHWAK SEN 469/500
93.6% T.RITHESH REDDY 468/500
93.6% CH.SOUMYA SRI 468/500
93.6% N.SHARANYA 468/500
93.6% A. SHARVANI 468/500
93.4% B.SHARMILA 467/500
93.4% R.DESHMUKH 467/500
93.2% K.SHIVAPRANAV 466/500
93.2% P.MOURYA 466/500
93.2% J.ARCHIT 466/500
93.2% G.PAVAN TEJ 466/500
93.2% K.SAHASRA 466/500
93% N.RATHNA PRAKASH 465/500
93% P.ADVAITH 465/500
92.8% CH.VIDITHA 464/500
92.8% ABDUL MUNAM 464/500
92.8% V.SRIVALLI 464/500
92.6% B.LIKITH SAI 463/500
92.6% I.SHISHIRA REDDY 463/500
92.4% S.ISHITHA 462/500
92.4% J.SAHASRA REDDY 462/500
92.2% G.HANSIKA 461/500
92.2% P.ABHINAV REDDY 461/500
92.2% SHIFA RAUF 461/500
92% A.SAI SHASHREEK 460/500
91.6% K.SAI JESHWANTH REDDY 458/500
91.6% REEYA WASALA 458/500
91.4% T.SHIVAMSH 457/500
91.4% V.SAI HARSHITH 457/500
91.4% G.SIRI CHANDANA 457/500
91.2% G.SAI MANISH 456/500
91% K.MANVITHA REDDY 455/500
90.6% Y.VYSHNAVI 453/500
90.4% D.SRIVATHSAV 452/500
90.2% V.SAI SATVIK REDDY 451/500
90.2% A.MANOGNYA 451/500
90.2% D.NANDINI 451/500
90% V.NEHITH REDDY 450/500
90% D.ANKITH REDDY 450/500
90% R.AKSHITHA 450/500
Glorious Stats... 100% PASS
Grade X : 165 Alphoresians out of 219 have secured 80% +
Grade XII : 32 Alphoresians out of 86 have attained more than 80%
ADMISSIONS ARE OPEN
Hearty Congrats,! ALPHORESIANS for your INSPIRATIONAL SUCCESS II Parents & Staff, thanks a lot for your continuous SUPPORT & ENCOURAGEMENT
OUR SCHOOL BRANCHES : KARIMNAGAR : 91335 37444 Kothapally, Vavilalapally, Kisannagar, Bhagathnagar, Mankammathota, Vedira II GOPALRAOPET 9133312833
SULTANABAD 9246934448 II HUSNABAD : 9133929444 II JAGITIAL : 9246934445 Krishnanagar, Vidyanagar, Shivaveedhi II MALLIAL 9154901238 II MANCHERIAL 9133936444
NIRMAL 9246934451 II BHAINSA 9133312829 II ARMOOR : 9133938444 Brahmanapalli 'X' Road & Vidyanagar II WARDHANNAPET 9133189444 II WANI-MH : 8766966421
OUR COLLEGE BRANCHES : HYDERABAD SUCHITRA ALWAL : 91608 61444, GHATKESAR 9160128444, KARMANGHAT 9246834441, NEW NALLAKUNTA 9160867444,
HASTINAPURAM 91339 73444 II KARIMNAGAR 91335 88857 II HANAMKONDA 91604 27444 II JAGTIAL 92470 66644 II MANCHERIAL 9160264443 II NIRMAL 96524 44414
OUR NEW INITIATIVES : SMART SCHOOL - MANCHERIAL 91604 21444 II GENIUS SCHOOL - HUZURABAD 9160412 444 II KARIMNAGAR : GIRLS SCHOOL 91549 01240,
IIT&NEET ACADEMY (ELITE) - SEETHARAMPUR 92467 34447, EXCEL CAMPUS - KOTHAPALLI 91602 54447 II NIZAMABAD 9652444414 : MUBARAKNAGAR, GG ROAD-DUBBA &
GAYATHRINAGAR II ARMOOR : 9652 44414 II MANCHERIAL : IIT&NEET AC CAMPUS : 81868 24444 II HANAMKONDA : BHEEMARAM 9160427444 II WARANGAL : POCHAMMA MAIDAN 9160426444



నెల్లూరు నగరంలో వేద సంస్కృతి పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోటెత్తిన ఓటర్లు





ఉండవల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న లోకేశ్, బ్రాహ్మణి; మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో ఓటు వేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్

నల్లగొండ మాజీ ఎంపీ దామోదర్‌రెడ్డి మృతి

» అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్నుమూత

» మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సంతాపం



దేవరకొండ, మే 13:నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నల్లగొండ మాజీ ఎంపీ తుమ్మలపల్లి దామోదర్‌రెడ్డి(85) మృతి చెందారు. ఏడాదిగా అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని స్వగృహంలో సోమవారం మధ్యాహ్నం చనిపోయారు.నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం అజ్మాపురం గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి 1979లో నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. దేవరకొండ ప్రాంతంలోని సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారు. మాజీ సీఎంలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్య, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, చకిలం శ్రీనివాసరావులకు ఆయన సన్నిహితుడు. హైదరాబాద్ ప్రశాసన్‌నగర్‌లోని మహాప్రస్థానంలో మంగళవారం దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు జరగనున్నాయి. దామోదర్‌రెడ్డి మృతి పట్ల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జానారెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు సంతాపం తెలిపారు.

ఓటేయడానికి వెళ్తూ... ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురి మృతి

» మృతుల్లో భర్త, భార్య, కుమారుడు

రఘునాథపల్లి, మే 13: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకని సొంత ఊరికి బయలు దేరిన కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. రోడ్డు పక్కన టిఫిన్ చేస్తుండగా దూసుకొచ్చిన ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు ముగ్గురి ప్రాణాలు తీసింది. జనగామ జిల్లా రఘునాథపల్లిలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. వరంగల్‌లోని ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన తెల్కపల్లి రవీందర్ కుటుంబసభ్యులు ఉపాధి కోసం యాదాద్రి జిల్లా బీబీనగర్‌కు వెళ్లారు. ఐదేళ్లుగా అక్కడే ఉంటున్నారు. ఓటు వేసేందుకని పెద్ద కుమారుడైన పార్థును ఇంటి వద్దనే ఉంచి రవీందర్(35) తన భార్య జ్యోతి(32)తో పాటు చిన్న కుమారుడు భవిష్ (10)ను తీసుకొని ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో రఘునాథపల్లిలో జాతీయ రహదారి పక్కన ఆగి టిఫిన్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ రాజధాని బస్సు అదుపు తప్పి వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్, జ్యోతి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గాయపడిన భవిష్‌ను ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మనీలాండరింగ్ కేసులో నేడు కోర్టుకు కవిత

న్యూఢిల్లీ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. మనీలాండరింగ్ కేసులో కోర్టు విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు(మే 14) మంగళవారంతో ముగియనుండడంతో ఆమె కస్టడీ పొడగింపును కోరేందుకు ఈడీ సిద్ధమైంది. మరోవైపు మనీలాండరింగ్ కేసులో కవితతోపాటు మరో నలుగురిని నిందితులుగా పేర్కొంటూ ఈడీ కొత్తగా దాఖలు చేసిన చార్జిషీట్‌ను కోర్టు మంగళవారం పరిశీలించే అవకాశం ఉంది.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయండి

» లేదంటే ఎన్నికల బహిష్కరణ.. రైతుల ధర్నా

భూదాన్ పోచంపల్లి, మే 13: అకాల వర్షానికి తడిసిన ధాన్యం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని లేనిపక్షంలో ఎన్నికలు బహిష్కరిస్తామని రైతులు హెచ్చరించారు. భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన రైతులు ఈమేరకు డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం పోలింగ్ కేంద్రం సమీపంలో ధర్నాకు దిగారు. ధాన్యం కొనుగోలు చేయాలని, లేదంటే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిస్తూ ధర్నా చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి వచ్చి వారితో మాట్లాడారు. వారి హామీతో రైతులు ఆందోళన విరమించారు. లారీలు వచ్చి ధాన్యాన్ని లిఫ్ట్ చేయడంతో ఓటింగ్‌లో పాల్గొన్నారు.

రెట్టింపైన బీర్ ధర.. బ్లాక్ మార్కెట్లో రూ.300

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): పోలింగ్ వేళ రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్ చేయడంతో మందుబాబులు అల్లాడిపోయారు. ఇదే అదనుగా బ్లాక్ మార్కెట్లో మద్యం ధరలకు రెక్కలొచ్చాయి. ఇప్పటికే బీర్ల కొరత ఇప్పటికే తీవ్రంగా ఉండగా.. మద్యం దుకాణాలు మూతపడడం, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ముందుగానే భారీగా నిల్వ చేసుకోవడంతో మరింత డిమాండ్ ఏర్పడింది.సాధారణంగా రూ.150-160ఉండే బీర్ల ధరలు బ్లాక్ మార్కెట్లో ఆదివారం రూ.300 వరకు పలికాయి. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు సోమవారం సాయంత్రం తెరచుకోగా.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం ఉదయం వరకు బంద్ కొనసాగింది.

సీబీఎస్ఈలో భాష్యం బ్లూమ్స్ విజయభేరి

గుంటూరు(విద్య), మే 13: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భాష్యం బ్లూమ్స్ విద్యార్థి ఎస్.హైందవ చంద్రకాంత్ 500 మార్కులకుగానూ 484 మార్కులు, ఎం.హితేష్ 483, ఎం.హాసిని 483, కె.హ్రితికారెడ్డి 483, ఎల్.అక్షిత్ 482, బి.తనూష్‌రెడ్డి 482, కె.తనీష్ సాయి 482, ఆవని బిస్ట్ 481, పి.అనంత రాఘవేంద్ర 481, టి.కావ్యశ్రీ, కె.కార్తికేయన్, డి.వి.ఎల్.సుస్మిత 480 మార్కులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థుల్లో 21 మంది 475 పైగా మార్కులు, 101 మంది 450కి పైగా మార్కులు సాధించారని వెల్లడించారు. చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'అల్ఫోర్స్' ప్రతిభ

కరీంనగర్ టౌన్, మే 13: సీబీఎస్ఈ పది, పన్నెండు తరగతుల ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచారని, ఉత్తమ మార్కులతో అగ్రగామిగా నిలిచారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో సోమవారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ, అత్యుత్తమ విద్యాబోధన అందించడం వల్లే ఉత్తమ ఫలితాలు సాధ్యయ్యాయన్నారు. పదో తరగతిలో వి.శ్రేయాస్‌రెడ్డి, జె.చైత్ర అత్యధికంగా 493 మార్కులు సాధించగా.. 89 మంది విద్యార్థులు 90 శాతానికిపైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. 12వ తరగతిలో ఎన్.హేమంత్ 97 శాతం మార్కులతో ప్రతిభ చాటగా, సులోద్ చౌదరి 476 మార్కులు, సాయిమంజునాథ్‌రెడ్డి 476 మార్కులు సాధించారని వెల్లడించారు. మరో పన్నెండు మంది విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను అభినందిస్తూ.. అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపాల్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏపీలో వైసీపీ అరాచకం

పోలింగ్ కేంద్రాలపై పేట్రేగిన ఆ పార్టీ గూండాలు.. ఎన్డీయే అభ్యర్థులు, ఏజెంట్లపై హింసాకాండ

'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడికి యత్నం

పలు చోట్ల గాలిలోకి కాల్పులు...లాఠీచార్జి

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)







వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ నాయకులు

ఏపీలో వైసీపీ గూండాలు పేట్రేగిపోయారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లు, పోలింగ్ సిబ్బంది, పోలీసులు.. ఇలా అందరిపైనా అరాచకంగా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆ మూల నుంచి ఈ మూల దాకా వైసీపీ మూకల హింసాకాండ యథేచ్ఛగా కొనసాగింది. ఆ పార్టీ దౌర్జన్యాలు ఏ స్థాయికి చేరుకున్నాయంటే.. వైసీపీ మూకలు ఏకంగా ఎస్పీ వాహనంపైనే రాళ్లు విసిరారు! పోలీసులే ఇళ్లల్లోకి వెళ్లి తలుపులు వేసుకుని దాక్కున్నారు. వైసీపీ మూకల రాళ్ల దాడులకు నిరసనగా బైక్ ర్యాలీ నిర్వహించిన టీడీపీ శ్రేణులపై వారు మరోసారి దాడి చేయడంతో.. బాలింత అయిన భార్యను ఓటేయించేందుకు తీసుకెళుతున్న వ్యక్తి తలపగిలింది. ఇక.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలం సదుంలోని బూరగమంద గ్రామంలో 14 మంది టీడీపీ ఏజెంట్లను వైసీపీ నాయకులు సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకే కిడ్నాప్ చేశారు. వారిని విచక్షణారహితంగా కొట్టారు. దీనిపై టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఉదయం ఆరు గంటలకు వారిని పీలేరు పింఛానది బ్రిడ్జి సమీపంలో విడిచి పారిపోయారు. అలాగే.. యాదమరి మండలం 14 కండ్రిగ ముస్లింవాడ కేంద్రంలో దొంగ ఓట్లు వేస్తున్న వైసీపీ నాయకుల్ని టీడీపీ శ్రేణులు వీడియో తీయడంతో సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు.. టీడీపీ వర్గీయులపై కత్తులతో, రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం సింగసముద్రంలో వైసీపీ అభ్యర్థి భరత్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి తలుపులు మూసేశారు. వెంటనే టీడీపీ నాయకులు తలుపులు తెరిచారు. దీంతో వైసీపీ శ్రేణులు టీడీపీ నేతల మీద దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ ఏజెంట్లకు గాయాలయ్యాయి. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. రెంటచింతల మండలం రెంటాల గ్రామంలో ఆ పార్టీ గూండాలు టీడీపీ ఏజెంట్లు, సానుభూతిపరులపై కర్రలు, కొడవళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ ఏజెంట్ చేర్రెడ్డి మంజుల, మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడికి చేరుకున్న మాచర్ల టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఆయన త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వైసీపీ గూండాలు ఆయన కారుతో సహా మూడు కార్లను ధ్వంసం చేశారు. ఒక కారును తగలబెట్టారు. కడప జిల్లా కోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేటలో టీడీపీ ఏజెంట్లపై వైసీపీ గూండాలు విచక్షణారహితంగా దాడి చేశారు. సుభాశ్‌రెడ్డి అనే టీడీపీ నాయకుడిని దారుణంగా కొట్టి ఊరిబయట పడేశారు. రైల్వే కోడూరు, మైదుకూరు, రాయచోటి నియోజక వర్గాల్లో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని వైసీపీ శ్రేణులు దాడులకు దిగాయి. ఖాజీపేట మండలం పుల్లూరులో టీడీపీ కార్యకర్త చెన్నయ్యపై వైసీపీ నాయకుడు నాగేశ్వర రెడ్డి దాడి చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్లలో స్వతంత్ర అభ్యర్థి బాబుపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనుచరులు దాడి చేశారు.



రెంటాలలో వైసీపీ మూకలు నిప్పుపెట్టడంతో దహనమవుతున్న మాచర్ల టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి కారు

విజయవాడలో ఎన్డీయే ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిపై అసభ్యకరమైన పదజాలంతో విరుచుకుపడ్డ వైసీపీ గూండాలు, ఆయన వాహనాలను వెంబడించి దాడులు చేశారు. కాకినాడ రామకృష్ణాపురంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరగడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాల్వ గ్రామంలో టీడీపీ ఏజెంట్‌పై వైసీపీ వర్గీయులు దాడి చేసి కొట్టారు. ఘర్షణలో బూత్ లోపల ఫర్నీచర్ ధ్వంసమైంది. వైసీపీ దాడిని నిరసిస్తూ గ్రామస్తులు పోలింగ్ బూత్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించగా అక్కడే ఉన్న బీఎస్ఎఫ్ జవాన్ నాలుగు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భారీ ఎత్తున తన అనుచరులతో వచ్చి పోలింగ్ బూత్‌లోకి వెళ్లి టీడీపీ ఏజెంట్లపై దౌర్జన్యం చేశారు. దీన్ని మొబైల్ ఫోన్‌లో వీడియో తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' విలేకరి రాజుపై.. 'ఎవడ్రా నువ్వు' అంటూ మోహిత్‌రెడ్డి అనుచరులు దౌర్జన్యం చేశారు. రాజు మొబైల్ ఫోన్ లాక్కుని దాడికి యత్నించారు. పెనమలూరు నియోజకవర్గం పోరంకి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి జోగి రమేశ్, ఆయన కుమారులు మైలవరం, పెడన నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన వారితో దొంగ ఓట్లు వేయించేందుకు ప్రయత్నించారు. టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. జోగి అనుచరులు.. బోడె ప్రసాద్ సోదరుడు బోడె సురేశ్, తెలుగు యువత అధికార ప్రతినిధి బోడె మనోజ్‌పై దాడిచేశారు.

విజయనగరంలో పోలింగ్ అధికారిపై దాడి

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కొత్తశ్రీరంగరాజపురంలోని 100వ పోలింగ్‌స్టేషన్లో ఓ వృద్ధురాలిని వైసీపీ నాయకులు ఓటింగ్‌కు తీసుకొచ్చారు. పీవో రాంబాబు ఆమెకు సహాయకుడిగా వెళ్లారు. ఆ తరువాత తాను ఓటు వేశాను కానీ తన వేలిని సైకిల్ గుర్తుపై పెట్టినట్లు ఉందని చెప్పటంతో.. వైసీపీ నాయకుల్లో కోపం కట్టలు తెంచుకుంది. వైసీపీ ఏజెంట్లు, నాయకులు పీవోపై దాడి చేశారు. పీవోపై ఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. పోలింగ్ స్టేషన్లోకి చొరబడి దర్పాషలాడి, తనపై చేయిచేసుకున్నారని పీవో కూడా వారిపై ఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. అలాగే.. విజయనగరం కార్పొరేషన్‌లోని ఉల్లివీధి సమీపంలో వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తను కొడుతుండడం గమనించిన అక్కడే ఉన్న 'ఆంధ్రజ్యోతి' విలేకరులు ఫొటోలు, వీడియో తీశారు. దీంతో వైసీపీ కార్యకర్తలు దుర్భాషలాడుతూ సెల్ లాక్కుని ఫొటోలు డీలిట్ చేశారు.


ఎమ్మెల్యే సోదరుడి బీభత్సం

మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి మాచర్లలో బీభత్సం సృష్టించారు. పీడబ్ల్యూడీ కాలనీలోని పోలింగ్ బూత్‌లో అధిక సంఖ్యలో ఓట్లు పోలవడం, అవి టీడీపీ సానుభూతిపరులవి కావడంతో ఆగ్రహించిన వెంకట్రామిరెడ్డి తన గ్యాంగ్‌తో వెళ్లి పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నేతల వాహనాలపై కార్లను ఎక్కించుకుంటూ పోయారు. టీడీపీ నేతలను ఢీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆశ్చర్యకర ఫలితాలొస్తాయి

» హింసతో ఓటర్లను అడ్డుకునేందుకు వైసీపీ యత్నాలు

» కుట్రలను కూటమి అడ్డుకుంది: చంద్రబాబు



అమరావతి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఎన్నికల్లో ఆశ్చర్యకర ఫలితాలను అందరూ చూస్తారని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. సోమవారం రాత్రి తమ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి తిరిగి వెళ్లే సమయంలో అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. 'హింసను ప్రేరేపించి శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేసి ఓటర్లు ఓటింగ్‌కు రాకుండా అడ్డుకోవాలని వైసీపీ నాయకత్వం ప్రయత్నించింది. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. టీడీపీ కార్యకర్తలు వమ్ము చేశారు. వైసీపీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బలంగా నిలబడ్డారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకత్వం హింసకు ఒడిగట్టింది. కూటమి పార్టీలు అప్రమత్తంగా ఉండి వారి ప్రయత్నాలను అడ్డుకున్నాయి' అని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న కసి ప్రతి చోటా ఓటర్లలో కనిపించిందని, దీనివల్ల ఊహించని ఫలితాలు రాబోతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. కాగా.. టీడీపీ కేంద్ర కార్యాలయం సోమవారం రాత్రి 'సీఎం సీఎం' నినాదాలతో ప్రతిధ్వనించింది. ఆయన ఇంటికి బయల్దేరే సమయంలో టీడీపీ కార్యకర్తలు ఆయన్ను చూసి ఉత్సాహంతో ఈ నినాదాలు చేశారు. వారందరికీ చంద్రబాబు నవ్వుతూ నమస్కారం చేశారు. కాగా, చంద్రబాబు మంగళవారం ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీకి ప్రత్యేక విమానంలో వెళ్తున్నారు. అక్కడ ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి రావాలని ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలకు బీజేపీ ఆహ్వానం పంపడంతో ఆయన వెళ్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

జన సునామీ

(మొదటి పేజీ తరువాయి)

వారు కూడా పోలింగ్ బూత్‌లకు తరలి వచ్చారు. క్యూలో ఓపిగ్గా నిలబడి.. గంటైనా, రెండు గంటలైనా తమ వంతు వచ్చేదాకా వేచి చూసి ఓటేశారు. పొరుగు రాష్ట్రాల్లో స్థిరపడిన వారు సొంత వాహనాలు, రైళ్లు, బస్సుల్లో ఓటున్న చోటుకు తరలి వచ్చారు. అమెరికా, గల్ఫ్ దేశాల నుంచి ఓ మోస్తారుగా ఓటేసేందుకు రావడం సహజమే! ఈసారి... నార్వే, స్వీడన్, కెనడా, మారిషస్ వంటి దేశాల్లో స్థిరపడిన వారూ ఓటేసేందుకు సొంతూళ్లకు వచ్చారు. గ్రామాల్లో 'సంక్రాంతి'కి మాత్రమే కనిపించే సందడి.. ఇప్పుడు ఓట్ల పండక్కి కనిపించింది. ఏదో కసితో, ఒక లక్ష్యంతో ఓటు వేయాలన్న భావన వీరిలో కనిపించింది. 'ఈసారి ఓటేయకపోతే ఏదో కోల్పోతాం!' అనే ఆందోళనతోనే వీరంతా తరలి వచ్చినట్లు స్పష్టమైంది. రాష్ట్రంలో, సొంతూళ్లో సంగతులన్నీ తెలుసుకుని... మార్పు కోసమే ఓటు వేయక తప్పదనే బలమైన సంకల్పంతోనే బూత్‌ల ముందు బారులు తీరినట్లు అవగతమైంది. ఇక... గ్రామీణులు, కార్మికులు, కర్షకులు ఎప్పట్లాగానే తమ ఓటును ఉపయోగించుకున్నారు. ఆదర్శంగా నిలిచారు. అన్ని వర్గాల ప్రజలు ఓటుకు పోటెత్తడంతో సోమవారం రాత్రి కడపటి వార్తలందేసరికే 81 శాతం నమోదైంది. మొత్తం పోలింగ్ పూర్తయి, తుది లెక్కలు పూర్తయ్యేసరికి పోలింగ్ 85 శాతానికి చేరవచ్చని అంచనా! ఇప్పటిదాకా గత ఎన్నికల్లో నమోదైన 79.84 శాతం పోలింగే రికార్డు! ఇప్పుడు అది బద్దలైనట్లే! వాతావరణం కాస్త చల్లబడటంతో ఓటర్లకు ఊరట కలిగింది.

హింసాత్మకమే... కానీ!

ఓటమి భయం వెంటాడుతోందో.. ఓటు చేజారుతోందని అర్థమైందో తెలియదుకానీ వైసీపీ వర్గాలు అనేకచోట్ల విచ్చలవిడిగా దాడులు, దౌర్జన్యాలకు దిగాయి. పల్నాడులో భారీగా దాడులు చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎస్పీ వాహనంపైనే దాడి చేశారు. పలుచోట్ల టీడీపీ అభ్యర్థులనూ అడ్డుకుని దాడికి దిగారు. టీడీపీ ఏజెంట్లను లక్ష్యంగా చేసుకుని కొట్టారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల నుంచి వెబ్‌కాస్టింగ్ చేసినా ఇదీ పరిస్థితి. ఆయా ఘటనలపై టీడీపీ నేతలు ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశారు. గత ఎన్నికలతో పోల్చితే మాత్రం ఈసారి హింసాత్మక ఘటనలు తక్కువే అని పోలీసు అధికారులు చెబుతున్నారు. గతంతో పోల్చితే ఓట్ల గల్లంతుపైనా ఫిర్యాదులు తక్కువగానే వచ్చాయి. ఓట్ల తొలగింపుపై మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో జనం ముందుగానే అప్రమత్తమయ్యారు. తమ ఓట్లను కాపాడుకున్నారు. ఈవీఎంలు మొరాయించడంతో పలుచోట్ల పోలింగ్ ఆలస్యంగా మొదలైంది.

గంట గంటకూ పైపైకి!

ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం పోలింగ్ ప్రక్రియలో గంట గంటకూ ఓటింగ్ శాతం పెరిగిందని ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంచనాలకు మించి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారని చెప్పారు. సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 68.04 శాతం మేర పోలింగ్ నమోదైందని వివరించారు. నిర్ణీత సమయం దాటినా లైన్‌లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించామన్నారు. మొత్తం 3,500 కేంద్రాల్లో పోలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగిందని వివరించారు. ఎక్కడా రీ పోలింగ్ అవసరం లేదని చెప్పారు.



యాదాద్రిభువనగిరి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

వాహనాలన్నీ హైదరాబాద్ వైపే!

చౌటుప్పల్ రూరల్/టౌన్, మే 13: తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు ఓట్లు వేసిన తర్వాత సోమవారం సాయంత్రం నుంచి హైదరాబాద్ బాట పట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద అర కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. టోల్‌గేటు దాటడానికి 15 నిమిషాల సమయం పట్టింది. 16 గేట్లకు గాను 10 గేట్ల ద్వారా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పంపుతున్నారు. సాధారణ రోజుల్లో నిత్యం 30 నుంచి 35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సోమవారం 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. అర్ధరాత్రి వరకు వాహనాల రద్దీ కొనసాగింది. బస్సుల కోసం ప్రజలు బస్టాప్‌ల వద్ద గంటల తరబడి ఎదురు చూశారు.

చెళ్లుమన్న ఎమ్మెల్యే చెంప

» తెనాలి పోలింగ్ బూత్‌లో ఓటరు చెంపపై కొట్టిన తెనాలి ఎమ్మెల్యే

» అంతే దీటుగా బదులిచ్చిన ఓటరు



ఎమ్మెల్యే చెంపపై కొడుతున్న సుధాకర్

తెనాలి, మే 13, (ఆంధ్రజ్యోతి): వైసీపీ గూండాలు పేట్రేగిపోయారు. తెనాలి పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వరుసలో రావాలని, మంది మార్బలంతో లోపలికి వెళితే ఎట్లాగంటూ ఆ ఓటరు ప్రశ్నించడమే పాపమైంది. అంతే... వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రెచ్చిపోయారు. గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో పోలింగ్ ఆలస్యం కావడంతో క్యూలో ఉన్న ఓటర్లు విసుగుచెందారు. అదే వరుసలో ఎన్నారై గొట్టిముక్కల సుధాకర్ ఉన్నారు. వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కుటుంబమే కాకుండా, ఆయన అనుచరులు పదిమందికి పైగా నేరుగా పోలింగ్ కేంద్రంలోకి వెళుతుండడంతో సుధాకర్ వారిని వరుసలో రావాలని కోరారు. దీంతో సుధాకర్‌కు, ఎమ్మెల్యే అనుచరులకు వాదనలు సాగాయి. ఈలోపే ఎమ్మెల్యే శివకుమార్ వేగంగా అక్కడకు వచ్చి సుధాకర్ చెంపపై కొట్టడం, సుధాకర్ కూడా అంతే వేగంగా ఎమ్మెల్యే చెంపపై కొట్టడం కనురెప్పపాటులో జరిగిపోయాయి. ఆ వెంటనే శివకుమార్ అనుచరులు సుధాకర్‌పై దాడికి దిగారు. కంటిపై, ముఖంపై గాయాలైన సుధాకర్ అక్కడున్న గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. కొద్దిసేపటికి పోలీసులు ఓటువేయించి స్టేషన్‌కు సుధాకర్‌ను తీసుకువెళుతుండగా, మరోసారి ఎమ్మెల్యే అనుచరులు దారుణంగా కొట్టారు. ఆ తర్వాత సుధాకర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సుధాకర్‌ను వైద్యపరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం కూడా సీరియస్ అయింది. ఇద్దరిపైనా కేసులు నమోదుచేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కీలక దశ

తెలుగు రాష్ట్రాల్లో సోమవారం జరిగిన ఎన్నికలు అత్యంత కీలకమైనవి. తెలంగాణలో 17లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగితే, ఆంధ్రప్రదేశ్ ప్రజలు పాతికమంది ఎంపీలతో పాటు, 175మంది ఎమ్మెల్యేలను కూడా ఎన్నుకొని రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని నిర్ణయించుకోబోతున్నారు. దేశంలోని పదిరాష్ట్రాల్లో 96లోక్‌సభస్థానాలకు ఈ నాలుగోదశలో జరిగిన పోలింగ్‌లో దాదాపు సగం సీట్లు తెలుగురాష్ట్రాల్లోనే ఉన్నాయి. సీట్ల సంఖ్య రీత్యా మొత్తం ఏడుదశల్లోనూ ఈ దశ రెండవ అతిపెద్దది. కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వ బలాబలాలను నిర్ణయించగలిగే యూపీ, బెంగాల్, మహారాష్ట్ర వంటి కీలకమైన రాష్ట్రాలు కూడా ఈ దశలో ఉన్నాయి.

తెలంగాణలో పదిహేడుస్థానాల్లో తేలిన ఫలితం రాబోయే కాలంలో రాష్ట్రప్రభుత్వ పనితీరును ప్రభావితం చేస్తుంది. అర్నెల్ల క్రితమే అధికారంలోకి వచ్చినప్పటికీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ఇచ్చిన హామీలు ఓటరును ఏ మేరకు ప్రభావితం చేశాయన్నది ఈ ఎన్నికలు కొంతమేరకు చెప్పగలుగుతాయి. ఎక్కువ సీట్లు తెచ్చుకొని తమ విధానాలకు, ఆలోచనలకు ప్రజల ఆశీస్సులు, అండదండలు అధికంగా ఉన్నాయని నిరూపించుకొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మనుగడ ఏ విధంగా ఉండబోతున్నదీ కూడా ఈ ఎన్నికలు చెబుతాయి. ఎన్ని స్థానాలను గెలుచుకోగలదన్న విషయాన్ని అటుంచితే, సాధ్యమైనన్ని ఎక్కువ నియోజకవర్గాల్లో రెండోస్థానంలో ఉంటూ తన ఉనికిని కాపాడుకొనేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నది. రాష్ట్రంలో వేగంగా విస్తరించిన భారతీయ జనతాపార్టీ (బీజేపీ), బీఆర్ఎస్ బలాన్ని కూడా కొంతమేరకు తన ఖాతాలో వేసుకుంటూ గతంలో లభించిన స్థానాలతో పాటు, మరిన్ని అధికంగా గెలుచుకొనేందుకు ప్రయత్నిస్తున్నది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షపార్టీగా ఎదగాలన్న దాని ప్రయత్నానికి ఈ ఎన్నికలు ఓ ఊతం. వేర్వేరు కారణాలు, అవసరాల రీత్యా ఈ పార్లమెంట్ ఎన్నికలు మూడుపార్టీలకూ ఓ పరీక్ష. ఇక, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు కొత్త ప్రభుత్వాన్ని నిర్ణయించబోతున్నాయి. వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్ఆర్‌సీపీ ఐదేళ్ళ పాలన మీద ప్రజలు ఇచ్చిన తీర్పు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లలో నిక్షిప్తమై ఉంది. ఎండావానలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు చైతన్యంతో వ్యవహరించడం, పోలింగ్‌శాతం అధికంగా ఉండటం ప్రశంసనీయం. ఓటింగ్ హెచ్చినప్పటికీ, పలుచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం, హింసాత్మకమైన ఘటనలు జరగడం దురదృష్టకరం. ప్రజలు హింసకు వెరవకుండా మార్పుకోసం నిలబడ్డారని, అధిక పోలింగ్ తమకు ప్రయోజనకరమని టీడీపీ భావిస్తుంటే, శాసనసభలో తన ప్రవేశానికి ఈ ఫలితాలు మార్గం సుగమం చేస్తాయని టీడీపీ–జనసేనతో జతకట్టిన బీజేపీ నమ్ముతోంది.

సార్వత్రిక ఎన్నికల నాలుగోదశలో ఓటింగ్ మొత్తంగా 65శాతం వరకూ ఉంది. పశ్చిమబెంగాల్‌లో అత్యధికపోలింగ్ జరిగితే, 370 అధికరణ రద్దు తరువాత తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో, శ్రీనగర్ పార్లమెంటరీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో అతి తక్కువ శాతం నమోదైంది. దాదాపు 18కోట్లమంది ఓటుచేసిన ఈ నాలుగో దశతో 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 379 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. మే 20, 25, జూన్ 1న మిగతా మూడుదశల పోలింగ్‌తో మొత్తం ప్రక్రియ ముగుస్తుంది. సౌత్‌మే సాఫ్, నార్త్, వెస్ట్ ఔర్ ఈస్ట్ మే హాఫ్ అంటూ ఈ దశతో మోదీ పతనం మరింత ఖాయమైందని కాంగ్రెస్ అంటోంది. వివిధ దశల్లో మోదీ ప్రసంగాల్లోనూ, విమర్శల్లోనూ వచ్చిన మార్పును అది ఎత్తిచూపుతోంది. పాకిస్థాన్ విషయంలో ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యను అన్యాపదేశంగా గుర్తుచేస్తూ, ఇండియా కూటమి నాయకులను మోదీ సోమవారం బిహార్ ఎన్నికల సభలో పిరికిపందలుగా అభివర్ణించారు. అంతటితో సరిపెట్టకుండా, పాకిస్థాన్–గాజులు ప్రస్తావనలను మరో మెట్టు ఎక్కించారు. తమ విజయం ప్రభంజనం లాగా ఉండబోతున్న విషయం ఈ నాలుగో దశతో ఖాయమైందని, ఎన్‌డీఏ 400 సీట్లు దాటి తీరుతుందని మోదీ ప్రకటించిన నేపథ్యంలో, జూన్ నాలుగువరకూ ఓటర్లు సస్పెన్స్ అనుభవించక తప్పదు.

మోదీ సర్కార్ మూడో రాకడ ఖాయం

భారతీయ జనతా పార్టీ 2019 సార్వత్రిక ఎన్నికలలో చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలు సంపాదించింది. 2024లో ఆ ఫలితాలు పునరావృతం కావని ప్రతిపక్ష శిబిరంలో ఉన్నవారు, కుహనా మేధావులు వాదిస్తున్నారు. వారి వాదనలో పసలేదు. ఎందుకంటే 2014 నుంచీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి జనాదరణ పెరుగుతుందే కాని తగ్గడం లేదు. బీజేపీ దిన దిన ప్రవర్ధమానమవుతున్న పార్టీయే కాని కాంగ్రెస్‌లా రోజురోజుకూ వెలుగు తగ్గిపోతున్న పార్టీ కాదు. మోదీ పట్ల ప్రజల విశ్వాసం రోజు రోజుకూ పెరుగుతోందని, ఆయనను అభిమానించే వారి సంఖ్య కోట్లలో ఉంటుందని చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు.

ఇవాళ ఉత్తరప్రదేశ్‌నే చూస్తే అక్కడ డబుల్ ఇంజన్ సర్కార్ అత్యంత పటిష్ఠంగా పనిచేస్తోంది. రాష్ట్రంలో ఒకప్పుడు మహిళలు ఒంటరిగా తిరిగేందుకు భయపడేవారు. ఎక్కడ చూసినా మాఫియా, గూండాగిరీ రాజ్యమేలేది. అభివృద్ధి అనేది ఏ కోశానా కనపడేది కాదు. ఇప్పుడు మోదీ–యోగీ సారథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలవుతున్నాయి. వేల కోట్ల మేరకు సంక్షేమ కార్యక్రమాల నిధులు జనానికి నేరుగా చేరుతున్నాయి. శాంతి భద్రతల పరిస్థితి నూటికి నూరు శాతం మెరుగుపడింది. ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం, కాశీ కారిడార్ నిర్మాణం తదితర చర్యల వల్ల కోట్లాది భారతీయుల ఆధ్యాత్మిక, ధార్మిక మనోభావాల పరిరక్షణ జరిగింది. ఈ పరిస్థితుల్లో కులాల పేరుతో, మైనారిటీల పేరుతో కొన్ని దుష్టశక్తులు ఏకం అయినంత మాత్రాన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మెజారిటీ తగ్గుతుందా? గతంలో కంటే అత్యధిక సంఖ్యలో యూపీలో బీజేపీ సీట్లు సాధించడం ఖాయం.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

యూపీ మాత్రమే కాదు, డబుల్ ఇంజన్ సర్కార్ అమలులో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఉత్తరాఖండ్, హర్యానా, గుజరాత్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం మళ్లీ వీయనుండడంలో సందేహం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మోదీతో చంద్రబాబు–పవన్ కల్యాణ్ చేతులు కలపడంతో ప్రజల్లో సమధికోత్సాహం నెలకొంది. తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం జరుగుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికల తర్వాత తెలంగాణలో కూడా అనతి కాలంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడడం ఖాయమని ప్రజలు విశ్వసిస్తున్నారు.

బీజేపీ గెలుపునకు ఎన్నో కారణాలు చెప్పవచ్చు. మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీని ప్రజలు తమ జీవితాలకు, ఆలోచనలకు సన్నిహితంగా ఉన్న పార్టీగా భావిస్తున్నారు. మోదీకి తప్ప మరెవరికి ఓటు వేస్తాం? అన్న ప్రశ్న ప్రతి సామాన్యుడి మనసులో మెదులుతోంది. మోదీ గత పదేళ్లలో దేశాన్ని అత్యంత పటిష్ఠంగా బలోపేతంగా మారిందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా జరుగుతోందని ఇవాళ ఎవరైనా చెప్పగలరు. మోదీ నిర్భయంగా, ప్రత్యర్థులను చీల్చి చెండాడం, అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠను ఆకాశానికి పెంచడం కూడా అందరూ గమనించారు. అందుకే బీజేపీ ఉద్దేశ పూర్వకంగా మోదీ చుట్టూ ప్రచారాన్ని రూపొందించింది. మోదీ వాగ్దానాలు నెరవేరుస్తారని, ఆయన అనర్గళ ప్రసంగాలు ప్రజలను హత్తుకుంటాయని, ఆయనను మించిన వక్త కానీ, నాయకుడు కాని దేశంలో మరెవరూ లేరని ఇవాళ అందరికీ తెలుసు. ఏదైనా మోదీ ముఖానే కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడడం ప్రజలకు నచ్చుతున్న విషయం ప్రతిపక్షాలు గమనించడం లేదు. వ్యక్తిగతంగా ఆయన అవినీతిపరుడు కాకపోవడం, ఏదైనా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే చేస్తాడని ప్రజలు నమ్మడం వల్ల ఇవాళ ఆయన నాయకత్వానికి తిరుగులేకుండా పోతోంది. నిత్యం కశ్మీర్‌లో చొరబాటుదారులను ప్రేరేపించే పాకిస్థాన్ ఇవాళ ఎందుకు ఆత్మరక్షణలో పడిపోయింది?



రాహుల్ గాంధీ అమేథీ నుంచి పలాయనం చిత్తగించి, తల్లి నియోజకవర్గమైన రాయబరేలీ నుంచి పోటీ చేస్తున్నారు. మిత్రపక్షాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఇచ్చిన సీట్లకు కాంగ్రెస్ పోటీ చేస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ తిరస్కరించినా ఆ పార్టీని ఇండియా కూటమిలో కొనసాగిస్తున్నారు. ఇవన్నీ కాంగ్రెస్ బలహీనతకు నిదర్శనాలు. కాంగ్రెస్‌కి ఈసారి 50 సీట్లు కూడా రావని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ఏ మాత్రం వాస్తవ దూరం కాదని జూన్ 4న తప్పక నిర్ధారణ అవుతుంది.

గతంలో లాగా సంక్షేమ కార్యక్రమాల అమలులో అవినీతి కనపడకపోవడం కూడా మోదీ ప్రభుత్వం పట్ల విశ్వాసం పెంచుతోంది. శౌచాలయాలు, గ్యాస్ కనెక్షన్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఆహార ధాన్యాల పంపిణీ, రైతులకు ఆర్థిక సహాయం, ముద్రా రుణాలు, ఆరోగ్య బీమా ఇవన్నీ ఆచరణలో ఫలితాలను అందిస్తున్నాయి. అందుకే బీజేపీ ఆత్మవిశ్వాసంతో నేరుగా లబ్ధిదారులను చేరుకోగలుగుతోంది. మైనారిటీలంతా సంఘటితమయ్యారని అందువల్ల బీజేపీ ఓడిపోతోందని ప్రతిపక్షాలు చేస్తున్న వాదన కూడా తప్పు. 2019లో కూడా ఇదే వాదన వినిపించినప్పటికీ బీజేపీ అఖండ విజయం సాధించిన విషయం గ్రహించాలి. యూపీలో మైనారిటీలే కనుక బీజేపీని వ్యతిరేకిస్తే మెజారిటీ సీట్లు ఎలా సాధించగలుగుతుంది? అసలు ప్రతిపక్షాలను ప్రజలు ఎందుకు నమ్మాలి? ఈ ప్రశ్నలు ప్రతిపక్షాలు వేసుకుని ఉంటే వాటి పరిస్థితి ఎంతో కొంత మెరుగుపడేది. ప్రతిపక్షాల అరున్నర దశాబ్దాల పాలనను, మోదీ పది సంవత్సరాల పాలనను ప్రజలు గమనించరని వారు అనుకోవడం పొరపాటు. ప్రతిపక్షాల హయాంలో జరిగిన విచ్చలవిడి అవినీతి ఆశ్రిత పక్షపాతం, పెచ్చరిల్లిన ఉగ్రవాదం, కశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన దారుణాలు, మతకల్లోలాలు, ఆర్థిక సంక్షోభంతో పాటు రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసిన తీరు, ముఖ్యమంత్రులను పదే పదే మార్చిన తీరు ఇవన్నీ ప్రజలు మరిచిపోలేదు. ఇవాళ కులాల పేరుతో, సామాజిక న్యాయం పేరుతో రాహుల్‌గాంధీ చిలుకపలుకులు పలికినంత మాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. మీ జమానాలో సామాజిక న్యాయం ఏమైంది? గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ కనీస ఆదాయ గ్యారంటీ పేరుతో ప్రచారం చేశారు కాని ఓటర్లలో ఒక్కరు కూడా ఈ హామీని విశ్వసించలేదు. ఇప్పుడు సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ అంటూ మాట్లాడినంత మాత్రాన ప్రజలు విశ్వసిస్తారా?

మోదీ పట్ల ప్రజలకు బలమైన నమ్మకం ఎందుకు ఏర్పడింది? కాంగ్రెస్ పాలన కంటే మోదీ పాలన అన్ని విధాల మెరుగ్గా ఉండడమే. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మోదీ పాలనకు గీటురాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, నక్సలిజం వంటివి తోకముడిచాయి. మైనారిటీ వాదానికి కాలం చెల్లింది. వీటన్నిటికి తోడు బీజేపీ అత్యంత బలోపేతమైన పార్టీగా నలుమూలలా విస్తరించింది. ప్రతిపక్షాల పట్ల జనం విశ్వాసం కోల్పోవడం వల్లనే ఇవాళ బీజేపీ తిరుగులేని పార్టీగా మారింది.

అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యంత ఆత్మవిశ్వాసంతో ఎన్డీఏ 400 సీట్లు దాటి తీరుతుందని నాలుగో దశ ఎన్నికల తర్వాత మరోసారి ప్రకటించారు. రాహుల్‌గాంధీ అమేథీ నుంచి పలాయనం చిత్తగించి, తల్లి నియోజకవర్గమైన రాయబరేలీ నుంచి పోటీ చేయడం, సమాజ్‌వాది పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, ఎన్‌సీపీ, శివసేన వంటి పార్టీల దయదాక్షిణ్యాలపై ఆధారపడి ఇచ్చిన సీట్లకు కాంగ్రెస్ పోటీ చేయడం, తృణమూల్ కాంగ్రెస్ తిరస్కరించినా ఆ పార్టీని ఇండియా కూటమిలో కొనసాగించడం ఇవన్నీ కాంగ్రెస్ బలహీనతకు నిదర్శనాలు. కాంగ్రెస్‌కి ఈసారి 50 సీట్లు కూడా రావని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ఏ మాత్రం వాస్తవదూరం కాదని జూన్ 4న తప్పక నిర్ధారణ అవుతుంది.


(బీజేపీ జాతీయ కార్యదర్శి)

ఇజ్రాయెల్ డొల్లతనాన్ని బైటపెట్టే యూదు ప్రతిఘటన

గత కొన్ని వారాలుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న నరమేధం ఆపాలని భిన్న జాతుల, మతాల, దేశాల విద్యార్థులు, భారతీయ సంతతి విద్యార్థులతో సహా, అమెరికన్ విశ్వవిద్యాలయాలలో తీవ్ర నిరసనలు జరుపుతున్నారు. దాదాపు 120కి పైగా విశ్వవిద్యాలయాల్లో టెంట్లు వేసుకుని తమ విశ్వవిద్యాలయాల పాలక మండళ్ళ ఇజ్రాయెల్‌కి చెందిన లేక సంబంధమున్న కంపెనీలలో పెట్టిన పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని, ఆయా లాభాలని వాడుకోవటం అది జరుపుతున్న నరమేధంలో పాలు పంచుకున్నట్లేనని వారు వాదిస్తున్నారు. ఇవే నిరసనలు ఇంగ్లాండు, ఫ్రాన్స్‌లలో కూడా ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల వీధుల్లో కొన్ని నెలలుగా జరుగుతున్న నిరసనలకు ఇవి కొనసాగింపు. ఈ నిరసనల్లో ప్రధాన అంశం – ఇజ్రాయెల్‌కు, జయోనిజానికి (అంటే యూదు మత రాజ్య భావనకు) వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యూదులు పోషిస్తున్న కీలక పాత్ర.

అక్టోబర్ 7న హమాస్ దాడుల తర్వాత, ప్రపంచ వ్యాప్తంగా జయోనిస్టులు, అమెరికన్ మితవాదులు, మన దేశంలో హిందుత్వ వాదులు ఇస్లామోఫోబియా (ముస్లిం ద్వేషం) అనే మౌలిక భూమికపైన ఏకమై పాలస్తీనా ప్రజల స్వతంత్ర ఆకాంక్షకు, వారి ప్రతిఘటనకు వ్యతిరేకంగా ఉధృతమైన ప్రచారం ప్రారంభించారు. దీని సారాంశం వందేళ్ళ పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని హమాస్‌కు, హమాస్‌ని అక్టోబర్ 7 ఘటనకు, ఆ ఘటనని ఒక టెర్రరిస్టు చర్యకు కుదించటం; అలాగే 75ఏళ్ల ఇజ్రాయెల్ చేస్తూ వచ్చిన దురాక్రమణని, దౌర్జన్యాన్ని, క్రూర హింసని 'హిట్లర్ నరమేధానికి గురయిన యూదుల ఆత్మరక్షణ చర్యలు'గా అర్థం చేసుకోవాలని అందరికీ చెప్పటం. ఈ ప్రచారంలో పాలస్తీనా అరబ్బుల ప్రతిఘటన ఇస్లామిక్ టెర్రరిజంగానూ, అన్ని అంతర్జాతీయ మానవతా చట్టాలనూ ఉల్లంఘిస్తూ వచ్చిన ఇజ్రాయెల్ 'బాధిత' సమాజంగానూ కనిపిస్తారు. అక్టోబర్ 7 తర్వాత ఇజ్రాయెల్ గాజాపై కనీ వినీ ఎరుగని రీతిలో జరిపిన నరమేధాన్ని సరయిన 'ప్రతి చర్య'గా సమర్థించటమే ఈ ఊదరగొట్టే ప్రచార ఉద్దేశం.

ఇలా చెయ్యటం ఇజ్రాయెల్ పాలకులకు, దాని అమెరికన్, యూరోపియన్ సమర్థకులకు కొత్త కాదు. 1950ల నుండే వాళ్ళా ప్రచార ఆయుధాల్ని సమకూర్చుకుని, ఎప్పటికప్పుడు పదును పెట్టుకుంటూ వాడుకుంటున్నారు. దానికి కావాల్సినంత డబ్బు తమ సంస్థలు, లాబీలు, ట్రస్టుల ద్వారా వాళ్ళు ఖర్చుపెట్టి తమక్కావాల్సింది చేయించుకుంటారని 'ది ఇజ్రాయెలీ లాబీ' అనే పుస్తకం రాసిన అమెరికన్ యూదు విదేశాంగ విధాన నిపుణులు 2006లోనే బయటపెట్టారు. ఇజ్రాయెల్ తన దేశంలోనే కాక ఇతర దేశాల్లో కూడా పిల్లలకి స్కూళ్లు స్థాపించి వాటిల్లోనూ, ప్రపంచ వ్యాప్తంగా యూదు యువతకి తన సైన్యంలోకి ఆహ్వానించి ట్రైనింగ్‌లో భాగంగా ఈ ప్రాపంచిక దృక్పథాన్ని బాగా నూరిపోస్తూ ఉంటుంది. ప్రపంచంలో యూదులు తప్ప ఇంకెవరూ నరమేధానికి గురి కాలేదని, కాబట్టి పురాణాల్లో వున్న విధంగా పాలస్తీనాపై యూదులకి తప్ప అరబ్బులకి ఏ మాత్రం హక్కులుండకూడదని, వారు వెళ్లిపోకుండా అక్కడుండటం తన అస్తిత్వానికే ముప్పని, ప్రపంచం ఎట్లా గొట్లా వారిని ఇజ్రాయెల్ నుండి వెళ్లిపోయేలా తనకి సహకరించాలని నెతన్యాహూతో సహా అనేక మంది యూదు రాజ్య భావనని మోసే యూదులు నమ్ముతారు. అసలు నరమేధం అనే మాట ఇంకెవరికీ వాడకూడదని కూడా ఈ జయోనిస్టు యూదులు వాదిస్తుంటారు. ఆఫ్రికాలో, అమెరికాలో ఐరోపా వలస రాజ్యాలు నల్ల జాతీయులు, స్థానికులు, భారతీయులపై జరిపిన అనేక మారణకాండలు, ఇంకా ఆటోమాన్ సామ్రాజ్యం రొమేనియన్లపై జరిపిన నరమేధం, రువాండాలో హుతీలు, టూట్సీలపై, అలాగే కోసోవోలో ముస్లింలపై జరిపిన మారణకాండల కంటే తమదే తీవ్రమైందని తెల్లజాతికి చెందిన ఈ జయోనిస్టు యూదులు బలంగా నమ్ముతారు. అది పునరావృతం కాకుండా ఉండాలంటే ఎంతకయినా తెగించాలి అని బలంగా నమ్మే వీళ్ళు 1948లో పాలస్తీనా నుండి స్థానిక 8 లక్షల అరబ్బులని వెళ్లగొట్టి ఆ తర్వాత వారి వ్యవసాయ భూములని స్వాధీనం చేసుకుని, వారి ప్రాంతాలని ఆక్రమించి పైగా వారి పట్ల దయ చూపకుండా జాతి వివక్ష, జాత్యహంకారంతో రెండవ శ్రేణి పౌరులుగా చూస్తూ, దాన్ని 'ఆత్మరక్షణ' పేరుతో, 'అరబ్బుల/ముస్లింల అనాగరికత, హింసాత్మకత' పేరుతో గత 75 ఏళ్లుగా సమర్థించుకుంటూ వచ్చారు.



పాలస్తీనా కోసం జరుగుతున్న నిరసనల్లో యూదులు ముందున్నారనే పరిజ్ఞానం జయోనిస్టుల కథనాన్ని నిర్వీర్యం చేస్తుంది. పాలస్తీనా కోసం నిరసనలు 'యూదు వ్యతిరేకమైనవే' అన్న నిందకి విశ్వసనీయత లేకుండా చేస్తుంది. పాలస్తీనాలో జరుగుతోంది ముస్లిములకూ యూదులకూ జరిగే మతపరమైన యుద్ధం కాదని, కేవలం పాలస్తీనా వనరులపై మనుషులపై ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్‌ని జాత్యహంకార రాజ్యంగా జయోనిస్టులు తయారు చేశారన్నది బయటికి తెస్తుంది.

పాలస్తీనా ప్రజలు తమపై రుద్దబడిన ఈ వలస, జాత్యహంకార పాలనకి వ్యతిరేకంగా జరుపుతూ వచ్చిన పోరాటానికి వలస పాలన నుండి బయట పడిన అనేక మూడవ ప్రపంచ దేశాలు, భారతదేశంతో సహా, ఈ మధ్య వరకూ సహానుభూతి ప్రకటిస్తూనే వచ్చాయి. అమెరికాలో కూడా ఇజ్రాయెల్ సైన్యంలో పనిచేసింతర్వాత జయోనిస్టు దృక్పథం మార్చుకున్న వాళ్ళు ఒక రకమైతే, ఆఫ్రికన్ అమెరికన్ నిరసనల్లో 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్'లో పాల్గొన్న క్రమంలో పాలస్తీనా గురించి అర్థం చేసుకున్న యువత రెండవ రకం. వీళ్ళందరూ 'ఇఫ్ నాట్ నౌ' అనే సంస్థ స్థాపించి గత దశాబ్దం కాలంగా జయోనిజానికి వ్యతిరేకంగా నిరసన చేస్తున్నారు. వీళ్ళు కాకుండా యూదు మత స్ఫూర్తితో పనిచేసే సనాతన యూదులతో సహా, నరమేధం తమకే కాదు ఎవరిపైనా జరక్కూడదు అనే రాజకీయ స్పృహ వున్న యూదులతో కూడుకున్న 'జూస్ ఫర్ పీస్' అనే సంస్థ చాలా చోట్ల వ్యాపించి, అధికారంలో వుండే జయోనిస్టు యూదుల ప్రభావాన్ని తగ్గించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఐరోపాలో కూడా నవమోడ్ (ఇంగ్లాండ్) జ్యూయిష్ వాయిస్ (జెర్మనీ), ఇటువంటి సంస్థలు వచ్చాయి. అక్టోబర్ నుండి ఇజ్రాయెల్ చేస్తున్న నరమేధం వీరిని మరింత బలోపేతం చేసి రోడ్ల మీదకి తెచ్చాయి. యూదు మతం గాని, యూదుల చరిత్ర గాని ఇతరులని అణిచివేసి, వారిని చంపేవి కాదని, ఇజ్రాయెల్ రాజ్యం చేస్తోంది ఈ రెండింటి స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకమని వీళ్ళు నొక్కి చెప్తున్నారు.

న్యాయం, శాంతి, ప్రజాస్వామ్యం, జాతి వివక్ష నిర్మూలన, వలస వాద ప్రభావం, సామ్రాజ్యవాదం గురించి తరగతి గదుల్లో నేర్చుకునే యూనివర్సిటీ విద్యార్థులు వాటి కోసం పోరాటానికి దిగటం పెద్ద వింతేమీ కాదు. ఇవి బోధించే అధ్యాపకులు కూడా వీరికి మద్దతు నివ్వటం సహజమే. క్యాంపస్‌లలో యూదు విద్యార్థులు పాలస్తీనా, అరబ్బు విద్యార్థులతోనే కాక, ఆఫ్రికన్ అమెరికన్ విద్యార్థులతో కూడా కలిసి పని చేస్తున్నారు. ఆఫ్రికన్ అమెరికన్ ఉద్యమకారులు పాలస్తీనా విముక్తి కోసం జరుగుతున్న ఉద్యమంతో సంఘీభావం తెలపటం 1960ల్లోనే ప్రారంభమయినప్పటికీ, జార్జ్ ఫ్లాయిడ్ హత్య సమయంలో పాలస్తీనా ఉద్యమకారులు పోలీసులతో ఎట్లా నెగ్గుకురావాలో సోషల్ మీడియాలో సలహాలివ్వటం తర్వాత పెరిగిందని ప్రముఖ నల్లజాతి రచయిత తా నెహసి కోయెటీస్ చెప్తారు. ఆయన, మరికొంత మంది నల్లజాతి మేధావులు, ఉద్యమకారులు వెస్ట్ బ్యాంకుకి వెళ్లటంతో అక్కడ ఇజ్రాయెల్ పాటిస్తున్న జాతి వివక్ష, సెగ్రిగేషన్ ఈ తరం వాళ్లందరికీ అర్థమై ఈ సంఘీభావానికి దారి ఏర్పడిందని అయన అంటారు. విద్యార్థుల నిరసన శిబిరానికి వచ్చిన ఏంజెలా డేవిస్ '1960ల నుండి నేను ఇటువంటి నిరసనల కోసం ఎదురుచూస్తున్నాను. మీరు చేస్తున్న నిరసనలు చరిత్రాత్మకమైనవి' అని చెప్పటం ఈ సంఘీభావ లోతుని తెలుపుతుంది.

పాలస్తీనా కోసం జరుగుతున్న నిరసనల్లో యూదులు ముందున్నారనే పరిజ్ఞానం జయోనిస్టుల కథనాన్ని నిర్వీర్యం చేస్తుంది. పాలస్తీనా కోసం నిరసనలు 'యూదు వ్యతిరేకమైనవే' అన్న నిందకి విశ్వసనీయత లేకుండా చేస్తుంది. పాలస్తీనాలో జరుగుతోంది ముస్లిములకూ యూదులకూ జరిగే మతపరమైన యుద్ధం కాదని, యూదులూ అరబ్బుల మధ్య ఏ జన్మ వైరుధ్యం లేదని, కేవలం పాలస్తీనా వనరులపై మనుషులపై ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్‌ని జాత్యహంకార రాజ్యంగా జయోనిస్టులు తయారు చేశారని బయటికి తెస్తుంది. జరుగుతున్న నరమేధానికి ఇజ్రాయెల్ కూడగట్టాలని చూస్తున్న నైతిక, ఆర్థిక బలాన్ని దెబ్బతీస్తుంది. అందువల్లే కాబోలు పద్ధతి ప్రకారం, నిర్దిష్టమైన డిమాండ్లతో, శాంతియుతంగా, యూనివర్సిటీ కేటాయించిన చోటులో జరుగుతున్న విద్యార్థి నిరసనలని అణచటానికి వారి పైకి యుద్ధానికెళ్ళే సైనికుల మాదిరి గన్నులు, బుల్‌డోజర్లతో పోలీసులని పంపించి దౌర్జన్యానికి పాల్పడుతున్నాయి ప్రభుత్వాలు. ఈ చర్యలు ఆయా దేశాల్లో రాజకీయాలకి, పెట్టుబడిదారులకి, ఇజ్రాయెల్‌తో వున్న గాఢమైన సంబంధాన్నే గాక, జరుగుతున్న నిరసనలు యథాస్థితి వాదాన్ని ఎంత భయపెడుతున్నాయో కూడా సూచిస్తున్నాయి.

■ ఎ. సునీత

ఈ రాజ్యానుకూల వాదనలు ఎక్కడ్నించి?

'ఈ దేశం నాకేమిచ్చింది అని కాకుండా నేను ఈ దేశానికి ఏమి ఇచ్చాను' అని ప్రతి పౌరుడు భావించాలి అంటూ సత్యానంతరవాదులు కుహనా జాతీయవాదంతో ఆకట్టుకునే నినాదాలు చేస్తారు. 'హక్కుల గురించి కాదు బాధ్యతల గురించి మాట్లాడాలి' అని మరో వాదన ఈ మధ్యకాలంలో మరింత ఎక్కువగా వినిపిస్తోంది. ఈ రెండు వాదనలు రాజ్యం తన విధుల నుండి తప్పించుకోవడానికి రక్షణ కవచంగా నిలుస్తాయి. భావోద్వేగంతో పౌరులు రాజ్యాన్ని ప్రశ్నించకుండా తమ హక్కులను తామే భూస్థాపితం చేసుకునేలా చేస్తాయి. అధికారాన్ని చేపట్టిన సిద్ధాంతరహిత రాజకీయ నాయకులైనా లేదా అధికారాన్ని చెలాయించే బూర్జువా సిద్ధాంతాల అధికారులైనా పై వాదనలతో ఏకీభవిస్తారు. సరిగ్గా అలాంటి కోవలోకే లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ ఆంధ్రజ్యోతిలో ఏప్రిల్ 21 నాడు రాసిన వ్యాసం వస్తుంది.

కేంద్ర ప్రభుత్వం మోకాలు అడ్డుపెట్టడం వలన తాము రాజ్యాంగ బద్ధమైన ఆర్టికల్ 293 ప్రకారం రుణాలను పొందలేకపోతున్నా'మని కేరళ రాష్ట్రం సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యాన్ని ఉటంకిస్తూ జయప్రకాశ్ నారాయణ ఈ వ్యాసాన్ని రాశారు. ఒక రాష్ట్రం తమ జీడిపి (స్థూల జాతీయోత్పత్తి)లో 40శాతం వరకు రుణాలను పొందవచ్చు అన్న నిబంధనను అనుసరించి కేరళ రాష్ట్రం ఇప్పటికే 36.5శాతం రుణాలను పొందినట్టుగా, అది దేశంలో అన్ని రాష్ట్రాల వారీగా అప్పులను చూసినప్పుడు 11వ స్థానంలో ఉన్నట్టుగా, మొదటి స్థానంలో అరుణాచల్ ప్రదేశ్ స్థూల జాతీయోత్పత్తిలో 53శాతం రుణాలు పొంది ఉన్నట్లుగా పి.ఆర్.ఎస్ లెజిస్ట్రేషన్ రీసెర్చ్ వారు సమర్పించిన నివేదిక అనుసరించి ఫోర్బ్స్ ఇండియా రిపోర్టు 2023–24 ఈ మధ్య కాలంలోనే వెలువరించింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన నిర్ణయాధికారంతో కచ్చితంగా రాష్ట్రాలను నిలువరించవచ్చు. రాష్ట్రాలు తమ న్యాయబద్ధమైన అంశాన్ని కోర్టుల ద్వారా పరిష్కరించుకోవచ్చును కూడా.



రాజ్యాన్ని ప్రశ్నించకుండా అది అమల్లోపెట్టే భావోద్వేగపు అంశాలకు ప్రభావితమైనప్పుడు దాన్ని స్తుతించడంలో భాగంగా ఆర్థిక మూలాలపై సైతం ప్రతిస్పందించడంలో వైఫల్యాలు జరుగుతాయి. అలాంటి వైఫల్యం డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వ్యాసంలో కనిపించింది.

కేంద్ర రాష్ట్రాల విధివిధానాలకు మాత్రమే పరిమితం కాకుండా జయప్రకాష్ నారాయణ ప్రస్తావించిన ఇతర అంశాలే ఈ సందర్భంగా మరింత కలవరపెడుతున్నాయి. ఎవరి ఖర్చులైనా రోజువారి స్థిర ఆదాయంలోపే ఉండాలి అని చెప్పే వారి మొదటి వాదనను ఒకసారి స్వతంత్ర భారత పునర్నిర్మాణానికి వేసిన తొలి కమిటీ 'బాంబే ప్లాన్'ను ఉటంకిస్తూ పునః పరిశీలించుకుని చూసుకుంటే మంచిది. 'మీ దగ్గర మౌలిక వసతులు లేవు, పారిశ్రామికీకరణ జరగలేదు, ప్రభుత్వానికి ఆదాయం లేదు... ఇన్ని సమస్యలతో స్వతంత్ర దేశాన్ని ఎలా నిర్మించుకుంటారు' అని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం వేసిన ప్రశ్నకి సమాధానం చెప్పడం కోసమే 'బాంబే ప్లాన్' అనే ఎనిమిది మంది సభ్యుల కమిటీని స్వతంత్రం రాకముందే నాటి పెద్దలు వేశారు. ఆ కమిటీ మూడు ప్రతిపాదనలు చేసింది: ఒకటి– చిన్న మొత్తాల పొదుపులను సేకరించి మౌలిక వసతులను పెంచుకోవడానికి ఉపయోగించుకోవడం; రెండు– డెఫిసిట్ ఫైనాన్సింగ్ విధానాన్ని పాటించడం (రుణాలు సేకరించడం); మూడు– పన్నుల వసూలు. ఇందులో భాగంగానే రష్యా సహకారంతో భిలాయ్ ఇనుము ఉక్కు కర్మాగారాన్ని, జర్మనీ సహకారంతో రూర్కెలా ఇనుము ఉక్కు కర్మాగారాన్ని, బ్రిటన్ సహాయంతో దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తూ 1950వ దశకంలో పారిశ్రామికీకరణకు పెద్దపీట వేశారు. దానితో పాటుగా బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగాలను జాతీయీకరిస్తూ సేకరించబడిన చిన్న మొత్తాల ద్వారా అనేకానేక ప్రాంతాలలో పారిశ్రామిక వాడలు వెలిసి ఖనిజ సంపదకు సంబంధించి, చమురు ఉత్పత్తికి సంబంధించి వివిధ సంస్థలు ఏర్పాటై ఆర్థిక పటిష్టతకు మూలాలు పడ్డాయి. అదే సందర్భంలో భారీ బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయ రంగానికి, మౌలిక వసతుల కల్పనకు చేయూతనిచ్చారు. అప్పులు సేకరించడమే పాపం అయితే ఈ మాత్రం పునాది పడేదే కాదు.

అప్పులు చేయనిదే ఈ రోజుల్లో ఇల్లు నిర్మించడం దాదాపు అసాధ్యమైన ఒక చిన్న వాస్తవాన్ని రచయిత విస్మరించారు. చేసిన అప్పులు తీర్చడానికి వ్యక్తులకైతే స్థిరమైన ఉపాధి, ప్రభుత్వాలకైతే ఎగవేయబడని న్యాయబద్ధమైన పన్నుల విధానం ప్రధానం. చాలా బాధాకరమైన విషయం ఏమంటే అమాయక మధ్యతరగతి ప్రజల ఆ మాత్రం పొదుపులను కూడా వారికి మిగల్చకుండా స్టాక్ మార్కెట్ అనే మాయా జూదంలోకి లాగి బడా కార్పొరేట్లు నొక్కేస్తూ ఉండే విధానానికి అందరూ వంతపాడతారు. ఎందుకంటే పెట్టుబడి పెట్టిన వారికి నష్టం వస్తే ఆ పెట్టుబడి స్వీకరించిన కంపెనీకి బాధ్యత వహించే అవసరం లేదు కాబట్టి.

కాళేశ్వరం ప్రాజెక్టును ఉటంకిస్తూ అప్పుల్ని పెట్టుబడులకి ఉపయోగిస్తే సరిపోదు ఆస్తుల్ని పెంచడంపై చేసే వ్యయం సద్వినియోగం కావాలి అంటూ మరో అంశంగా జయప్రకాష్ నారాయణ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక రాజకీయ వివాదం అయిన మాట వాస్తవమే. దానిపై ఏకాభిప్రాయ సేకరణ జరగకుండా ఆనాటి ప్రభుత్వం దుందుడుకుగా సాగిన మాట అప్పట్లో చర్చనీయాంశం అయింది. ప్రాజెక్టు నాణ్యత, దానికి అయిన వ్యయం ఖచ్చితంగా చర్చనీయాంశాలే. అయితే భారీ ప్రాజెక్టుల నిర్మాణం, అందులోనూ నీటి నిల్వకు సంబంధించిన ప్రాజెక్టుల నిర్మాణం కచ్చితంగా భవిష్యత్తులో ఫలితాలను ఇవ్వగలదు. ఎందుకంటే ఇంకిపోతున్న భూగర్భ జలాలను పరిరక్షించుకునే అవకాశాలు తక్కువగా ఉన్నచోట నీటి నిలువల ప్రాజెక్టులు అత్యంత అవసరం. వేల కొలది చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అయిపోతున్నప్పుడు నీటి నిల్వల సామర్థ్యాన్ని పెంచుకోవడం నేటి ఆవశ్యకత. జూరాల, రామన్‌పాడు ప్రాజెక్టులు; శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యాంలు లేకపోతే నేటి హైదరాబాదు నీటికి కటకట లాడాల్సిందే.


ఇక పరిమితికి మించిన అప్పులు చేయరాదు అంటూ ముక్తాయించారు వ్యాసకర్త. ఇది సరైనదే. కానీ కేరళ ప్రభుత్వ అంశంలో గణాంకాలు భిన్నంగా ఉన్నవి. ఎఫ్ఆర్‌బిఎం (ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనలకు లోబడి అప్పులు చేసినట్లుగా పైన పేర్కొన్న నివేదికలు బహిర్గతపరిచాయి. అయినప్పటికీ రాష్ట్రాలపై అజమాయిషీ కేంద్రానికి ఉన్నది. కానీ సమాఖ్య విధానాలను సరిగా అమలుపరచడం లేదన్న వాదన మాత్రమే కాకుండా గత సంవత్సరం దక్షిణాది 4 రాష్ట్రాలన్నీ ఢిల్లీలో తమకు రావాల్సిన పన్నుల వాటా గురించి ఉమ్మడిగా ధర్నా చేయవలసిన దుస్థితి ఏర్పడింది. జీఎస్టీ అమల్లోకి తెచ్చిన తర్వాత సర్‌చార్జి లేదా సెస్సులు విధించే అంశాల సంఖ్య తగ్గినప్పటికీ వసూలు చేసే మొత్తం భారీగా పెరిగింది. ఈ ఒక్క ఏడాదిలోనే సర్‌చార్జి, సెస్‌ల రూపంలో రూ.5.5లక్షల కోట్లు వసూలు చేయబోతున్నట్టుగా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించడం జరిగింది. ఇలా వసూలు చేయబడిన సర్‌చార్జీ, సెస్సులలో రాష్ట్రాలకు ఎలాంటి వాటా ఉండకపోవడం ఒక దమన నీతియే! ఆదాయాల ప్రాతిపదిక కాకుండా జనాభా ప్రాతిపదికన ఆశ్రిత పక్షపాతంతో కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించినప్పుడు మిగతా రాష్ట్రాల అభివృద్ధి కనీసం ఇతర మార్గాల ద్వారానైనా జరగాలిగా. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ అప్పుల ఊబిలో కూరుకుపోలేదని చెప్పడానికి వీల్లేదు. 2011–12లో రూ.45.17లక్షల కోట్ల అప్పు ఉంటే, 2018–19లో అది రూ.90.84లక్షల కోట్లకు చేరింది. అది కాస్త 2024–25 సంవత్సరానికి గాను 183.67 లక్షల కోట్లుగా ఉన్నది. పరిమితి ఉందో లేదో చూసుకోవాల్సినది కేంద్రం బాధ్యతనే. కానీ లోపభూయిష్టమైన పన్నుల విధానం వల్ల, ముఖ్యంగా పరోక్ష పన్నులను 60 శాతానికి మించి వసూలు చేస్తున్న ఏకైక దేశంగా ఉండడం వల్ల, ధనిక స్వాములు పన్ను రాయితీ పొందడం వల్ల దేశానికి ఈ రుణ భారం తడిసి మోపెడు అవుతుందన్న వాస్తవాన్ని మర్చిపోరాదు.

రాజ్యాన్ని ప్రశ్నించకుండా అది అమల్లోపెట్టే భావోద్వేగపు అంశాలకు ప్రభావితమైనప్పుడు దాన్ని స్తుతించడంలో భాగంగా ఆర్థిక మూలాలపై సైతం ప్రతిస్పందించడంలో వైఫల్యాలు జరుగుతాయి. అలాంటి వైఫల్యం డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గారి వ్యాసంలో కనిపించింది. కచ్చితంగా వారు పునరాలోచిస్తారని భావించాలి.

● జి. తిరుపతయ్య

బహు ప్రక్రియల్లో బలమైన ముద్ర

తెలుగు సాహిత్యంలో నవలలు, కథలు, కవితలు, నాటకాలు, ప్రబంధాలు, గద్యాలు, పద్యాలు... ఇలా ఎన్నో రకాల సాహితీ ప్రక్రియల్లో రచనలు చేసిన కలం యోధుడు, కవి దివిజుడు చందాల కేశవదాసు (1876–1956). తన రచనలలో భక్తి, నీతి తత్వాలను చక్కగా ప్రతిబింబించాడు. ఆయన సినీ గీత రచయిత, నటుడు, గాయకుడు, హరికథా కళాకారుడు, అష్టావధాని, శతావధానిగా కూడా ప్రసిద్ధుడు. కేశవదాసు 15 నాటకాలను రచించారు. వీటిలో 'కనకతార'ను (1906) తెలుగులో మొదటి నాటకంగా పరిగణిస్తారు. ఈ నాటకం భారతీయ నాటక సంప్రదాయాలను అనుసరిస్తూనే, సామాజిక సందేశాన్ని కూడా అందించింది. ఆయన రచించిన ఇతర ప్రముఖ నాటకాల్లో 'సత్యహరిశ్చంద్ర', 'విక్రమార్క విజయం' వంటివి ఉన్నాయి. కేశవదాస్‌కు తెలంగాణ హరికథ పితామహుడిగా కూడా పేరున్నది. తెలుగు సినిమాకు మొదటి పాటల రచయితగా కూడా ఆయన్ను పేర్కొంటారు. 1931లో విడుదలైన తొలి తెలుగు టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద'కు చందాల కేశవదాస్ రాసిన పాటలు చాలా ప్రాచుర్యం పొందాయి. వీటిలో 'భలే మంచి చౌక బేరము' అనే పాట ఎంతో ప్రసిద్ధి పొందింది. ఆ తరువాత 'సత్యహరిశ్చంద్ర' (1932) చిత్రానికి కూడా పాటలు రాశారు. 1933–1935 సంవత్సరాలలో తిరువూరు ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశభక్తి పాటలను రచించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. 1947–48 మధ్య జరిగిన హైదరాబాద్ స్వతంత్ర పోరాట ఉద్యమంలోనూ కీలక పాత్ర వహించారు. నాడు ఆయన ఇంటిపై రజాకార్లు దాడి చేసి ఆస్తి మొత్తాన్ని ధ్వంసం చేశారు, రచనలు సైతం కాల్చివేశారు. చందాల కేశవదాస్ రచనలలో భక్తి, నీతి, సామాజిక సందేశాలు ఎక్కువగా కనిపిస్తాయి. కేశవ దాస్ తర్వాత వచ్చిన ఎన్నో తరాలు రచయితలకు, నటులకు స్ఫూర్తిగా నిలిచారు. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక యుగ పురుషుడు.




– పూసపాటి వేదాద్రి

(నేడు చందాల కేశవదాసు వర్ధంతి)

కేకేఆర్ స్మారక ప్రసంగం

ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు ఆచార్య కె.కె. రంగనాథాచార్యుల (కేకేఆర్) తృతీయ వర్ధంతి సమావేశం రేపు సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరుగనున్నది. కేకేఆర్ స్మారకంగా 'ఆధునికత–ఆధునికానంతరత' అంశంపై తత్వశాస్త్ర ఆచార్యులు అడ్లూరి రఘురామరాజు ప్రసంగిస్తారు. అనంతరం 'కేకేఆర్ సాహితీ వ్యక్తిత్వం' (ప్రసంగ వ్యాసాలు) పుస్తకావిష్కరణ జరుగుతుంది.

– కుటుంబసభ్యులు, మిత్రులు



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.9 కనిష్ఠం 23.5





తొలిసారి ఓటేసిన యువతీ యువకులు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువతి మురిపెం



నార్సింగ్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల క్యూ



7.30 పీఎం : సనత్‌నగర్‌లోని బూత్ నంబర్ 221లో క్యూలో ఉన్న ఓటర్లు

భవితవ్యం నిక్షిప్తం

గ్రేటర్‌లో పరిధిలో పోలింగ్ ప్రశాంతం

- హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో స్వల్ప ఉద్రిక్తత
- పోలింగ్ కేంద్రంలో మహిళ హిజాబ్ తొలగించమన్నందుకు మాధవీలతపై కేసు
- బీబీ బజార్ విక్టోరియా కేఫ్ వద్ద మాధవీలత, మజ్లిస్ పోటాపోటీగా నినాదాలు..
- ఓటు వేసి గుండెపోటుతో వయోధికురాలు మృతి
- పలు ప్రాంతాల్లో మొరాయించిన ఈవీఎంలు
- ఆలస్యంగా పోలింగ్ మొదలు



గ్రేటర్‌లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చిన్నా, చితక ఘటనలు మినహా ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మాత్రం స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని..



వీల్‌చైర్‌లో ఓటేసేందుకు వచ్చిన మహిళ

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరాంగణంలో కీలకమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. సోమవారం జరిగిన పోలింగ్ నేపథ్యంలో ఓట్లు వేసిన ప్రజలు అభ్యర్థులకు టెన్షన్ మిగిల్చారు. ఎన్నికల్లో ఎవరికి ఓటు వేశామనే విషయాన్ని వెల్లడించేందుకు చాలా మంది ఆసక్తి చూపించలేదు. కాగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి ఓటు వేసిన అనంతరం పోలింగ్ కేంద్రం వద్ద పడిపోయింది. సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ గోషామహల్‌లోని రహీంపురా ఎస్ఎస్‌కే కాలేజీలోని పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో వాగ్వాదానికి దిగారన్న ప్రచారం జరిగింది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటలకు మొదలైన ఓటింగ్ కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల తరువాత కూడా సాగింది. మధ్యాహ్నం సమయంలో మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రం తిరిగి ఊపందుకుంది. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో 45.07 శాతం, సికింద్రాబాద్ లోక్‌సభలో 48..11 శాతం పోలింగ్ నమోదైంది. శివార్లలోని మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలా 46.27 చేవేళ్లలో 53.13 పోలింగ్ శాతం నమోదైంది. హైదరాబాద్ జిల్లాలోని

మిగతా 6వ పేజీలో..

స్వల్పంగా పెరిగిన పోలింగ్...

మహానగరంలో పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మెజార్టీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో నవంబర్‌లో జరిగిన శాసనసభా ఎన్నికల్లో 45.61 శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుతం 46.08గా ఉంది. దాదాపు 1 శాతం పోలింగ్ పెరిగింది సికింద్రాబాద్ లోక్‌సభలో పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో 50.58 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోగా... ఇప్పుడు 48.11 శాతం మంది ఓటు వేశారు. దాదాపు 2 శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనలేదు. మల్కాజిగిరిలో 54.26 శాతం కాగా.. ప్రస్తుతం ఇది కొద్దిగా తగ్గి 46.27గా నమోదైంది. చేవెళ్లలో ప్రస్తుత పోలింగ్ 55.45 శాతం కాగా.. ఇటీవలి ఎన్నికల్లో 66.35 శాతం మంది ఓటు వేశారు. చేవెళ్లలో మాత్రం ఓటింగ్ శాతం తగ్గింది. బస్తీల్లోని పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ శాతం కొంత మెరుగ్గా ఉండగా.. కాలనీల్లో గతం కంటే భారీగా తగ్గింది. కాగా, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో 46.5, హైదరాబాద్‌లో 44.84, మల్కాజ్‌గిరిలో 49.63, చేవెళ్లలో 53.25 శాతం పోలింగ్ శాతం నమోదైంది.



కుటుంబసభ్యులతో కలిసి మసీదు బండ చిరాక్ స్కూల్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్



ఆదరణ ఎవరికి?

- గెలుపుపై ప్రధాన పార్టీల ధీమా

- అసెంబ్లీతో పోలిస్తే క్షేత్రస్థాయిలో మార్పు
- ఎవరికి లాభం? ఎవరికి నష్టం ?
- ఆసక్తికరంగా మహానగర ఓటరు తీర్పు

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, ప్రస్తుత పార్లమెంట్ నియోజకవర్గాలకు మధ్య ఐదు నెలల వ్యవధిలో జరిగిన ఎన్నికల్లో మహానగర తీర్పు ఎలా ఉండనుంది? ఓటరు మహాశయుడు ఏ పార్టీని ఆదరించారు, గెలిచేదెవరు? అన్నది చర్చనీయాంశంగా మారింది. శాసనసభతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు ఆలోచన మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో గ్రేటర్ ఓటర్ బీఆర్ఎస్‌ను ఆదరించారు. 24 శాసనసభా స్థానాలకుగాను 16 చోట్ల ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. ఇప్పుడా పరిస్థితి ఉందా..? లేదా అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి ఉందని సీనియర్ రాజకీయ నేత ఒకరు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసిన పార్టీకి మెజార్టీ ఓటర్లు ఇప్పుడు ఓటు వేయలేదని చెబుతున్నారు. ఈ క్రమంలో వారి ఓటు ఏ పార్టీకి పడిందన్నది కీలకం కానుంది. మెజార్టీ ముస్లిం మైనార్టీల ఓటర్లు ఓ పార్టీ వైపు మొగ్గు చూపారని చెబుతున్నారు. ఇది ఎవరికి నష్టం కలుగుతుందన్న దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో మరో వర్గం మెజార్టీ ఓటర్లు ఎవరికి వేశారన్నది ప్రాధాన్యం సంతరించుకుంది. మొత్తంగా గ్రేటర్‌లో అసెంబ్లీ

మిగతా 6వ పేజీలో..

గ్రేటర్‌లో పోటీ చేసిన అభ్యర్థులు

నియోజకవర్గం	మొత్తం	స్వతంత్రులు
హైదరాబాద్	30	07
సికింద్రాబాద్	45	27
మల్కాజిగిరి	43	21
చేవెళ్ల	22	11



మొరాయించిన ఈవీఎంలు

- పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్

కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఈవీఎంలు మొరాయించాయి. దాంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. కొన్నిచోట్ల సాంకేతిక సమస్య కారణంగా పోలింగ్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

- చాంద్రాయణగుట్టలోని పోలింగ్ బూత్-88 లో సాయంత్రం 5 గంటల తర్వాత ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రం మొరాయించాయి. దీంతో కొత్తవి ఏర్పాటుచేసి ఓటింగ్ కొనసాగించారు. ఇదే నియోజకవర్గంలోని మరో మూడు పోలింగ్ కేంద్రాల్లో వీవీ ప్యాట్ యంత్రాలు పని చేయలేదు.
- యాకుత్‌పురా నియోజకవర్గంలోని గౌలిపురా డివిజన్ బూత్ -6లో ఈవీఎం పని చేయకపోవడంతో అరగంట ఆలస్యంగా

మిగతా 8వ పేజీలో..

బందోమస్తు సక్సెస్

హైదరాబాద్ సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికతో పాటు, గ్రేటర్ పరిధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించడంలో మూడు కమిషనరేట్‌ల సీపీలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అవినాశ్ మహంతి, తరుణ్‌జోషి సక్సెస్ అయ్యారు.




చిలకలగూడలో పోలింగ్‌కేంద్రాన్ని తనిఖీ చేసిన నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- శక్తివంచన లేకుండా పనిచేసిన సిబ్బంది

వ్యూహాత్మకంగా వ్యవహరించి

పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీపీలు మొదటి నుంచే సిబ్బందిలో దూకుడు పెంచారు. సిటీ పరిధిలోని రౌడీషీటర్స్ అల్లరిమూకలు, పాత నేరస్థులపై దృష్టి సారించారు. అల్లరి మూకలను గుర్తించి బైండోవర్ చేశారు. పోలింగ్‌కు వారం రోజుల ముందు నుంచే భద్రత, బందోబస్తుపై ప్రత్యేక కసరత్తు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నజర్ పెట్టారు. ప్రతి పోలింగ్

మిగతా 8వ పేజీలో..



ఖాళీగా దర్శనమిచ్చిన నగరం

- రోడ్లపై కనిపించని జనం, వాహనాలు
- దుకాణాలు మూసివేత

8

ఓటు చైతన్యం

నడవలేని స్థితిలో కూడా కొందరు ఓటేసేందుకు తరలివచ్చారు. మరికొందరు చంటిపిల్లలతో పోలింగ్ కేంద్రాలకు వచ్చి క్యూలో నిల్చుని ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల్లో కొన్నిచోట్ల సరైన సదుపాయాలు లేకపోయినా ఓటుహక్కు వినియోగించుకున్నారు.



ప్రశాంతంగా పోలింగ్ : రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. దాదాపు అన్ని చోట్ల సమయానికి పోలింగ్ ప్రారంభమైందన్నారు. సోమవారం ఉదయం మొఘల్‌పురా హరిబౌలిలో పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నుంచి వెబ్‌కాస్టింగ్ పుటేజీతో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ హెల్ప్‌లైన్ ఫిర్యాదు, ఎంసీసీ కేంద్రంలో

మిగతా 6వ పేజీలో..



సిబ్బందితో మాట్లాడుతున్న రోనాల్డ్‌రోస్

కంటోన్మెంట్ ఉపఎన్నిక
పెరిగిన పోలింగ్ శాతం

- గత అసెంబ్లీ ఎన్నికల్లో 49.18 శాతం
- తాజా ఉపఎన్నికలో 50.2 శాతం

సికింద్రాబాద్, మే13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలతోపాటు రాష్ట్రంలో ఏకైక ఉపఎన్నిక జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం 53 శాతం పోలింగ్ నమోదైంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో 49.18 శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుతం 50.2 శాతం పోలింగ్ జరిగింది. వాతావరణం చల్లబడడం, కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రజలు లోక్‌సభ ఎన్నికలపై ఎక్కువ ఆసక్తి ప్రదర్శించడమే పోలింగ్ శాతం పెరగడానికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, కంటోన్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,51,425 మంది కాగా, వారిలో పురుషులు 1,25,735 మంది, మహిళలు 1,25,627 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు.



పోలింగ్ శాతం

	హైదరాబాద్	సికింద్రాబాద్	మల్కాజిగిరి	చేవెళ్ల
2019	44.84	46.5	49.63	53.25
2024	46.08	48.11	46.27	55.45



పోలింగ్ ముగిసిన అనంతరం స్ట్రాంగ్‌రూంలకు సామగ్రి తరలిస్తున్న సిబ్బంది



తెరిచార్రోయ్.. నగర శివారులోని ఓ వైన్‌షాప్ వద్ద సోమవారం రాత్రి మందుబాబుల రద్దీ


రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ దంపతులు


కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓటేసిన రాజకీయ, సినీ ప్రముఖులు


కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత


గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల


బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్


సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ కుటుంబసభ్యులు


సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ కుటుంబసభ్యులు


గల్లా జయదేవ్



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్


ఆర్.కృష్ణయ్య


ఆజంపురలో ఓటు వేసిన మాజీ హోం మంత్రి మహమూద్‌అలీ


మైనంపల్లి హన్మంతరావు


భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్


కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్


కుటుంబీకులతో కలిసి ఓటు వేసిన ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి


కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్


హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత



మణికొండలో ఓటు హక్కు వినియోగించుకున్న నటుడు శివబాలాజీ దంపతులు


మణికొండలో నటి ప్రగతి








సినీ ప్రముఖులు

సినీ ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసిన వారిలో మంచు మనోజ్, బెల్లంకొండ సురేష్, జగపతిబాబు, సుహాస్, తేజ, మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.



ప్రశాంతంగా పోలింగ్ : రోనాల్డ్‌రోస్

(5వ పేజీ తరువాయి): ఫిర్యాదులు వచ్చాయా..? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

డీఆర్‌ఎసీ కేంద్రాలకు ఈవీఎంలు

పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ) కేంద్రాలకు చేరాయి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని డీఆర్‌సీ కేంద్రాన్ని సోమవారం జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంల భద్రపర్చడాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా కమిషనరేట్ల పరిధిలో ఉన్న స్ట్రాంగ్ రూమలు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను సీపీలు క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్ర బలగాలతో పాటు, రాష్ట్ర పోలీసులు కలిసి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

ఆదరణ ఎవరికి?

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల నాటి పరిస్థితికి, ప్రస్తుత పరిణామాలకు వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది ఏ పార్టీని విజయతీరాలకు చేర్చుతుంది..? ఎవరిని ముంచుతుందో చూడాలి. ప్రధాన పార్టీలు మాత్రం ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పలుచోట్ల హోరాహోరీ..

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రంగా కనిపించింది. మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాల్లోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓటింగ్ నువ్వా.. నేనా అన్నట్లుగా సాగినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లోని ఓటర్లు సైతం అభ్యర్థుల వారీగా విడిపోయి ఓట్లు వేసినట్లు కనిపించింది. కాగా, బీఆర్ఎస్‌కు కూడా పలు చోట్ల సైలెంట్ ఓటింగ్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఏదేమైనా ఫలితం కోసం జూన్ 4న జరిగే కౌంటింగ్ వరకు అభ్యర్థులు ఎదురుచూడక తప్పని పరిస్థితి ఉంది.

భవితవ్యం నిక్షిప్తం

(5వ పేజీ తరువాయి)

383 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాధవీలతపై కేసు నమోదు..

ఓ పోలింగ్ బూత్‌లో మహిళను హిజాబ్ తొలగించాలని బీజేపీ అభ్యర్థి మాధవీలత కోరడం వివాదాస్పదమైంది. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ ఆదేశాల మేరకు మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదైంది. వాస్తవంగా హిజాబ్ తొలగించి మహిళా ఓటర్ మొఖం చూసే అధికారం పోలింగ్ కేంద్రంలోని మహిళా పోలింగ్ అధికారికి మాత్రమే ఉంటుంది. మీర్‌చౌక్ పోలీసుస్టేషన్ పరిధిలోని బీబీ బజార్ చౌరస్తా విక్టోరియా హోటల్ వద్దకు మాధవీలత రాగా.. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తోన్న ఎంఐఎం యువ నాయకుడు యాసర్ అర్ఫాత్ కారు నుంచి కిందకు దిగాడు. మాధవీలత కూడా కారు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఎంఐఎం కార్యకర్తలు రోడ్డుపైకి రావడంతో వెంటనే స్పందించిన పోలీసులు వారిని చెదరగొట్టారు.


ఓటు వేశానంటూ బీజేపీ నాయకులతో కలిసి చూపిస్తున్న మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి


తీగలకుంటలో ఓటు వేసిన బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, కార్పొరేటర్ మహ్మద్ సలీం


జల్‌పల్లిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి


జల్‌పల్లి షాహిన్ నగర్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి


హైదర్‌గూడలో ఓటు వేసిన అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత


ఓటు వేసిన జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్ దంపతులు


ఓటు హక్కును వినియోగించుకున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్


శివరాంపల్లిలో ఓటు వేసిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు అర్చన దంపతులు


మైలార్‌దేవుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్

ప్రశాంతంగా పోలింగ్

రాజేంద్రనగర్, మే13 (ఆంధ్రజ్యోతి): రాజేంద్ర నగర్ సర్కిల్‌లో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 288 పోలింగ్ స్టేషన్‌లు, 3,28,485 మంది ఓటర్లున్న ఈ సర్కిల్‌లో ఐదు డివిజన్‌లు ఉన్నాయి. మెజారిటీ వర్గం ప్రజలున్న డివిజన్‌లలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు పడగా, మైనారిటీ వర్గాలు నివసిస్తున్న డివిజన్‌లలో కాంగ్రెస్‌కు ఓట్లు పోలయినట్లు సమాచారం. డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్, మైలార్‌దేవుపల్లి, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌లు బి.నాగేంద్రబాబు, పి.మధు, వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జల్‌పల్లిలో..

పహాడిషరీఫ్: జల్‌పల్లి మునిసిపాలిటీలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చేవెళ్ల లోకసభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి బీజేపీ నాయకుడు అందేలా శ్రీరాములుతో కలిసి జల్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పోలింగ్‌ను పరిశీలించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి జల్‌పల్లి షాహిన్ నగర్, ఎర్రకుంట, బిస్మిల్లా కాలనీ తదితర ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

బహదూర్‌పురాలో 49.7 శాతం..

మదీన: బహదూర్‌పురా నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 49.7 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు కేవలం 19.5 శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని 263 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రెండు మూడుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. సిబ్బంది వెంటనే సమస్యను పరిష్కరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.


కిషన్‌బాగ్‌లో ఓ పోలింగ్ బూత్‌లో బారులు తీరిన ఓటర్లు

గోషామహాల్‌లో 49 శాతం..

గోషామహల్: గోషామహల్ నియోజకవర్గంలో మధ్యాహ్నం వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. మధ్యాహ్నం తరువాత పుంజుకుంది. నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లిన ఓటర్లకు చేదు అనుభవం ఎదురైంది. ఓటరు జాబితాలో పేర్లు లేవని చెప్పడంతో అవాక్కయ్యారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, బీజేపీ అభ్యర్థి కొంపల్లె మాధవీలత, మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీతో పాటు ఆయా పార్టీల నాయకులు ఓటింగ్ సరళిని పరిశీలించారు. సాయంత్రం 5 గంటల వరకు 44.05 శాతం, ఆరు గంటల వరకు 49 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి విక్టర్ తెలిపారు. గుఫానగర్, ఆర్కేపేట్, ఇందిరానగర్ ప్రాంతంలో పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారుల వద్ద ఉన్న జాబితాలో ఓటర్ల పేర్లు లేకపోగా.. రాజకీయ నాయకుల వద్ద ఉన్న జాబితాలో పేర్లు ఉండటం గందరగోళానికి దారితీసింది


పురానాపూల్ డివిజన్ కబూతర్‌ఖానా మహేశ్వరి మహావిద్యాలయంలో ఓటు వేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్


హైదర్‌గూడలో ఓటు వేసిన మహిళలు

ఓటేసిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మైలార్‌దేవుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్ శివరాంపల్లి దళిత బస్తీలో, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ హైదర్‌గూడలో ఓటు వేశారు. ఉప్పర్‌పల్లి సన్‌రైజ్ విల్లా పరిసరాలలో నివసిస్తున్న ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అబిడ్స్ జోన్ బృందం: గోషామహల్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లలో ఎమ్మెల్యే రాజాసింగ్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మదీన: బహదూర్‌పురా తీగలకుంటలో ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, దూద్‌బౌలి కార్పొరేటర్ మహ్మద్ సలీమ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ పురానాపూల్ డివిజన్ పరిధిలోని కబూతర్‌ఖానా మహేశ్వరి మహావిద్యాలయలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.


లాల్‌దర్వాజ మోడ్ వీడీపీ స్కూల్‌లో ఓటు వేసిన గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర దంపతులు


ఆగాపురాలో ఓటు వేసిన కాంగ్రెస్ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కుటుంబ సభ్యులు


హిమాయత్‌నగర్ ఉర్దూ హాల్‌లో ఓటు వేసిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వినోద్‌రెడ్డి దంపతులు


బాబుల్‌రెడ్డినగర్ శ్రీవిద్యానికేతన్ స్కూల్‌లో వీల్ చైర్‌పై వెళ్లి ఓటు వేసిన వృద్ధుడు సోమ జగన్నాథం గుప్తా


శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు వేసిన వృద్ధురాలు


కాలికి గాయమైనా వీల్ చైర్‌లో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధుడు రాజు సింగ్


నుమా జూనియర్ కళాశాలలో ఓటు వేసిన వృద్ధురాలు వరలక్ష్మి


హైదర్‌గూడలో ఓటు వేసిన పలు పార్టీల నాయకులు


కుటుంబ సభ్యులతో కలిసి రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు వేసిన బీఆర్ఎస్ నాయకుడు కె.రఘుగౌడ్


ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకున్న బీజేపీ సీనియర్ నాయకులు దినేశ్ యాదవ్, ముఖేశ్ సోని, పరాస్ యాదవ్, నందు శోభన్


ఓటు వేసిన రాష్ట్ర బజరంగ్ సేన అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు తదితరులు

బీటెక్ చదివాడు.. బెట్టింగ్‌కు బానిసయ్యాడు

- బంగారు గొలుసు కాజేసిన యువకుడి అరెస్ట్

పంజాగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదివాడు.. ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. అప్పులు పెరిగి డబ్బుల కోసం ఓ ఇంట్లో చొరబడి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన కొండేటి నాగపృథ్వి(23) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం నిమిత్తం గత ఏడాది నగరానికి వచ్చాడు. ఎల్లారెడ్డిగూడలో ఓ బాయిస్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు.

కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై అప్పుల పాలయ్యాడు. డబ్బుల కోసం చోరీ చేయాలని భావించి ఈ నెల 12న ఎల్లారెడ్డిగూడ శాలివాహననగర్ కాలనీలో నివసిస్తున్న విజయలక్ష్మి(75) ఇంట్లోకి చొరబడ్డాడు. గదిలో వంట చేస్తున్న ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా హాస్టల్‌కు వెళ్లి నాగపృథ్వి వివరాలు సేకరించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. కాజేసిన బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మాధవీలత తీరుతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం

మంగళ్‌హాట్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎంఐఎం పార్టీకి కంచుకోటగా ఉన్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికలు ఈ సారి ఆసక్తికరంగా జరిగాయి. మొదటిసారి బీజేపీ తరఫున బరిలో నిలిచిన మాధవీలత పాత బస్తీ ప్రాంతానికి చెందిన వారు కావడంతో అత్యంత కీలకమైన పోలింగ్ బూత్‌లను ముందుగానే గుర్తించి ఆయా ప్రాంతాల్లో రిగ్గింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేకంగా కమిటీలను నియమించినట్లు తెలుస్తోంది. యాకత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, గోషామహల్ ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ బూత్‌లలో కొత్త వారిని పోలింగ్ ఏజెంట్లుగా నియమించడమే కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ఆయా డివిజన్ల నేతలు, ధార్మిక సంఘాల పెద్దలు ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఏ ఎన్నికల్లో జరగని విధంగా ఈసారి బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా ఆమె వ్యవహరించారు. ఎంఐఎంకు పట్టున్న ప్రాంతాల్లో బీజేపీ నేతలు ప్రభావం చూపితే తరచూ గొడవలు, చెదురుమదురు ఘటనలు చోటుచేసుకునేవి. కానీ ఈసారి హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాతంగా జరగడంతో ఎంఐఎం వర్సెస్ బీజేపీ మధ్య పోటీ అన్నట్లు ఉంది. మొత్తానికి మాధవీలత తీరు ఎంఐఎం నేతల్లో భయాన్ని రేపిందని ఆ పార్టీ నేతలే పలువురు మాట్లాడుకోవడం విశేషం.

సిబ్బందికి నాసిరకం భోజనం

- ఆగ్రహం వ్యక్తం చేసిన అసిస్టెంట్ కలెక్టర్

మదీన, మే 13 (ఆంధ్రజ్యోతి): సర్కిల్-10లో పోలింగ్ సిబ్బందికి నాసిరం ఆహారం అందించడంపై హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ అమిత్‌కుమార్ అధికారులపై మండిపడ్డారు. కిషన్‌బాగ్ పార్కులో వంటలు చేసి అక్కడి నుంచి పోలింగ్ బూత్‌లకు సరఫరా చేశారు. ఆహారం రుచి లేకుండా అధ్వానంగా ఉంది. దీంతో సిబ్బంది తినడానికి ఆసక్తి కనబరచలేదు. అంతలోనే అటువైపు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ ఆహారాన్ని చూసి అధికారులను నిలదీశారు. తినడానికి ఏమాత్రం బాగాలేని ఆహారం అందించడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'మాతృప్రేమ అమృతం కంటే గొప్పది'

చిక్కడపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మాతృప్రేమ అమృతం కంటే గొప్పదని ప్రముఖ కవి చిక్కా రామదాసు అన్నారు. మాతృదేవోభవ సత్సంగ్ సంస్థ అధ్యక్షుడు కేబీ శ్రీధర్‌ను సోమవారం సూర్యలోక్ కాంప్లెక్స్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రామదాసు సన్మానించారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐపీఎస్ విశ్రాంత గోపీనాథరెడ్డి, ఉదయలక్ష్మి, నాగభూషణం, సుజాత తదితరులు పాల్గొన్నారు.


సత్యవాణికి పురస్కారం బహూకరిస్తున్న రమణాచారి

అమ్మ ప్రేమకు కొలమానం లేదు

చిక్కడపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): అమ్మ ప్రేమకు కొలమానం లేదని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. అభినందన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా సాంఘిక సేవా కర్త సత్యవాణికి సంస్థ స్థాపకులు భవాని మాతృమూర్తి మాదిరాజు వరలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ప్రఖ్యాత గాయకుడు డీవీ మోహనకృష్ణ అమ్మ కుసుమకు, ప్రముఖ గాయని విజయలక్ష్మి అమ్మ సుగుణకు మాతృవందనం పేరిట సత్కారం చేశారు. డా.రమణాచారి మాట్లాడుతూ.. సత్యవాణి భారతీయ వాణిగా మనదేశ సంస్కృతిని ప్రచారం చేస్తున్నారన్నారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కేవీ కృష్ణకుమారి, వి జయానందకృష్ణ, ఇందిరా విజయ్, ధనుంజయ్ పాల్గొన్నారు.


నార్సింగ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

'మార్మిక నది' ప్రజాచైతన్య కవితా ప్రవాహం

- ఆచార్య కొలకలూరి ఇనాక్

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి డాక్టర్. బిక్కి కృష్ణ రచించిన మార్మిక నది కావ్యం ఒక ప్రజాచైతన్య ప్రవాహమని, దీనికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు రావాలని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. విశాల సాహితీ, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో చిక్కడపల్లి కళాభారతిలో సోమవారం ప్రముఖ కవి డాక్టర్. బిక్కి కృష్ణ రచించిన మార్మిక నది కావ్యంపై సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బిక్కి కృష్ణ కవిత్వం, పరిశోధనలు, సాహిత్య సేవలు అనితర సాధ్యమని కొనియాడారు. కవి గోరటి వెంకన్న మాట్లాడుతూ.. ఏ కొలమానాలకు అందని స్వచ్ఛమైన కవి, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని నిఖార్సయిన విమర్శనాగ్రంథాలు వెలువరించిన మంచి విమర్శకుడు బిక్కి కృష్ణ అని ప్రశంసించారు.

ప్రసిద్ధ కవి డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. మార్మిక నది వస్తుశిల్పశోభితమైన గొప్ప కావ్యమన్నారు. అందులో ప్రతి పేజీలో లోతైన తాత్త్వికతతోపాటు భావుకత, ప్రతీకాత్మకత, అభివ్యక్తినవ్యత గోచరిస్తుందన్నారు. ప్రముఖ కవి విద్యాధర్ మాట్లాడుతూ.. శైవకవుల, బసవేశ్వరుని సంఘ సంస్కరణ బిక్కి కృష్ణను ప్రభావితం చేసిందన్నారు. రచయిత్రి రోహిణి వంజారి మార్మిక నది పుస్తకాన్ని సమీక్షించారు. ప్రముఖ అనువాదకులు ప్రొఫెసర్ జీవీ రత్నాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుసుమధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ, బహుజన సిద్ధాంతకర్త బీఎస్ రాములు, ప్రముఖ కన్నడ అనువాదకులు లక్కూర్ ఆనంద్, కె. రవీంద్రాచారి, టి. రంగస్వామి, ఆంగ్లానువాదకవి దామోదరాచారి తదితరులు పాల్గొన్నారు.


మార్మిక నది కావ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

బైక్ పెట్రోల్‌ట్యాంక్ పేలిన ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చార్మినార్ మే 13 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ బైక్‌కు మంటలు అంటుకుని పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మొఘల్‌పురా సుల్తాన్ షాహీకి చెందిన మహమ్మద్ నయీమ్ కుమారుడు మహమ్మద్ నదీమ్(32) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు.

భవానీనగర్ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం మొఘల్‌పురాలో నాజర్ ఫంక్షన్‌హాల్ వద్ద బుల్లెట్ బైక్‌కు మంటలంటుకోగా స్థానికులు నీటిని చల్లుతూ తడిచిన గోనె సంచులు వేసి ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బుల్లెట్ పెట్రోల్ ట్యాంక్ పేలి పదిమంది గాయపడిన విషయం తెలిసిందే.


మహమ్మద్ నదీమ్ (ఫైల్)

చికిత్స పొందుతున్న వారిలో నదీమ్ మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. నదీమ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.


బంజారాహిల్స్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు


మలక్‌పేట్ సలీంనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి


ఓటు వేసిన రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, పక్కన మేయర్ గద్వాల విజయలక్ష్మి


రాంనగర్‌లో కుమార్తె, భార్యతో కలిసి ఓటు వేసిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ


బోయినపల్లి సెయింట్ రీటా స్కూల్‌లో ఓటు వేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, జక్కుల మహేశ్వర్‌రెడ్డి


హబ్సిగూడ శ్రీసాయి పబ్లిక్‌స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

గ్రేటర్‌లో ఓటు వేసిన ప్రముఖులు..


అనుచరులతో కలిసి ఓటు వేసిన మర్రి శశిధర్‌రెడ్డి


రామంతాపూర్ పబ్లిక్‌స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్


ఓటు వేసిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కుటుంబ సభ్యులు

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో పలువురు ప్రముఖులు, సినీనటులు, ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును సోమవారం పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకున్నారు. ప్రముఖులు, వీఐపీలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో క్యూలో నిలుచుని ఓటు వేశారు. పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా వచ్చి ఓటువేయడంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో సందడి వాతావరణం నెలకొంది.

- ఎస్ఆర్‌నగర్‌లోని నారాయణ కళాశాలలో సినీనటుడు ప్రకాష్‌రాజ్ కుటుంబ సభ్యులతో ఓటు వేశారు.
- ఎస్ఆర్‌నగర్ నారాయణ మెడికల్ కళాశాలలో సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ ఓటు వేశారు.
- ప్రశాసన్‌నగర్‌లోని సెరికల్చర్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- జూబ్లీహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు ఓటు వేశారు.
- నందినగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన సతీమణి, కుమారుడు హిమాన్షు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కుందన్‌బాగ్ చిన్మయ విద్యాలయ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన తెలంగాణ మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి దంపతులు. ఐటీ పరిశ్రమల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేష్ రంజన్
- బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లో రాజ్యసభ సభ్యుడు కేశవరావు వీల్‌చైర్‌లో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి ఎన్‌బీటీనగర్‌లో ఓటు వేశారు.
- జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి దంపతులు ఓటు వేశారు.
- మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సభ్యులతో కలిసి జూబ్లీహిల్స్‌లో ఓటువేశారు.
- జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ప్రముఖ సినీనటుడు మహేష్‌బాబు, ఆయన భార్య నమ్రత ఓటువేశారు.
- జూబ్లీహిల్స్‌లోని జూబ్లీక్లబ్‌లో రాంచరణ్, ఉపాసన దంపతులు వేశారు. అలాగే సినీనటుడు సుమంత్ వేశారు.
- ఫిల్మ్‌నగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పోలింగ్ కేంద్రంలో ప్రముఖ నటుడు అల్లుఅర్జున్ వేశారు.
- జూబ్లీహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జూనియర్ ఎన్టీఆర్, ఆయన సతీమణి లక్ష్మీప్రణతి, తల్లి షాలినీ ఓటు వేశారు.
- షేక్‌పేట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రముఖ సినీ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, ఆయన సతీమణి రమా రాజమౌళి, కుమారుడు, కూతురుతో కలిసి ఓటు హక్కును వినియోగించారు.
- సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్ వాకర్స్ టౌన్ హాల్‌లో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు.
- కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో సినీనటుడు రాజేంద్రప్రసాద్ ఓటు వేశారు.
- నానక్‌రామ్‌గూడలో సీనియర్ నరేష్, మణికొండలో శివబాలాజీ దంపతులు ఓటు వేశారు.
- ఎఫ్ఎన్‌సీసీ లో దర్శకుడు రాఘవేంద్రరావు, కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- మహేంద్రహిల్స్‌లోని మాత అమృతానందమయి పాఠశాలలో హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవి లత ఓటు వేశారు.
- మణికొండలో సీపీఐ నారాయణ ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- మలక్‌పేట్ సలీంనగర్ పరిధిలోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లోని 204 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి దంపతులు.
- హబ్సిగూడ శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి
- సికింద్రాబాద్ ఇస్లామియా స్కూల్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఆయన సతీమణి స్వరూప.
- రాంనగర్‌లోని జేవీ హైస్కూల్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటువేసిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ.
- రాజేంద్రనగర్‌లో నియోజకవర్గంలోని శాస్త్రిపురంలో ఓటువేసిన హైదరాబాద్ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ
- పెద్ద అంబర్‌పేట్ మునిసిపాలిటీలోని పసుమాముల 289/ఏ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్.
- కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి బర్కత్‌పురాలోని దీక్ష మోడల్ స్కూల్‌లో ఓటువేశారు.
- పుప్పాలగూడ పీజీ కాలేజీలో ఓటువేసిన సినీనటుడు జగపతిబాబు.



మెహిదీపట్నం సింధు కాలేజీలో తండ్రి ముర్తుజా ఫరూకితో కలిసి ఓటేసిన దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూకి. బంజారాహిల్స్ ఇన్‌కం ట్యాక్స్‌కాలనీలో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



ఎస్ఆర్‌నగర్‌లో ఓటువేసిన జస్టిస్ ఎన్వీ రమణ, తార్నాకలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ప్రొ. కోదండరాం దంపతులు







మారేడుపల్లిలో తలసాని శ్రీనివాస్‌యాదవ్, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బోయినపల్లిలో మాజీమంత్రి మల్లారెడ్డి, మణికొండలో సీపీఐ నారాయణ, నానక్‌రాంగూడలో టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న ఓటు హక్కును వినియోగించుకున్నారు


బోలీచౌకి అరుణ కాలనీలో ఓటు వేసేందుకు వచ్చిన వందేళ్ల పోచవ్వ

బందో మస్త్ సక్సెస్

(5వ పేజీ తరువాయి)

కేంద్రాన్ని జియో ట్యాగింగ్ చేసి, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చీమ చిటుక్కుమన్నా వెంటనే తెలిసిపోయేలా ఏర్పాట్లు చేశారు.

సాంకేతిక దన్నుతో..

ట్రై కమిషనరేట్స్ పరిధిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్స్‌లో ఎలక్షన్ సెల్, ఐటీ సెల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్స్, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీకెమెరాల నిఘా, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, మొబైల్ రూట్స్, పీటీజెడ్ కెమెరాలు కలిగిన ఒక్కో కమిషనరేట్‌లో 3 మొబైల్ వ్యాన్స్ ఏర్పాటు చేశారు. ఆ కెమెరాలను పోలీస్ కమిషనరేట్స్ పరిధిలోని ప్రధాన కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. అనుమానాస్పద కదలికలను గుర్తించి, విధులు నిర్వహిస్తున్న పోలీసులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. సీపీలు ఇతర ఉన్నతాధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భద్రతను పరిశీలించడంతో పాటు.. క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేశారు. ఎన్నికల నిర్వహణలో శక్తివంచనలేకుండా పనిచేసి ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు.. కేంద్ర రాష్ట్ర పోలీస్ సిబ్బందికి సీపీలు అభినందనలు తెలిపారు.

మొరాయించిన ఈవీఎంలు

(5వ పేజీ తరువాయి)

పోలింగ్ మొదలైంది. మాక్ పోలింగ్ సమయంలోనూ ఈవీఎంలు పని చేయలేదు. సాంకేతిక నిపుణులను పిలిపించి సమస్య పరిష్కరించినట్టు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు.

- హయత్‌నగర్‌లోని మునుగనూరు పోలింగ్ కేంద్రం-218లో 250 ఓట్లు పోలైన అనంతరం ఈవీఎం మొరాయించడంతో గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది.
- ఇంజాపూర్‌లోని పోలింగ్ కేంద్రం- 225లో ఈవీఎంల పని చేయకపోవడంతో 45 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.
- ఇనాంగూడలోని 196 పోలింగ్ కేంద్రంలో, కవాడిపల్లి పోలింగ్ కేంద్రం 297లో సాంకేతిక లోపంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది.
- సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండిలో విద్య మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన 147 పోలింగ్ బూత్‌లో, వారాసిగూడ ప్రభుత్వ 161వ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించాయి. గంటసేపు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటసేపు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 3 చోట్ల సాంకేతిక సమస్య కారణంగా ఈవీఎంలు మొరాయించడంతో సుమారు అరగంటపాటు పోలింగ్ ఆలస్యమైంది.

సీబీఎస్ఈ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) టెన్త్, ఇంటర్ ఫలితాలను సోమవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. గత ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13 వరకు టెన్త్ పరీక్షలు జరగగా, ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు ఇంటర్ పరీక్షలను సీబీఎస్ఈ నిర్వహించింది. టెన్త్ పరీక్షలకు తెలంగాణ నుంచి 45,669మంది హాజరుకాగా 45,465 (99.55 శాతం)మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 99.48శాతం ఉండగా బాలికల ఉత్తీర్ణత 99.64 శాతంగా ఉంది. అలాగే ఇంటర్ పరీక్షలకు తెలంగాణ నుంచి 8,337మంది హాజరు కాగా.. 8,266 మంది (99.15 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పాసైన వారిలో బాలురు 98.85శాతం కాగా.. బాలికలు 99.49 శాతం ఉండటం విశేషం.

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రశాంతంగా ఎన్నికలు

- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, రంగారెడ్డి అర్బన్,మేడ్చల్, మే 13(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల లోక్‌సభ స్థానానికి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచే జనం ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు బారులు తీరారు. పలువురు ప్రముఖులు, అధికారులు, అభ్యర్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదర్శ కేంద్రాలను ముస్తాబు చేయడంతో అక్కడ పండగ వాతావరణం తలపించింది. సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఖైరతాబాద్ అసెంబ్లీ పరిధిలో. మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రు అంతాయపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా ప్రారంభమైంది. తమకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ షాద్‌నగర్ అసెంబ్లీ నియోజవర్గ కొత్తూరు మండలం కొడిచర్ల తాండ, కందుకూరు మండలం చీమలవాణి కుంట వాసులు ఎన్నికలను బహిష్కరించి ధర్నా చేపట్టారు. సమాచారం తెలుసుకున్న అధికారులు గ్రామాలకు చేరుకుని నచ్చజెప్పారు.


ఓటు వేసిన మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు సిద్ధం

- అసదుద్దీన్ ఒవైసీ


కుటుంబ సభ్యులతో కలసి ఓటు వేసిన అసదుద్దీన్ ఒవైసీ

రాజేంద్రనగర్, మే13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అట్టడుగుస్థాయి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ పార్లమెంటు ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రాజేంద్రనగర్ సర్కిల్ శాస్త్రీపురంలోని సెయింట్ ఫయాజ్ హైస్కూల్‌లో ఆయన తన కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఓటు వేశారు. ఈ సందర్భం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమిపై తానేమీ మాట్లాడలేనని, తమ పార్టీకి ఆ కూటమితో సంబంధం లేదన్నారు. బీజేపీ నాలుగు వందల సీట్లు అన్నప్పుడే దళితులు, రాజ్యాంగాన్ని అభిమానించే వారు ఆలోచనలో పడ్డారని గుర్తు చేశారు. సోమవారం మీ జన్మదినం అంట ఎలా జరుపుకొంటారు అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు తాను జన్మదిన వేడుకలు జరుపుకోనన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. భారత్‌లో వ్యక్తులకు ప్రాధాన్యత లేదని, దేశానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మేమంతా దేశ ప్రజలకు సేవకులమే అన్నారు. ఈ ఎన్నికలలో హైదరాబాద్ స్థానం నుంచి మీకు సవాల్‌గా ఉందా అని అడిగిన ప్రశ్నకు ఈ ఎన్నికలు కాదు.. ప్రతి ఎన్నిక ఒక సవాల్‌లాంటిదేనన్నారు.

బేగంపేట ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

- కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి వంశతిలక్


ఇన్‌స్పెక్టర్ రామయ్యతో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి వంశ తిలక్

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): బేగంపేట పోలీసులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి వంశతిలక్ ఆరోపించారు. పోలింగ్ సందర్భంగా ఉదయం రసూల్‌పురలోని ఘన్‌బజార్ వద్ద ఉన్న రెండు కార్లను బీజేపీ శ్రేణులు, పోలీసులు అడ్డుకోగా.. ఒక డ్రైవర్ తప్పించుకున్నాడని తెలిపారు. మరో కారును పట్టుకున్నామన్నారు. ఈ సంఘటనపై బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే, అధికార పార్టీకి చెందిన ఆ కారులో డబ్బు సంచి ఉందని, ఎలా వదిలేస్తారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన బేగంపేట పోలీసులను డిమాండ్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారును వదిలేసిన సంఘటనపై చర్యలు తీసుకోవాలని తాము కోరగా ఇన్‌స్పెక్టర్ రామయ్య తనతో పరుషంగా మాట్లాడారని, ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తిలక్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కారులో తనిఖీలు నిర్వహించలేదని, అధికార పార్టీకి పోలీసులు మద్దతుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఓటు వేసిన వారికి ఆఫర్లు..

- కంప్యూటర్ కోర్సుల్లో 80 శాతం ఫీజు రాయితీ

బర్కత్‌పుర, మే 13 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో సోమవారం ఓటు వేసిన వారికి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో 80శాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి తెలిపారు. యువతీ, యువకుల్లో ఓటు విలువ తెలియజేయడానికి ఈ ఫీజు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఓటు వేసిన వారు సిరా గుర్తు వేలును చూపిస్తూ సెల్ఫీ ఫొటో దిగి 9505800047 ఫోన్ నంబర్‌కు పంపి తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. 80కి పైగా సర్టిఫికేషన్ కోర్సులకు ఈ ఫీజు రాయితీని ఇస్తున్నట్లు తెలిపారు.

యువతీ, యువకులకు కరాటేలో ఉచిత శిక్షణ

ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న యువతీ, యువకులకు కరాటేలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్. జీఎస్ గోపాల్‌రెడ్డి తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటే సిరా గుర్తు వేలును చూపించి కరాటేలో నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఓటు వేసిన యువతీ, యువకులు కాచిగూడలోని సంస్థ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 9494112424 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



ఓటు వినియోగించుకున్న వారితో ఫొటో దిగిన దృశ్యం

ఓటింగ్ శాతం పెంచేందుకు సిల్వర్ కాయిన్ల పంపిణీ

బోయినపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలో ఓటింగ్ శాతం పెంచేందుకు కొందరు సిల్వర్ కాయిన్లను పంపిణీ చేశారు. తిరుమల, అమరావతి, సూర్యనగర్, కౌశల్యా ఎస్టేట్ కాలనీలకు చెందిన ప్రతినిధులు విజయవాహిని జువెలర్స్ అధినేత చీల విజయకుమార్ సహకారంతో సిల్వర్ కాయిన్లను పంపిణీ చేశారు. కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని తిరుమలగిరి ఆర్‌టీఏ కార్యాలయం పక్కన ఉన్న ఆయా కాలనీలకు చెందిన ఓటర్లు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకొని తిరిగి వెళ్లే క్రమంలో ప్రధాన ద్వారం వద్ద వారిని ఆపి ఫొటో దిగుతూ కుటుంబానికి ఒక్కో గ్రాము వెండి కాయిన్‌ను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్నికల సిబ్బంది వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాడిశెట్టి బాబూరావు, మాపెట్టి ఉపేందర్, అమర్నాథ్ పాల్గొన్నారు.

వీల్‌చైర్లు కుదేలై..

- పలు పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించని ర్యాంపులు


ఓ దివ్యాంగురాలిని వీల్‌చైర్ సహా ఎత్తుకొని బూత్‌లోకి తీసుకెళుతున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటో చూస్తున్నారా! గోల్నాక డివిజన్ ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పోలింగ్ కేంద్రం- 64 వద్ద దృశ్యమిది. అక్కడికి ఓటు వేసేందుకు ఓ దివ్యాంగురాలొచ్చింది. ర్యాంపులు లేకపోవడంతో వీల్‌చైర్ సహా ఆమెను ఎత్తుకొని బూత్‌లోకి తీసుకెళ్లారు. ఆమెకు ఓ మహిళా వలంటీర్, కొందరు ఓటర్లు, బందోబస్తులో భాగంగా ఉన్న కానిస్టేబుల్ సాయం పట్టారు. నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఇలాంటి పరిస్థితులు కనిపించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు నిర్మించామని, వలంటీర్లనూ అందుబాటులో ఉంచామని, దివ్యాంగులు, వృద్ధులను వీల్ చైర్లో తీసుకెళ్లి ఓటు వేయిస్తామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ పలుమార్లు ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించలేదు. ర్యాంపులు లేకపోవడంతో వీల్‌చైర్ లో వెళ్లే అవకాశం లేక కొందరు ఓటు వేయకుండానే వెనుదిరిగారు. ఇంకొన్ని చోట్ల షామియానాలు లేవు.. మరికొన్ని చోట్ల తాగునీటి వసతి ఏర్పాటు చేయలేదు. మెజారిటీ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో క్యూలో వేచి చూసిన ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలు, కంటోన్మెంట్ శాసనసభ పరిధిలో 3,986 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇక్కడ వసతుల కల్పనకు రూ.12 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. మరో రూ.30 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు ఇతరత్రా ఎన్నికల నిర్వహణ వ్యయం రూపంలో లెక్కలు చూపుతున్నారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం వసతుల పేరిట కోట్లు ఖర్చు చేస్తున్నా ర్యాంపుల లాంటివి విస్మరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కేంద్రాలను ఇరుకైన గల్లీల్లో ఏర్పాటు చేశారు. అక్కడ ర్యాంపులు నిర్మించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. అలాంటి చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలోనూ యంత్రాంగం విఫలమైంది.

ఖాళీగా దర్శనమిచ్చిన నగరం

- రోడ్లపై కనిపించని జనం, వాహనాలు

హైదరాబాద్ సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న వేళ హైదరాబాద్ మహానగరం ఖాళీగా దర్శనమిచ్చింది. సంక్రాంతి నాటి రోజులును గుర్తిచేసింది. సోమవారం అతితక్కువ సంఖ్యలో మాత్రమే జనం రోడ్డుపైకి వచ్చారు. నగరంలో 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటే సుమారు 50 నిమిషాలు సమయం పట్టేది. అలాంటిది సోమవారం ట్రాఫిక్ లేకపోవడం, రోడ్లన్నీ ఖాళీగా ఉండటంతో అదే 20 కిలోమీటర్ల దూరాన్ని 25-30 నిమిషాల్లోపు చేరుకోవడం గమనార్హం.

దుకాణాల మూసివేత

ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం సెలవు ప్రకటించడం, అంతకు ముందు రోజు ఆదివారం కావడం, లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంతూళ్లకు వెళ్లడంతో చాలావరకు దుకాణాలు, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. దాంతో సోమవారం నగరంలో జనసాంద్రత తగ్గిపోయింది. మాల్స్‌లోనూ జనాలు లేకపోవడంతో బోసిపోయాయి. అయితే సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత కొన్ని దుకాణాలు తెరుచుకోవడంతో అక్కడక్కడా ప్రజలు రోడ్లపై దర్శనమిచ్చారు.

మద్యం కోసం పడిగాపులు

- బెల్ట్ దుకాణాల్లోనూ దొరకని మద్యం
- సిటీలో తెరుచుకోని వైన్‌షాపులు
- శివారు ప్రాంతాల్లో 7 తర్వాత ఓపెన్..
- భారీగా బారులు తీరిన మందుబాబులు
- పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించని క్యూ



దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్న మద్యం ప్రియులు

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం సాయంత్రం మందుబాబులు మద్యం కోసం వైన్ షాపుల ముందు పడిగాపులు గాశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆది, సోమవారాలు మద్యం దుకాణాలు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కాలనీలు, బస్తీల్లో బెల్ట్ దుకాణాలు సైతం మూసివేయడంతో ఎక్కడా మద్యం దొరక్క మద్యం ప్రియులు నానా తంటాలు పడ్డారు. కొంత మంది మద్యం ప్రియులు గంటల కొద్దీ వైన్స్ వద్ద పడిగాపులుగాశారు. సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు తెరుచుకోవడంతో మందుబాబులు భారీగా బారులు తీరారు. మద్యం చేతికి అందే వరకూ క్యూలో నిలబడ్డారు. అయితే, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు మంగళవారం ఉదయం 6 గంటల వరకు మూసివేయాలని సీపీ ఆదేశాలు జారీ చేయడంతో సిటీ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు తెరుచుకోలేదు. దాంతో మందుబాబులు సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలకు వెళ్లి మద్యం తెచ్చుకున్నారు.

పోలింగ్ వద్ద కనిపించని క్యూ..

గ్రేటర్‌లోని ట్రై కమిషనరేట్స్ పరిధిలో కొన్ని ప్రాంతాలు మినహా.. చాలా ప్రాంతాల్లో ఓటర్ల రద్దీ కనిపించలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కనిపించలేదు కానీ.. సాయంత్రం మద్యం దుకాణాల వద్ద మాత్రం మందు బాబులు భారీ గా బారులు తీరి మద్యం కోసం క్యూ కట్టారు. కొన్ని ప్రాంతాల్లో మద్యం కోసం ఎగబడ్డారు. ఓటు వేయడానికి సుముఖత చూపించకుండా.. మందు కోసం క్యూలో నిలబడటం చూసి సామాన్య ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.



ఆధునిక యుగంలో జీవన శైలి వల్ల కలిగే ఒత్తిడి వల్లే అన్ని రకాల జబ్బులు వస్తున్నాయని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. అయితే ఒత్తిడి మన జీవితాల్లో కలగజేస్తున్న సమస్యలను మనం ఇంకా సరిగ్గా గుర్తించటం లేదు. ఆధునిక సమాజంలో ఇది చాలా సామాన్యమైన విషయమని మనం భావిస్తున్నాం. జనాభా పెరుగుతోంది. ప్రజల కోరికలు పెరుగుతున్నాయి. పోటీతత్వం బాగా పెరుగుతోంది. తాము కోరుకుంటున్న విలాసవంతమైన జీవన విధానం కావాలంటే ఒత్తిడి తప్పనిసరి అనే భావన ఆలోచనలో చాలామంది ఉండిపోతున్నారు. ఒత్తిడి వల్ల మనకు కలిగే జబ్బుల గురించి ముంబాయికి చెందిన ప్రముఖ డయాబెటాలజిస్ట్, ఎంజీఎం మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ సందీప్ రాయ్ 'నవ్య'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. దానిలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...



ఒత్తిడి తినేస్తోంది!

"ఒకప్పుడు మానవుడికి ఒత్తిడి ఉండేది కాదా? ఎటువంటి సమస్యలు లేకుండా జీవించేవాడా? ఆధునిక జీవన శైలి వల్లే ఇవన్నీ వస్తున్నాయా? అనే ప్రశ్నలు మనకు మనం వేసుకుందాం. ఆహారాన్ని సంపాదించుకోవటం, క్రూరమృగాల బారిన పడకుండా తప్పించుకోవటం మాత్రమే ఒకప్పుడు మానవుడికి ఉన్న ఒత్తిడి అని చెప్పవచ్చు. ఉదాహరణకు వేటకు వెళ్లినప్పుడు ఒక పులి ఎదురయిందనుకుందాం. అప్పుడు మన మెదడు ఆదేశాల మేరకు శరీరంలో కొన్ని కెమికల్స్ ఉత్పత్తి అవుతాయి. వీటిని 'స్ట్రెస్ కెమికల్స్' అంటారు. ఈ కెమికల్స్ వల్ల మన శరీరంలో కొన్ని మార్పులు జరుగుతాయి. రక్తం కండరాలలోకి వేగంగా ప్రసరించడం మొదలవుతుంది. దూరంగా ఉన్న వస్తువులను స్పష్టంగా చూడగలుగుతాం. అప్రమత్తత పెరుగుతుంది. ఆలోచనల వేగం మూడు నాలుగింతలవుతుంది. ఇలా మన శరీరంలో వచ్చే మార్పులు- మనం పారిపోవటానికి లేదా పులిని ఎదుర్కొని పోరాడటానికి ఉపకరిస్తాయి. పరిణామక్రమంలో భూమిపై మనుగడ సాగించటం కోసం మానవ శరీరంలో వచ్చే మార్పులు ఇవి. కొన్ని కోట్ల సంవత్సరాల నుంచి ఒత్తిడి ఎదురయినప్పుడు మానవ శరీరంలో ఈ తరహా మార్పులు వస్తున్నాయి కాబట్టి అది ఒక సహజమైన ప్రక్రియగా మారిపోయింది. ఆధునిక జీవితంలో ప్రతి రోజూ ట్రాఫిక్ లైట్స్ దగ్గరో, పని దగ్గరో, నిర్ణయాలు తీసుకొనే సమయంలోనే ఒత్తిడి ఏర్పడినప్పుడు- మన శరీరం కెమికల్స్‌ను విడుదల చేయటం మొదలుపెడుతోంది. అంటే ఒకప్పుడు - వేటకు వెళ్లిన సమయంలో మాత్రమే విడుదలయ్యే కెమికల్స్... ప్రస్తుతం ప్రతిరోజు పదుల సార్లు విడుదలవుతున్నాయి. ఇలా విడుదలయిన కెమికల్స్ మన శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతున్నాయి. వ్యాధులను కలగజేస్తున్నాయి. అలాంటి వాటిలో ప్రధానమైనవి- బ్లడ్‌ప్రెషర్, డయాబెటిస్.

కొన్ని ఆహార పదార్థాలకు ఒత్తిడిని తగ్గించే లక్షణాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. అవేమిటో చూద్దాం...

- **అవకాడో:** అవకాడోలో రిబోఫ్లోవిన్, ఫోలేట్, బీ కాంప్లెక్ విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తాయి.
- **బ్లూ బెర్రీస్:** బ్లూబెర్రీస్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్స్ శరీర కణజాలల్లోని సమస్యలను ఎదుర్కోగలుగుతాయి.
- **గుడ్లు:** మన నాడీ వ్యవస్థలో సెరోటోనిన్, డోపోమైన్ వంటి హార్మోన్ల వల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఒత్తిడిని తగ్గించటానికి కోడి గుడ్డులోని పచ్చసొనలో ఉండే విటమిన్ డి ఉపకరిస్తుందని అధ్యయనాల్లో తేలింది.
- **పాలకూర:** పాలకూరలో కాల్షియం అధికంగా ఉంటుంది. కాల్షియం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. పాలకూరతో పాటుగా పాలు, పెరుగులు కూడా ఒత్తిడిని తగ్గించటానికి ఉపకరిస్తాయి.
- **చేమంతి:** చేమంతి, బంతి పూల రేకులను ఎండబెట్టి కాచే హెర్బల్ టీలు కూడా ఒత్తిడిని తగ్గించటంలో ఉపకరిస్తాయి.

స్థూలకాయమే సూచి...

ఇలా విడుదలయ్యే వాటిలో ప్రధానమైన రసాయం... కార్టిసాల్. ఇది రక్తపు పోటుకు, మధుమేహానికి, స్థూలకాయానికి- ఇలా అనేక రకాల సమస్యలకు కారణమవుతుంది. ఒకప్పుడు ఒత్తిడి ఎక్కువగా ఉంటే సన్నంగా ఉంటారనుకొనేవారు. కానీ ఇప్పుడు ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారిని చూడండి. స్థూలకాయులే ఎక్కువగా కనిపిస్తారు. ఈ రకంగా చూస్తే- ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న జీవన శైలి సమస్యలకు ఒత్తిడే కారణమని చెప్పవచ్చు. ఒత్తిడికి తోడు మన ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు కూడా సమస్యను మరింత ఎక్కువ చేస్తున్నాయి. అవసరమున్నా లేకపోయినా తినటం, పిజ్జా, చిప్స్ వంటి తినటం, కోలాలు తాగటం వల్ల రకరకాల అనర్థాలు కలుగుతున్నాయి. వ్యాయామం లేకపోవటం ఇంకో సమస్యగా మారింది. ఈ మూడింటిలోను- ఆహారపు అలవాట్లను మార్చవచ్చు. వ్యాయామం చేయమని సలహా ఇవ్వవచ్చు. కానీ 'ఎక్కువ ఒత్తిడి వద్దు' అని చెబితే సరిపోదు. దానిని అధిగవించటానికి అవసరమైన పద్ధతులు కూడా చెప్పాలి. మేము చేసిన అధ్యయనాలలో ఒత్తిడిని తగ్గించటంలో - యోగా, ధ్యానం బాగా పనిచేస్తాయని తేలింది. ధ్యానం వల్ల మన ఆలోచనలను నియంత్రించగలుగుతాము. మేము 'సహజయోగా'తో చేసిన పరిశోధనల్లో - ఈ తరహా ధ్యానం వల్ల ఒత్తిడి తగ్గుతుందని తేలింది.



అత్యంత ప్రమాదకారి

ఇక్కడ మనం ఒత్తిడి వల్ల వచ్చే ప్రధానమైన వ్యాధి మధుమేహం కాబట్టి దీని గురించి కూడా కొద్దిగా మాట్లాడుకుందాం. ఈ మధ్యకాలంలో చిన్నపిల్లలకు.. యుక్తవయస్సులో ఉన్నవారికి కూడా మధుమేహం రావటం చూస్తున్నాం. శాస్త్ర పరిశోధనల్లో 'థిన్ ఫ్యాట్ ఇండియన్స్' అనే ఒక సిద్ధాంతం ఉంది. దీని ప్రకారం చాలా మంది భారతీయులు- చూడటానికి సన్నగా ఉంటారు. కానీ వారి పొట్ట భాగంలో మాత్రం బాగా కొవ్వు పట్టి ఉంటుంది. ఈ విధంగా కొవ్వు పట్టడానికి కారణం జన్యువులే! దీనిని 'థ్రిఫ్టి జీన్' సిద్ధాంతం అంటారు. ఈ జన్యువు వెనక కూడా ఒక కథ ఉంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం మన ఆసియా ప్రాంతంలో ప్రజలు స్థిరపడి పంటలు పండించటం ప్రారంభించారు. కొన్నిసార్లు కరువు కాటకాలు వచ్చి తినటానికి ఏమీ ఉండేది కాదు. దీని వల్ల కొన్ని లక్షల మంది మరణిస్తూ ఉండేవారు. ఇలా అనేకసార్లు జరిగిన తర్వాత మన జన్యువుల్లో కొన్ని మార్పులు జరిగాయి. ఈ మార్పులు వల్ల ఎప్పుడైనా అదనంగా ఆహారం దొరికినప్పుడు- మన శరీరం దానిని కొవ్వుగా మార్చి పొట్ట చుట్టుపక్కల దాచుకుంటుంది. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా ఇది కనిపిస్తుంది. కరువు సమయాల్లో శరీరం దీన్ని వాడుకుంటుంది. దీని వల్ల ఎక్కువ కాలం బతకగలుగుతారు. అయితే గత 50 ఏళ్లలో మన ఆహార ఉత్పత్తి పెరిగింది. కరువులు కూడా తగ్గాయి. మరోవైపు యువతీయువకుల ఆదాయం పెరిగింది. దీని వల్ల' రెడీ టూ ఈట్ ఫుడ్‌కు ఆదరణ కూడా పెరిగింది. దీనివల్ల శరీరంలో కొవ్వు పెరగటానికి అవకాశాలు ఎక్కువయ్యాయి. అంటే ఒకవైపు మన శరీరంలో జన్యువుల్లో మార్పులు రాలేదు. అదనపు ఆహారాన్ని కొవ్వుగా మార్చాల్సిన అవసరం లేదనే విషయం వాటికి తెలియటం లేదు. బహుశా మరో వంద లేదా రెండు వందల ఏళ్లకు మన జన్యువులకు ఆ విషయం తెలిసే అవకాశం ఉంది. అప్పటి దాకా అదనంగా తిన్న ఆహారాన్ని అవి కొవ్వుగా మారుస్తూ ఉంటాయి. మరోవైపు అవసరమైన దాని కన్నా ఎక్కువ ఆహారాన్ని తినటం మొదలుపెడుతున్నారు. ఈ రెండిటి వల్ల మన దేశంలో మధుమేహ సమస్య రోజు రోజుకు పెరిగిపోతోంది."

కొత్త తరం మందులు వచ్చాయి...

30 ఏళ్లు దాటి- కొద్దిగా పొట్ట ఉన్న వాళ్లందరూ మధుమేహ పరీక్షలు చేయించుకుంటే మంచిది. కడుపు చుట్టూ ఉన్న కొవ్వు శరీరంలోని అన్ని అవయవాలకు చేరుతుంది. మన దేశంలో 95 శాతం మందికి దీని వల్లే మధుమేహ సమస్య ఏర్పడుతోంది. వీరు తాము మధుమేహ బాధితులం కాబోతున్నామనే విషయాన్ని గమనించి... బరువు తగ్గించుకొని, వ్యాయామం చేస్తే- సమస్యను ఎదుర్కొవటానికి వీలవుతుంది. వీరికి మధుమేహం పూర్తిగా తగ్గుతుంది లేదా చిన్న డోస్‌తో మేనేజ్ చేయగలుగుతారు. అయితే చాలామంది యువతీయువకులు కంప్యూటర్ ముందు కూర్చుంటారు. ఆహారం తింటారు. కానీ తగిన వ్యాయామం చేయరు. దీనివల్ల సుగర్ స్థాయిలు పెరుగుతాయి. దీన్ని నియంత్రించటానికి శరీరం ఎక్కువ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. చేస్తూ పోతుంది. ప్యాంక్రియాస్ ఎక్కువగా పనిచేయటం మొదలుపెడతాయి. బీటా సెల్స్ మధుమేహాన్ని నియంత్రించటానికి ప్రయత్నిస్తాయి. కొద్ది కాలం తర్వాత బీటా సెల్స్ పనిచేయటం మానేస్తాయి. దీని వల్ల ఇన్సులిన్ విడుదల కాదు. కొత్త తరం మందులు- జీఎల్‌పీ1 మాలిక్యూల్ మందులు అందుబాటులోకి వచ్చాయి. దీని వల్ల బరువు తగ్గుతారు. ఆకలి తగ్గుతుంది. ఇన్సులిన్ విడుదల కూడా పెరుగుతుంది. రెండో రకం... ఎజీఎల్‌టీటూ ఇన్‌హిబెటర్స్. ఇవి గ్లూకోజ్ శరీరంలోకి చేరకుండా చేస్తాయి. సుగర్ స్థాయిలు 180 కన్నా పెరిగితే- వాటిని బయటకు పంపేస్తాయి. దీనివల్ల బరువు కూడా తగ్గుతారు. ఇవి కిడ్నీలపై ఎటువంటి దుష్పరిమాణాలు కలగజేయవు.

ఉదయం... రాత్రి కాల్షియం బెస్ట్!

చాలా మంది కాల్షియం ట్యాబ్‌లెట్స్ వాడుతూ ఉంటారు. అయితే ఈ టాబ్‌లెట్స్‌ను ఎప్పుడు వాడాలనే విషయంలో అనేక భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. బీఎంసీ మెడికల్ అనే మెడికల్ మ్యాగ్‌జైన్‌లో తాజాగా ప్రచురించిన అధ్యయనం ప్రకారం- ఉదయం, రాత్రి ఒకే మోతాదులో కాల్షియం తీసుకుంటే మంచిదని తేలింది. "మన శరీరానికి కాల్షియం చాలా అవసరం. అయితే ఈ సమయంలో ఈ కాల్షియం తీసుకుంటున్నామనేది కూడా ముఖ్యమే. ఇప్పటి దాకా ఏ సమయంలో కాల్షియం తీసుకుంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుందనే అంశంపై ఎక్కువ పరిశోధనలు జరగలేదు. మేము చేసిన అధ్యయనంలో ఉదయం, రాత్రి కాల్షియాన్ని తీసుకుంటే సమర్థంగా పనిచేస్తుందని తేలింది. కాల్షియం ఎంత త్వరగా పని చేస్తుందనే విషయం- దానితో పాటుగా తీసుకొనే ఇతర ఆహార పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా బ్రేక్‌ఫాస్ట్ సమయంలోను, రాత్రి డిన్నర్ సమయంలో సమతౌల్య ఆహారం తీసుకుంటారు." అని అధ్యయనంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ ఆర్.ఆర్. దత్తా వెల్లడించారు.



గుండె జబ్బులతో లింక్!

మన శరీరంలో రక్తపోటు సరిగ్గా ఉండాలంటే కాల్షియం అవసరం అవుతుంది. అదే విధంగా గుండెలో కండరాల ఆరోగ్యం సక్రమంగా ఉండాలన్నా కాల్షియం ఎంతో అవసరం. వీటితో పాటుగా రక్తనాళాలు పూడుకుపోకుండా చూడటంలో కాల్షియందే పెద్ద పాత్ర. అందువల్ల గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే కాల్షియం మోతాదు సక్రమంగా ఉండాలి. "చాలా సార్లు కాల్షియం విలువలు తక్కువ ఉన్నాయని తెలిసిన తర్వాత మందులు వాడటం మొదలుపెడతారు. విలువలు పెరిగిన తర్వాత వాడటం మానేస్తారు. దీని వల్ల కలిగే ప్రయోజనాలు తాత్కాలికమే. అందువల్ల సమతౌల్య ఆహారాన్ని తీసుకుంటే ఈ సమస్య ఉండదు" అంటారు దత్తా. డాక్టర్ల సలహా లేకుండా కాల్షియం టాబ్‌లెట్స్‌ను వాడకూడదని కూడా ఆయన హెచ్చరిస్తున్నారు. "శరీరంలో కాల్షియం పెరిగిపోయినా అనేక సమస్యలు ఎదురవుతాయి. కాల్షియం ఎక్కువయితే కిడ్నీలో రాళ్లు వస్తాయి. అదే విధంగా రక్తనాళాలు గట్టిగా అయిపోతాయి. అందువల్ల డాక్టర్ల పర్యవేక్షణలో తప్ప కాల్షియం వాడకూడదు" అని పేర్కొంటున్నారు.

ఆరోగ్యం విషయంలో ఎన్నో అపోహలు ప్రచారంలో ఉంటాయి. ఇవి చాలామట్టుకు నిర్ధారరణ కాని పుకార్లే. వీటివల్ల భయం, గందరగోళం కలుగుతాయి. సోషల్ మీడియా పెరిగిన తరువాత ఇలాంటివి బాగా ప్రచారంలోకి వచ్చేస్తున్నాయి. వీటిలో కొన్ని హానికరంగా కనిపించకపోవచ్చు. కానీ అవి అనవసరమైన ఆందోళనకూ, సరైన చికిత్స తీసుకోకపోవడానికీ కారణమవుతాయి. అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలంటే ఏవి అపోహలు, ఏవి వాస్తవాలు అనేది తెలుసుకోవాలి. అలాంటివి కొన్ని:



అవి అపోహలు.. ఇవీ వాస్తవాలు

అపోహ: రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు తాగాలి...

వాస్తవం: ప్రతి ఒక్కరూ రోజుకు ఎనిమిది గ్లాసుల నీరు తాగాలనేది అపోహ. ఒక వ్యక్తి నీరు ఎంత తాగాలి? అనే విషయం... వాతావరణం, ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, చెమట ఎంత ఎక్కువగా పడుతోంది, గర్భిణులా లేదా పాలిచ్చే తల్లులా?... ఇలా పలు అంశాలమీద ఆధారపడి ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలో నివసించే వ్యక్తి రోజూ రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలని 'యుఎస్ నేషనల్ అకడమిక్స్ ఆఫ్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ మెడిసిన్' సంస్థ సూచించింది. దీనితో పాటు మన శరీరం ప్రతిస్పందనలను కూడా గమనిస్తూ ఉండాలి. శరీరంలో హైడ్రేషన్ తగ్గుతున్నప్పుడు దాహంగా అనిపిస్తుంది. ఆ స్థితికి వచ్చేవరకూ ఆగకుండా... రోజంతా అప్పుడప్పుడు నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది.

అపోహ: రాత్రి ఆలస్యంగా తింటే బరువు పెరుగుతారు...

వాస్తవం: బరువు పెరగడం అనేది ఏ వేళలో ఆహారం తిన్నారనే దాని కన్నా... రోజు మొత్తం మీద తీసుకొనే క్యాలరీల పరిమాణం మీద ప్రాథమికంగా ఆధారపడి ఉంటుంది. అయితే నిద్ర పోవడానికి ముందు ఎక్కువగా తింటే... కలత నిద్ర, అజీర్తి లాంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి, పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందు భోజనం చెయ్యాలనేది ఆరోగ్య నిపుణుల సూచన. అప్పుడు... తిన్న ఆహారం జీర్ణం కావడానికి తగినంత సమయం ఉంటుంది.

అపోహ: మూడు పూటలూ కడుపు నిండా తినడం కన్నా... చిన్న చిన్న విరామాలిచ్చి కొద్ది కొద్దిగా తినడం మంచిది.

వాస్తవం: ఇది ఆ వ్యక్తి శరీర స్వభావం, ఆరోగ్యం, జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది. కొందరు చాలా తరచుగా కొంచెం కొంచెం తిని, ఆకలి తగ్గించుకొని, ఎనర్జీ స్థాయిని పెంచుకోవడం సౌకర్యంగా భావిస్తారు. మరికొందరు మూడుసార్లు ఎక్కువగా తింటే హాయిగా ఉంటుందనుకుంటారు. దీనికన్నా మీరు తినే ఆహారంలో పోషరాలు ఉండలా చూసుకోవడం ముఖ్యమన్నది పోషకాహార నిపుణుల సూచన. పోషకాలు పుష్కలంగా ఉన్న సమతుల ఆహారాన్ని తీసుకోవడం ఆరోగ్యకరం. ఎన్నిసార్లు అనేది మీ వెసులుబాటును బట్టి నిర్ణయించుకోండి.

అపోహ: డీటాక్స్ డైట్ శరీరం నుంచి విషపదార్థాలను తొలగిస్తుంది...

వాస్తవం: మనిషి శరీరానికి డీటాక్సిఫికేషన్ చేసుకోగలిగే సామర్థ్యం స్వతహాగానే ఉంటుంది. శరీరం నుంచి విష పదార్థాలను సహజసిద్ధంగా తొలగించడంలో కాలేయం, మూత్రపిండాలు, జీర్ణ వ్యవస్థ, చర్మం, ఊపిరితిత్తులు కీలకపాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు, విషపదార్థాలను కాలేయం రసాయనికంగా తటస్థీకరిస్తుంది. అలాగే విషపదార్థాలను మూత్రం ద్వారా మూత్రపిండాలు వడపోస్తాయి, చెమట ద్వారా చర్మం అలాంటి పదార్థాలను బయటకు పంపుతుంది. శరీరంలోని కొన్ని నిర్దిష్టమైన చెడు పదార్థాలను తొలగించుకోవడానికి డీటాక్స్ డైట్‌ను కొందరు అనుసరిస్తూ ఉంటారు. అయితే వారు కోరుకున్న విష పదార్థాలు దానిద్వారా తొలగిపోవడం చాలా అరుదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ డైట్ వల్ల ప్రయోజనాలూ ఉన్నాయంటున్నారు. ఈ డైట్ అనుసరించేవారు ప్రాసెస్డ్ ఫుడ్స్ లాంటి వాటికీ, మద్యపానానికీ దూరంగా ఉంటారు. దీనివల్ల శరీరం ఉత్సాహంగా, శక్తిమంతంగా అనిపిస్తుంది. కాబట్టి ప్రత్యక్షంగా పెద్ద ప్రభావం లేకపోయినా... ఇటువంటి పరోక్ష ప్రభావాలకు డీటాక్స్ డైట్స్ దోహదం చేస్తాయి.

యోగా

వెన్నెముక బలోపేతానికి

వెన్నెముకను బలోపేతం చేయడానికి యోగ నమస్కారం ఒక శక్తిమంతమైన ప్రక్రియ. ఇది వెన్ను చివరి భాగాన్ని ఉత్తేజపరిచి, వెన్నెముక కండరాలను బలపరచి, వయసు పెరిగే కొద్దీ పెరిగే వెన్ను వంగిపోయే సమస్యను ఆపుతుంది. ఒకవేళ ఇప్పటికే అలాంటి సమస్యలతో బాధపడుతుంటే... వెన్ను పునరుజ్జీవానికి యోగ నమస్కారం దోహదపడుతుంది.



యోగ నమస్కారం ఇలా...

- నిటారుగా నిల్చోండి. పాదాల మధ్య కనీసం అడుగు దూరం ఉండాలి. చేతులు, భుజాలు బిగించినట్టు కాకుండా, రిలాక్స్‌డ్‌గా వదిలేయండి. ఎదురుగా కనిపించే వస్తువుపై దృష్టి కేంద్రీకరించండి. ఒకసారి మీ దృష్టి స్థిరమైన తరువాత, అరచేతులను ఛాతీకి దగ్గరగా తీసుకువచ్చి నమస్కారం పెట్టండి. ఇది మొదటి స్థితి.
- శ్వాస తీసుకొంటూ రెండు చేతులనూ అలానే ఎత్తి, తల పైకి తీసుకురండి. శ్వాస వదులుతూ అరచేతుల కింది భాగం మెడ వెనుకకు వచ్చేలా చేతులను కిందికి తీసుకురండి. శ్వాస తీసుకొంటూ చేతులను అలానే పైకి ఎత్తండి. శ్వాస వదులుతూ అరచేతులను ఛాతీ దగ్గరకు తీసుకురండి. ఇలా మరో



రెండుసార్లు చేయండి.
- పైన చెప్పినట్టుగానే మళ్లీ చేతులను కదిలిస్తూ... గొంతు మూలల నుంచి శబ్దం చేయండి. ఇది రెండో అంచె. ఈ మొత్తం ప్రక్రియల్లో మీ చేతి వేళ్లన్నీ నిటారుగా పైకి చూస్తున్నట్టు ఉండాలి. అలానే తల కూడా వంగకుండా నిటారుగా ఉండాలి. మెడ వెనుక నుంచి చేతులు పైకి ఎత్తుతున్నప్పుడు శబ్దం చేస్తూ శ్వాస తీసుకోవాలి. కిందికి దించుతున్నప్పుడు శ్వాస వదలాలి. ఇలా మూడుసార్లు చేయాలి.
- ఇప్పుడు అరచేతులు ఛాతీకి దగ్గరగా తీసుకువచ్చి, మోకాళ్లు ఛాతీకి తగిలేలా కూర్చోండి. తరువాత శ్వాస తీసుకొంటూ చేతులను నిటారుగా పైకి లేపండి. శ్వాస వదులుతూ అరచేతులను మెడ వెనుక వైపునకు దించండి. మళ్లీ శ్వాస తీసుకొంటూ అరచేతులు పైకెత్తండి. శ్వాస వదులుతూ అరచేతులను ఛాతీ ముందుకు తీసుకురండి.
- తరువాత శ్వాస తీసుకొంటూ, వేళ్లను ముందుకు చూపుతూ, చేతులను పూర్తిగా సాగదీయండి. శ్వాస వదులుతూ, శబ్దం చేస్తూ, అరచేతులను వెనక్కు ఛాతీ దగ్గరకు తీసుకురండి. ఇలా మూడుసార్లు చేయండి.
- అదే భంగిమలో శ్వాస తీసుకొంటూ అరచేతులను పైకి ఎత్తండి. శ్వాస వదులుతూ అరచేతులను మెడ వెనుక వైపునకు దించండి. శ్వాస తీసుకొంటూ పైకి, శ్వాస తీసుకొంటూ ఛాతీ మీదకు, తరువాత శ్వాస తీసుకొంటూ వేళ్లను ముందుకు చూపుతూ చేతులు సాగదీయండి. ఇలానే మళ్లీ చేయండి.
- ఇప్పుడు అలాగే మోకాళ్లు ఛాతీకి తగిలేలా కూర్చొని, చేతి వేళ్లు ముందుకు చూపుతూ, చేతులు పూర్తిగా చాచి, మోకాళ్లు, నుదురు నేలకు ఆనించాలి. చేతులు ముందుకు తీసుకువచ్చి, అరచేతులు నేలకు ఆనించాలి. చేతుల బొటనవేలు, చూపుడు వేళ్లూ కలిపితే వాటి మధ్య త్రిభుజాకారం ఏర్పడుతుంది. మోచేతులను కొద్దిగా వంచండి. దీన్నే బాలాసనం అంటారు. కనీసం రెండు నిముషాలపాటు అలానే ఉండండి.
- తరువాత నెమ్మదిగా నిల్చొని, మొదటి స్థానానికి రండి. దీంతో ఒక యోగ నమస్కారం పూర్తయినట్టు. యోగ నమస్కారం చేయాలంటే... ఆహారం తీసుకున్నాక కనీసం గంటన్నర వ్యవధి ఉండాలి.



దిక్సూచి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.



మహా సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

హైసీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్లు)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్‌ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీ కాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీ'ని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ధి చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఐఐఎఫ్‌టీ
ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐహెచ్‌ఎంలో డిప్లొమా

హాజిపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

విభాగాలు-సీట్లు: ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెబ్‌సైట్: ihmhajipur.net

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/SyPw2ylలో చదవండి.

నవ్య చిత్రజ్యోతి






క్యూలో నిల్చుని ఓటేసిన సినీ ప్రముఖులు

సోమవారం హైదరాబాద్‌లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో సినీ ప్రముఖులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాధారణ జనంతో పాటు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూ లైన్లలో నిలబడి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, మోహన్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, కల్యాణ్‌రామ్, డాక్టర్ రాజశేఖర్, నాని, నాగచైతన్య విజయ్ దేవరకొండ.. ఒకరనేమిటి అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'మీరు కూడా ఓటు వేయండ'ంటూ పిలుపునిచ్చారు.







మాతృభాషలోనూ డబ్బింగ్

దక్షిణాది అభిమానులే కాక ఉత్తరాది ప్రేక్షకలోకం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుండడంతో చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసింది. ఇటీవలే ఈ మూవీలో తన పాత్ర కోసం దీపికా డబ్బింగ్ మొదలుపెట్టారు. ఆ పాత్ర డబ్బింగ్‌ను హిందీలోనే కాకుండా తన మాతృభాష అయిన కన్నడలోనూ దీపికానే స్వయంగా చెప్పుకోవడం విశేషం. తన మాతృభాషలో డబ్బింగ్‌కు దీపికానే వాయిస్ అందించడంతో ఇది మూవీకి మరింత ప్లస్ కానుంది అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





కేన్స్ చిత్రోత్సవంలో టీజర్ లాంచ్

మంచు విష్ణు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇందుకు తగ్గట్లే ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ విషయంలో చిత్ర బృందం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదల చేయబోతున్నారు. 'వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ కానున్న ఈ టీజర్ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. కాగా, ఈ భారీ బడ్జెట్ ఫ్యాంటసీ డ్రామాను ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబు, శరత్‌కుమార్, శివ రాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

నటిస్తూ వేదికపై కుప్పకూలిన నటుడు



జీవితంలో చివరి క్షణం వరకూ నటిస్తూ ఉండాలని చాలా మంది చెబుతుంటారు. అది మరాఠీ నటుడు సతీశ్ జోషి విషయంలో నిజమైంది. ఆదివారం ఆయన ముంబైలో రంగోత్సవ్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తూ ఉన్నట్లుండి వేదికపై కుప్పకూలారు. 'ఉదయం నుంచి సతీశ్ అలసటతో కనిపించారు. వేదికపై కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆయన కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.' అని సతీశ్ సన్నిహిత మిత్రుడు, సహ నటుడు రాజేశ్ దేశ్‌పాండే చెప్పారు. మరాఠీ నాటకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా సతీశ్ చిరపరిచితుడు. ఆయన మరణంతో ఓ ప్రతిభాశాలిని మరాఠీ చిత్ర పరిశ్రమ కోల్పోయిందని చెప్పాలి.

స్పోర్ట్స్

నిఖత్ శుభారంభం

అస్టానా (కజకిస్థాన్): స్టార్ బాక్సర్, తెలుగమ్మాయి నిఖత్ జరీన్ ఎలోర్డా బాక్సింగ్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. ప్రపంచ చాంపియన్ నిఖత్ 52 కిలోల విభాగంలో రెండోరౌండ్‌కు దూసుకెళ్లింది. సోమవారం ఇక్కడ జరిగిన తొలి రౌండ్లో నిఖత్ 5-0తో స్థానిక బాక్సర్ రఖీమ్‌బెర్డి జన్సాయాను చిత్తుచేసింది. నిఖత్‌తో పాటు మీనాక్షి (48 కిలోలు), అనామిక (50 కి) కూడా తమ ప్రత్యర్థులను ఓడించి రెండో రౌండ్లో అడుగుపెట్టారు. మిగతా భారత బాక్సర్లలో ఇష్మీత్ సింగ్ (75 కి), సోనియా (54 కి) మొదటి రౌండ్‌లోనే ఓడారు.

శ్రీనివాస్‌కు రజతం

ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్



భువనేశ్వర్: జాతీయ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రెండోరోజు పోటీల్లోనూ తెలుగు అథ్లెట్ సత్తా చాటాడు. ఏపీకి చెందిన నలుబోతు షన్ముగ శ్రీనివాస్ పురుషుల 200 మీటర్ల రేసులో రజత పతకం సాధించాడు. సోమవారం ఇక్కడ జరిగిన ఫైనల్ రేసును శ్రీనివాస్ 20.97 సెకన్లలో ముగించి రెండోస్థానంలో నిలిచాడు. అనిమేశ్ (ఒడిశా, 20.62 సె)కు స్వర్ణం, జైషా (మహారాష్ట్ర, 21.31 సె)కు కాంస్యం దక్కాయి. ఇక, మహారాష్ట్రకు చెందిన అభా ఖతువా షాట్‌పుట్‌లో రికార్డు ప్రదర్శనతో ఆకట్టుకుంది. అభా డిస్క్‌ను 18.41 మీటర్ల దూరం త్రో చేసి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి తాను గతంలో నెలకొల్పిన 18.05 మీటర్ల రికార్డును అభా తిరగరాసింది.

నీరజ్, కిశోర్ నేరుగా ఫైనల్స్‌కు: ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా, కిశోర్ జెనా జావెలిన్ త్రో ఈవెంట్‌లో నేరుగా ఫైనల్స్ ఆడనున్నారు. ఈ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ మార్క్ అయిన 75 మీటర్ల దూరాన్ని నీరజ్, కిశోర్‌లు తమ కెరీర్‌లో ఇప్పటికే పలుసార్లు అధిగమించారని, అందుకే ఈనెల 15న జరిగే ఫైనల్స్‌కు వారికి నేరుగా ఎంట్రీ కల్పించినట్టు నిర్వాహకులు వెల్లడించారు.

టైటాన్స్ ఆశలపై 'నీళ్లు'



నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: ఢిల్లీ

ఢిల్లీ X లఖ్‌నవూ

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
661 (13 మ్యాచ్‌లు)	20 (13 మ్యాచ్‌లు)




ప్లేఆఫ్స్ నుంచి గుజరాత్ అవుట్

వరుణుడి ఆటంకం । కోల్‌కతాతో మ్యాచ్ రద్దు

అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. సోమవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్ కనీసం టాస్ కూడా పడకుండానే రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ప్రస్తుతం 11 పాయింట్లతో ఉన్న టైటాన్స్ ముందుకెళ్లేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించింది. 2022లో టైటాన్స్ తమ ఆరంభ సీజన్‌లోనే చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించగా.. తర్వాతి ఏడాది కూడా ఫైనల్‌కు చేరగలిగింది. కానీ ఈసారి కొత్త కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలో జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టి నిరాశపరిచింది. అటు కోల్‌కతా 19 పాయింట్లతో టాప్-2లో చోటు ఖాయం చేసుకుంది. టాస్ వేయడానికి ముందే ఉరుములు, మెరుపులతో ఆకాశం బీభత్సంగా మారింది. దీనికితోడు విరామం లేకుండా వర్షం కురవగా మైదానం చిత్తడిగా మారింది. అంపైర్లు పలుమార్లు పరీక్షించినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఐదు ఓవర్ల మ్యాచ్‌కు రా.10.56 కటాఫ్ సమయం ఉన్నప్పటికీ మైదానం సిద్ధం చేసే పరిస్థితి కనిపించలేదు. అందుకే అంతకన్నా 20 నిమిషాల ముందే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

సాత్విక్ జోడీపైనే కళ్లన్నీ

నేటినుంచి థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్: ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో నిరాశ పరిచిన భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్/చిరాగ్ మళ్లీ పూర్వపు ఫామ్ అందిపుచ్చుకోవాలని తలుస్తోంది. ఇందుకు..మంగళవారం ప్రారంభమయ్యే థాయ్‌లాండ్ సూపర్-500 టోర్నమెంట్ సరైన వేదికని భావిస్తోంది. తొలిరౌండ్‌లో మలేసియా ద్వయం నూర్ మహ్మద్/టాన్ తీ యోంగ్‌తో సాత్విక్/చిరాగ్ జోడీ తలపడనుంది. పారిస్ ఒలింపిక్స్ సిద్ధమయ్యే క్రమంలో.. సింగిల్స్ ఆటగాడు ప్రణయ్ కూడా ఈ టోర్నీని సవాలుగా తీసుకుంటున్నాడు. థామస్ కప్‌లో ఇండోనేసియా స్టార్ ఆంథోనీ గిన్‌టింగ్‌పై విజయం ప్రణయ్‌లో ఆత్మవిశ్వాసం పెంచింది. కిరణ్ జార్జ్, సతీష్ కూడా థాయ్‌లాండ్ బరిలో ఉన్నారు. కాగా..లక్ష్యసేన్, పీవీ సింధు ఈ టోర్నీలో పాల్గొనడంలేదు. మహిళల సింగిల్స్‌లో అష్మిత చలిహా, మాళవికా బన్సోడ్, ఆకర్షి కశ్యప్ తదితరులూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో/అశ్వినీ పొన్నప్ప ద్వయానికి తొలి రౌండ్‌లో బై లభించింది.

గ్రాండ్‌మాస్టర్‌గా శ్యామ్ నిఖిల్



దుబాయ్: తమిళనాడుకు చెందిన శ్యామ్ నిఖిల్ భారత 85వ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచాడు. దుబాయ్ పోలీస్ మాస్టర్స్ ఫైనల్ రౌండ్‌లో జిన్షీ బాయ్ (చైనా)తో జరిగిన గేమ్‌ను డ్రా చేసుకున్న నిఖిల్ తుది జీఎం నార్మ్‌ను సాధించాడు. 2011లో రెండు జీఎం నార్మ్‌లు పొందాక.. తర్వాతి ఏడాది ఫిడే రేటింగ్స్ జాబితాలో నిఖిల్ తొలిసారి 2502 ఎలో పాయింట్లు పొందాడు. అనంతరం 12 ఏళ్ల తర్వాత గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు.

నార్వే చెస్‌కు హంపి, ప్రజ్ఞానంద, వైశాలి

ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో భారత్ నుంచి కోనేరు హంపి, ప్రజ్ఞానంద, వైశాలి ప్రాతినిథ్యం వహిస్తారు. 'వింబుల్డన్ ఆఫ్ చెస్'గా భావించే ఈ టోర్నీ ఈనెల 27 నుంచి నార్వేలో జరగనుంది.

హార్దిక్‌ను రోహిత్ వద్దన్నా..?

బోర్డు ఒత్తిడితో ప్రపంచకప్ జట్టులో చోటు



న్యూఢిల్లీ: జట్టుకు ఏకంగా ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్ రోహిత్‌ను పక్కనబెట్టి గుజరాత్ నుంచి భారీ మొత్తానికి తెచ్చు కొని హార్దిక్ పాండ్యాకు ముంబై ఇండియన్స్ యాజమాన్యం సారథ్య బాధ్యతలు అప్పగించడం దేశ క్రికెట్‌లో ఓ సంచలనం. ఇక అప్పటినుంచి రోహిత్, హార్దిక్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయన్న వార్తలు వచ్చాయి. వాటికి బలం చేకూర్చే మరో సంఘటన ఇది. అదేంటంటే.. వరల్డ్ కప్ జట్టుకు హార్దిక్ పాండ్యాను ఎంపిక చేయకూడదని టీమిండియా కెప్టెన్ రోహిత్ గట్టిగా పట్టుబట్టాడని సమాచారం. సెలెక్షన్ కమిటీ చైర్మన్ అగార్కర్ కూడా రోహిత్‌కు మద్దతు పలికాడని తెలిసింది. కానీ భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా హార్దిక్‌ను టీ20 జట్టు కెప్టెన్‌గా చేయాలనుకొంటున్న బీసీసీఐ.. రోహిత్‌తో పాటు, అగార్కర్‌పై ఒత్తిడి తెచ్చి హార్దిక్‌ను జట్టులో చేర్పించిందట! అలా 15 మంది జట్టు సభ్యుల్లో పాండ్యాకు స్థానం దక్కడంతోపాటు వైస్ కెప్టెన్సీ లభించిందట.

స్వదేశానికి ఇంగ్లండ్ క్రికెటర్లు

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఆడుతున్న ఇంగ్లండ్ క్రికెటర్లు లీగ్‌ను వీడనున్నారు. ఈనెల 22 నుంచి పాకిస్థాన్‌తో ఆ జట్టు నాలుగు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. టీ20 ప్రపంచకప్‌నకు ముందు దీన్ని సన్నాహకంగా భావిస్తుండడంతో ఐపీఎల్‌లో ఆడే తమ క్రికెటర్లను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వెనక్కి రమ్మని ఆదేశించింది. దీంతో విల్ జాక్స్, టోప్లేతో పాటు రాజస్థాన్ ఓపెనర్ బట్లర్ ఇప్పటికే భారత్ వీడారు. వీరితో పాటు ఇదే వారంలో మొయిన్ అలీ, బెయిర్‌స్టో, కర్రాన్, ఫిల్ సాల్ట్ కూడా ఇంగ్లండ్ పయనమవుతారు. పంజాబ్ బ్యాటర్ లివింగ్‌స్టోన్ వెళ్లినా అతడు గాయంతో బాధపడుతున్నాడు. దీంతో పాక్‌తో సిరీస్‌కు అతడు దూరంగా ఉండే చాన్సుంది.

జాతీయ ఫుట్‌బాల్ శిబిరానికి సౌమ్య



హైదరాబాద్: భారత సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరానికి హైదరాబాద్‌లోని శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ ఆతిథ్యమివ్వనున్నది. తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం (టీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 12రోజుల పాటు జరిగే ఈ శిబిరానికి రాష్ట్రం తరఫున గుగులోతు సౌమ్య ఎంపికైంది. ఈ శిక్షణ శిబిరంలో సత్తా చాటిన వారిని ఈనెల 31 నుంచి ఉజ్బెకిస్థాన్‌లో జరిగే రెండు అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో తలపడే భారత జట్టుకు ఎంపిక చేస్తారని టీఎఫ్‌ఏ కార్యదర్శి పల్గుణ తెలిపారు.

రేసు రసవత్తరం..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఈ ఐపీఎల్ సీజన్ అంచనాలకు భిన్నంగా సాగుతోంది. లీగ్ మ్యాచ్‌లు తుది దశకు చేరినప్పటికీ కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రమే అధికారికంగా ప్లేఆఫ్స్‌లో ప్రవేశించింది. 16 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ రాయల్స్ కూడా దాదాపుగా చేరినట్టే. కానీ మిగిలిన రెండు బెర్త్‌ల కోసం ఏకంగా నాలుగు జట్లు పోటీ పడుతున్నాయి. ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ఇప్పటికే రేసు నుంచి తప్పుకొన్నాయి. ఇక 14 పాయింట్లతో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లతో పాటు 12 పాయింట్లతో ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌పై ఆశలు పెట్టుకున్నాయి. వీటి అవకాశాలను ఓసారి పరిశీలిస్తే..

రాజస్థాన్ అన్ని జట్ల కన్నా ఎంతో ముందే 16 పాయింట్లు సాధించిన ఈ జట్టు వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడింది. ఇక పంజాబ్, కోల్‌కతాతో జరిగే మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా ముందుకు వెళుతుంది. ఒకవేళ ఓడినా పెద్దగా ఇబ్బంది ఉండదు. మరో మూడు జట్లు 16 పాయింట్లు సాధించే అవకాశం ఉన్నా.. అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకంగా మారుతుంది. ఇందులో చెన్నై, సన్‌రైజర్స్ ఆర్‌ఆర్ కన్నా ముందుంటుంది. కానీ లఖ్‌నవూ 16 పాయింట్లతో ఉన్నా ఆర్‌ఆర్ రన్‌రేట్‌ను అధిగమించడం అసాధ్యం. కాబట్టి ఈ జట్టుకు ఢోకాలేదు.

చెన్నై సీఎస్‌కే తమ చివరి మ్యాచ్‌లో బెంగళూరుపై గెలిస్తే చాలు 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు వెళుతుంది. ఒకవేళ ఆర్‌సీబీపై స్వల్ప తేడాతో ఓడినా తమ నెట్ రన్‌రేట్ పడిపోకుండా చూసుకోవాలి. అయితే 14 పాయింట్లతో ఉన్న సన్‌రైజర్స్ తమ రెండు మ్యాచ్‌ల్లో భారీ తేడాతో ఓడాల్సి ఉంటుంది. దీంతోపాటు లఖ్‌నవూ తమ రెండు మ్యాచ్‌ల్లో ఓడాలి. అప్పుడే ఈ మూడు జట్లలో నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉన్న చెన్నై ముందుకు వెళుతుంది.

హైదరాబాద్ 14 పాయింట్లతో నాలుగోస్థానంలోనున్న సన్‌రైజర్స్.. చివరి రెండు మ్యాచుల్లో గుజరాత్, పంజాబ్‌పై గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్ చేరుతుంది. ఇక, అద్భుత రన్‌రేట్ ఉండడంతో ఒక్క మ్యాచ్‌లో గెలిచినా చాలు. కానీ రెండూ ఓడితే చెన్నై, లఖ్‌నవూ తర్వాత స్థానంలో ఉండాల్సి వస్తుంది.

బెంగళూరు 12 పాయింట్లతో ఉన్న ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ చేరాలంటే ముందుగా తమ ఆఖరి మ్యాచ్‌లో చెన్నైపై గెలవాలి. అలాగే వారి రన్‌రేట్‌ను అధిగమించాలంటే 201 లక్ష్యాన్ని 11 బంతులుండగానే గెలవాలి. అటు సన్‌రైజర్స్ ఒకటి లేదా రెండు మ్యాచ్‌లను ఓడాలి. అలాగే లఖ్‌నవూ కూడా కనీసం 14 పాయింట్ల దగ్గరే ఆగిపోవాలి. అప్పుడు నాలుగో జట్టుగా ఆర్‌సీబీ ముందుకెళుతుంది.

లఖ్‌నవూ 12 పాయింట్లతో ఉన్న లఖ్‌నవూ తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో ఢిల్లీ, ముంబైతో గెలవాలి. కానీ అలా గెలిచినా నెట్ రన్‌రేట్ ప్రతికూలంగా మారనుంది. అతి భారీ తేడాతో ప్రత్యర్థులను చిత్తు చేయగలిగితేనే ఈ జట్టుకు చాన్స్ ఉంటుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
బెంగళూరు	13	6	7	0	12	0.387
ఢిల్లీ	13	6	7	0	12	-0.482
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

గాయత్రీ ప్రాజెక్ట్స్‌పై లిక్విడేషన్ వద్దు

ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన ప్రమోటర్లు । రూ.750 కోట్లతో సెటిల్‌మెంట్ ఆఫర్

హైదరాబాద్: గాయత్రీ ప్రాజెక్ట్ దివాలా ప్రక్రియ (లిక్విడేషన్) కొత్త మలుపు తిరిగింది. లిక్విడేషన్‌కు వ్యతిరేకంగా కంపెనీ ప్రమోటర్లయిన టీ సుబ్బరామి రెడ్డి కుటుంబం.. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్‌ని ఆశ్రయించింది. రుణదాతలకు చెల్లించాల్సిన రూ.9,115 కోట్లలో రూ.750 కోట్లు చెల్లించి వివాదాన్ని సెటిల్ చేసుకునేందుకు ముందుకొచ్చింది. దివాలా చట్టం నిబంధనల ప్రకారం ఈ ప్రతిపాదనకు కంపెనీకి రుణాలు ఇచ్చిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో 90 శాతం మంది ఒప్పుకోవాల్సి ఉంటుంది.

ఒప్పుకోక తప్పదు: దివాలా ప్రక్రియలో ఉన్న గాయత్రీ ప్రాజెక్ట్స్‌ను కొనుగోలు చేసేందుకు మార్క్ ఏబీ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే ఒకే ఒక సంస్థ ముందుకొచ్చింది. అయితే ఇందుకోసం ఈ కంపెనీ రూ.650 కోట్లు మాత్రమే ఆఫర్ చేసింది. మళ్లీ ఇందులో రూ.50 కోట్లు నగదు రూపంలో, మిగతా మొత్తం గ్యారెంటీల రూపంలో చెల్లిస్తానని తెలిపింది. ఈ ఆఫర్‌తో పోలిస్తే కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేసిన రూ.750 కోట్ల ఆఫర్ ఆకర్షణీయంగా ఉంది. దీంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ ఆఫర్‌కే మొగ్గు చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఆల్టిమెట్రిక్ కొనుగోలు బరిలో 4 పీఈ దిగ్గజాలు

60 శాతం వాటా రూ.7,500 కోట్లకు విక్రయించే అవకాశం

ముంబై: ఆంధ్ర సంతతికి చెందిన అమెరికన్ రాజ్ వట్టికూటి 2012లో స్థాపించిన డిజిటల్ సేవల కంపెనీ ఆల్టిమెట్రిక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) దిగ్గజాలైన జనరల్ అట్లాంటిక్, టీపీజీ క్యాపిటల్, వార్‌బర్గ్ పింకస్, ఒంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్ పోటీపడుతున్నట్లు తెలిసింది. రాజ్ వట్టికూటి కంపెనీలో 60 శాతం వాటాను సుమారు 90 కోట్ల డాలర్లకు (రూ.7,500 కోట్లు) విక్రయించే ఆలోచనలో ఉన్నారని సమాచారం. ఈ లెక్కన ఆల్టిమెట్రిక్ మార్కెట్ విలువ 150 కోట్ల డాలర్ల (రూ.12,500 కోట్లు) స్థాయిలో ఉండనుంది. కంపెనీ కొనుగోలుకు తుది బిడ్డింగ్ జూన్ తొలి వారంలో జరిగే అవకాశం ఉంది. ఆల్టిమెట్రిక్‌కు అంతర్జాతీయంగా 22 కార్యాలయాలుండగా.. అందులో 6 భారత్ (హైదరాబాద్, పుణె, చెన్నై, బెంగళూరు, జైపూర్, గురుగ్రామ్)లో ఉన్నాయి. కంపెనీకి చెందిన 6,500 మంది సిబ్బందిలో 80 శాతం భారత కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు. బీఎఫ్ఎస్ఐ, ఫిన్‌టెక్, ఆటోమోటివ్, మాన్యుఫాక్చరింగ్, రిటైల్, ఫార్మా, లైఫ్‌సైన్సెస్‌కు రంగాలకు చెందిన పలు అంతర్జాతీయ సంస్థలకు ఆల్టిమెట్రిక్ సేవలందిస్తోంది. సిటీ గ్రూప్, మోర్గాన్ స్టాన్లీ, నోవార్టిస్, సోనీ, షిండ్లర్, సామ్‌సంగ్ ఈ జాబితాలో ఉన్నాయి. రాజ్ వట్టికూటి 2007లోనూ కన్సల్టింగ్ అండ్ టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీ కోవాన్సిస్‌ను కంప్యూటర్ సైన్స్ కార్పొరేషన్ (ప్రస్తుతం డీఎక్స్‌సీ టెక్నాలజీ)కు 130 కోట్ల డాలర్లకు విక్రయించారు.

బిజినెస్

మరింత తగ్గిన ధరల కాటు

ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం 4.83 శాతం

న్యూఢిల్లీ: ఆహారంలో నిత్యం ఉపయోగించే వస్తువుల ధరలు తగ్గడంతో ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 11 నెలల కనిష్ఠ స్థాయి 4.83 శాతానికి దిగి వచ్చింది. మార్చి నెలలో ఇది 4.85 శాతం ఉండగా గత ఏడాది ఏప్రిల్‌లో 4.7 శాతం ఉంది. గతంలో నమోదైన ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయి 4.31 శాతం. గత ఏడాది మే నెలలో ఇది నమోదైంది. ప్రస్తుతానికి వస్తే కొన్ని రకాల ఆహార వస్తువుల ధరలు తగ్గినప్పటికీ కొన్నింటి ధరలు పెరగడం వల్ల ఆ విభాగంలో ద్రవ్యోల్బణం మార్చి నెలతో పోల్చితే స్వల్పంగా అంటే 8.52 శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. ఏప్రిల్ నెలలో గుడ్లు, మాంసం, సుగంధ ద్రవ్యాలు, తృణధాన్యాలు, అనుబంధ ఉత్పత్తుల ధరలు తగ్గినా పళ్లు, కూరగాయలు, పప్పుల ధరలు మాత్రం పెరిగాయి.

'దక్ష'లో కోరమాండల్‌కు మరింత వాటా

హైదరాబాద్: చెన్నై కేంద్రంగా పని చేసే దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ (డీయూఎస్)లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మరింత వాటా కొనుగోలు చేసింది. రూ.150 కోట్లతో డీయూఎస్ ఈక్విటీలో మరో 7 శాతం వాటా కొనుగోలు చేసింది. దీంతో డీయూఎస్ ఈక్విటీలో కోరమాండల్ వాటా 51 శాతం నుంచి 58 శాతానికి చేరింది. కోరమాండల్ టెక్నాలజీ లిమిటెడ్ అనే అనుబంధ కంపెనీ ద్వారా ఈ కొనుగోలును చేపట్టింది. టెక్నాలజీ ద్వారా వివిధ రంగాల్లో టెక్నాలజీ ఆధారిత అప్లికేషన్లను ప్రోత్సహించాలనే యోచనతో దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్‌లో వాటా పెంచుకున్నట్టు కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ తెలిపారు.

వార్‌బర్గ్ పింకస్ చేతికి శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్

డీల్ విలువ రూ. 4,630 కోట్లు

న్యూఢిల్లీ: ఆర్థిక సర్వీసుల రంగంలోని శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ తమ గృహనిర్మాణ ఫైనాన్స్ విభాగాన్ని ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్‌కు విక్రయించినట్టు ప్రకటించింది. ఈ డీల్ విలువ రూ.4,630 కోట్లు. వాహన రుణాలు, చిన్న వ్యాపారాలకు రుణాలందించడంపై దృష్టి సారించడం కోసం హౌసింగ్ ఫైనాన్స్‌ను విక్రయించినట్టు తెలిపింది. డీల్ ముగియగానే శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో (ఎస్‌హెచ్‌ఎఫ్) మరో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టడానికి వార్‌బర్గ్ సంసిద్ధత ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి డీల్ పూర్తి చేసుకునే ఆస్కారం ఉన్నదని శ్రీరామ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉమేశ్ రేవంకర్ తెలిపారు. ఎస్‌హెచ్‌ఎఫ్ ఏడాదికి 50% సమీకృత వృద్ధిని సాధించిందని ఆయన చెప్పారు. ఎస్‌హెచ్‌ఎఫ్‌లో పెట్టిన పెట్టుబడులపై శ్రీరామ్ ఫైనాన్స్ 22% రాబడి పొందుతున్నట్టు ఆయన తెలిపారు. ఎస్‌హెచ్‌ఎఫ్‌లో శ్రీరామ్ ఫైనాన్స్ 83.8% వాటా కలిగి ఉండగా 14.8% వాటా పీఈ కంపెనీ వాలియెంట్ చేతుల్లో ఉండగా మిగతా 1.4% వాటా ఉద్యోగుల చేతిలో ఉంది.

3,000 మంది ఉద్యోగులు: ఈ డీల్ ప్రకారం ఎస్‌హెచ్‌ఎఫ్‌లో వాటాల విక్రయానికి ఆసక్తి కనబరుస్తున్న వారందరి నుంచి వాటాలను తన అనుబంధ సంస్థ మ్యాంగో క్రెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ద్వారా వార్‌బర్గ్ కొనుగోలు చేస్తుంది. ఈ డీల్‌కు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ), కాంపిటీషన్ కమిషన్ సీసీఐ), ఆర్‌బీఐ అనుమతులు లభించాల్సి ఉంది. ఎస్‌హెచ్‌ఎఫ్‌లో 3,000 మంది ఉద్యోగులున్నారు. డీల్ ముగిసిన అనంతరం వాటాదారుల విలువను పెంచేందుకు ఎస్‌హెచ్‌ఎఫ్ స్టాండ్‌ఎలోన్ విభాగంగా చలామణిలో ఉంటుంది. "భారత అఫర్డబుల్ హౌసింగ్ విభాగంలో అవకాశాల పట్ల మాకు చాలా ఆనందంగా ఉంది. శ్రీరామ్‌కు గల బలమైన టీమ్, నిలకడగా ఆర్థిక పురోగతి, భౌగోళిక విస్తరణ, కస్టమర్ ప్రధాన వైఖరి, శక్తివంతమైన విధానాలు కంపెనీని ప్రత్యేకంగా నిలిపే అంశాలు" అని వార్‌బర్గ్ పింకస్‌లో ఇండియా పీఈ విభాగం అధిపతి నరేంద్ర ఓస్వాల్ అన్నారు.

కేవీబీ లాభంలో 35 శాతం వృద్ధి

చెన్నై: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.456 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.338 కోట్లు)తో పోల్చితే లాభం 35 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.2,169 కోట్ల నుంచి రూ.2,813 కోట్లకు పెరిగింది. కాగా త్రైమాసిక కాలంలో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.27 శాతం నుంచి 1.40 శాతానికి, నికర ఎన్‌పీఏలు కూడా 0.74 శాతం నుంచి 0.40 శాతానికి తగ్గినట్లు తెలిపింది. మరోవైపు మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.9,863 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,6,05 కోట్ల నికర లాభాన్ని బ్యాంక్ నమోదు చేసింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.20 డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

-798 నుంచి +111 పాయింట్లకు

దాదాపు 1,000 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడిన సెన్సెక్స్



ముంబై: సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో భారీ నష్టాలు చవిచూసిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు.. చివర్లో కొనుగోళ్లతో మళ్లీ లాభాల్లోకి మళ్లాయి. సోమవారం నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. ఒక దశలో 798.46 పాయింట్లు క్షీణించి 71,866.01 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లు జరగడంతో సూచీలు కోలుకుని ఒక దశలో సూచీ దాదాపు 200 పాయింట్ల వరకు లాభపడి 72,863.56 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఇంట్రాడేలో దాదాపు 1,000 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. చివరికి 111.66 పాయింట్ల లాభంతో 72,776.13 వద్ద ముగిసింది. నిఫ్టీ 48.85 పాయింట్ల వృద్ధితో 22,104.05 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్ షేరు 3.83 శాతం ఎగిసి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. కాగా, త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను మెప్పించలేకపోవడంతో టాటా మోటార్స్ షేరు 8.34 శాతం పతనమై సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్ క్యాప్ సూచీ 0.36 శాతం పెరగగా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం తగ్గింది. రంగాలవారీ సూచీల్లో సర్వీసెస్, రియల్టీ, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్ ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. కన్స్యూమర్ డిస్క్రెషనరీ, టెలికాం, యుటిలిటీస్, ఆటో రంగ సూచీలు మాత్రం నేలచూపులు చూశాయి.

ఇండీజీన్ లిస్టింగ్ అదుర్స్

హెల్త్‌కేర్ టెక్నాలజీ కంపెనీ ఇండీజీన్ లిమిటెడ్ సోమవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.452తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 45.95 శాతం ప్రీమియంతో రూ.659.70 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 26.25 శాతం లాభంతో రూ.570.65 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,614.40 కోట్లుగా నమోదైంది. గత వారంలో ముగిసిన ఇండీజీన్ ఐపీఓకు ఇష్యూ సైజుకు దాదాపు 70 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

రుల్కా ఎలక్ట్రికల్స్ ఇష్యూ ధరల శ్రేణి రూ.223-235

ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రికల్ సర్వీసెస్ కంపెనీ రుల్కా ఎలక్ట్రికల్స్ ఐపీఓ ఈ నెల 16న ప్రారంభమై 21న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.223-235గా నిర్ణయించింది. తద్వారా రూ.26 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లను ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ సెగ్మెంట్ ప్లాట్‌ఫామ్ 'ఎన్ఎస్ఈ ఎమర్జ్'లో లిస్ట్ చేయనుంది.


'యారా'కు కాకినాడ నుంచి అమ్మోనియా

హైదరాబాద్: నార్వే కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న 'యారా క్లీన్ అమ్మోనియా' సంస్థ కాకినాడలోని గ్రీన్‌కో జీరోసీ కంపెనీ నుంచి పెద్ద మొత్తంలో అమ్మోనియాను కొనుగోలు చేయనుంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య ఒక దీర్ఘకాలిక ఒప్పందం కుదిరింది. గ్రీన్‌కో జీరోసీ సంస్థ.. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఏఎం గ్రీన్ అనుబంధ సంస్థ. గ్రీన్‌కో జీరోసీ కంపెనీ కాకినాడలో 10 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ తొలి దశ నిర్మాణం 2027 నాటికి పూర్తి కానుంది. ఇందులో ఐదు లక్షల టన్నులు యారా క్లీన్ అమ్మోనియా కంపెనీ దిగుమతి చేసుకోనుంది. యారా క్లీన్ అమ్మోనియా పర్యావరణకు హాని చేయని ఈ గ్రీన్ అమ్మోనియాను యూరప్‌లోని ఎరువులు, విద్యుదుత్పత్తి, నౌకాయానం వంటి కంపెనీలకు సరఫరా చేయనుంది.

ఆధార్ ఆధారిత జీఎస్‌టీ రిజిస్ట్రేషన్లు

ఆసక్తి చూపిస్తున్న తెలంగాణ

న్యూఢిల్లీ: జీఎస్‌టీ పన్ను వసూళ్ల వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకృత జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ల వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా ఐదు రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ఇప్పటికే ఆసక్తి వ్యక్తం చేశాయి. ఈ నెల ప్రారంభంలో జరిగిన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్‌టీ ఉన్నతాధికారుల సమావేశంలోనూ ఈ విషయాన్ని చర్చించారు. ఈ విధానం అమలుకు అయ్యే ఖర్చు, అవసరమైన మౌలిక సదుపాయాలు, మానవ వనరుల గురించి ఈ ఐదు రాష్ట్రాలు వివరాలు అడిగినట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఆ రాష్ట్రాలు అడిగిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వ జీఎస్‌టీ అధికార వర్గాలు, ఆయా రాష్ట్రాల జీఎస్‌టీ అధికారులకు అందించాయి. ప్రస్తుతం గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▼	67,150 ▼	90,000 ▼
ముంబై	72,164 ▼	66,102 ▼	83,494 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ



హైదరాబాద్	540	విజయవాడ	540
వరంగల్	542	గోదావరి	540
చిత్తూరు	608	విశాఖపట్నం	550

దజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	గోదావరి	145
వరంగల్	135	విజయవాడ	145
కరీంనగర్	135	గుంటూరు	145
మహబూబ్‌నగర్	135	ఒంగోలు	145
కర్నూలు	135	చిత్తూరు	152
విశాఖపట్నం	137		

వీవీప్యాట్‌లపై తీర్పును సమీక్షించండి

న్యూఢిల్లీ, మే 13: ఈవీఎంల్లో నమోదైన ఓట్లతో పాటుగా వీవీప్యాట్‌ల్లోని చీటీలన్నింటినీ లెక్కించాల్సిన అవసరం లేదంటూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలైంది. అరుణ్‌కుమార్ అగర్వాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈవీఎంల్లో లోపాలున్నాయని, వీవీప్యాట్ స్లిప్పులన్నింటికీ లెక్కించాలని, అవసరమైతే పాత పద్ధతిలో బ్యాలెట్ విధానాన్ని అనుసరించాలని దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు గత నెల 26న తీర్పునిచ్చింది.



త్వరలోనే పెళ్లి చేసుకుంటా!

» మా కుటుంబం రాయ్‌బరేలి కోసం ఎంతో చేసింది: రాహుల్

రాయ్‌బరేలి, మే 13 : పెళ్లెప్పుడు...? కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తరచూ ఎదురవుతోన్న ప్రశ్న ఇది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలోనూ సోమవారం ఇదే ప్రశ్న ఎదురవ్వడంతో ఆయన సమాధానం చెప్పక తప్పలేదు. త్వరలోనే(అబ్ జల్దీ కర్నీ పడేగీ) తాను పెళ్లి చేసుకోనున్నట్లు ఆయన చెప్పారు. రాయ్‌బరేలిలో సోమవారం ఒక బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం ఆయనకు ఈ ప్రశ్న ఎదురైంది. తన ప్రసంగం ముగిశాక రాహుల్ తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాను వేదికపైకి పిలిచి రాయ్‌బరేలిలో ప్రచారానికి ఆమె చేసిన కృషిని ప్రశంసించారు. ఈ సమయంలో జనంలోంచి ఒకరు... పెళ్లెప్పుడు? అని ప్రశ్న సంధించారు. దానికి సమాధానం చెప్పాలని ప్రియాంక సూచించారు. దీంతో "అబ్ జల్దీ కర్నీ పడేగీ" అని రాహుల్ సమాధానమిచ్చారు. ఆయనకు వచ్చే నెలతో 54 ఏళ్లు నిండనున్నాయి. అంతకు ముందు రాహుల్ తన ప్రసంగంలో... తన కుటుంబం ఎప్పుడూ రాయ్‌బరేలి ప్రజల కోసం పనిచేసిందని వివరించారు. ప్రధానీ మోదీలా... అదానీ, అంబానీల కోసం పనిచేయలేదన్నారు. తన కుటుంబానికి ఇక్కడి ప్రజలతో ఎంతో అనుబంధం ఉన్నందునే తాను ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో 22-25 మంది పెద్ద పారిశ్రామికవేత్తలకు రూ.16 లక్షల కోట్ల అప్పులను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. ఇండియా కూటమి అధికారంలో వస్తే... పేద కుటుంబాల జాబితా రూపొందించి ఆ కుటుంబంలోని ఒక మహిళ బ్యాంకు ఖాతాకు ఏటా లక్ష రూపాయలు లేదా నెలకు రూ.8,500 జమ చేస్తామని ప్రకటించారు. రాయ్‌బరేలిలో ఐదో విడతలో మే 20న ఎన్నికలు జరగనున్నాయి.

'మహాలక్ష్మి'తో మహిళల జీవితాల్లో వెలుగు

» గ్యారెంటీల అమలుతో తెలంగాణలో మార్పు: సోనియా



న్యూఢిల్లీ, మే 13(ఆంధ్రజ్యోతి): దేశంలోని మహిళలు ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న 'మహాలక్ష్మి పథకం' వారి జీవితాలను మార్చడానికి సహాయపడుతుందని ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద పేద కుటుంబాల మహిళలకు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. సోమవారం, లోక్‌సభ ఎన్నికల నాలుగో దశ జరుగుతున్నవేళ సోనియాగాంధీ ఈ మేరకు ఓ వీడియో ద్వారా తన సందేశాన్ని తెలిపారు. కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. కాంగ్రెస్ గ్యారెంటీల అమలుతో ఇప్పటికే కర్ణాటక, తెలంగాణలో కోట్లాది కుటుంబాల జీవితాలు మారిపోయాయని చెప్పారు. ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు, విద్యాహక్కు, ఆహార భద్రత వంటి పథకాల ద్వారా కాంగ్రెస్ పార్టీ లక్షల మంది భారతీయులకు సాధికారత కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ ఎక్స్ ఖాతాల్లో సోనియా వీడియోను షేర్ చేశారు. పేదకుటుంబాల మహిళల ఒక్కో ఓటు ఏడాదికి రూ.లక్షతో సమానమని గుర్తుపెట్టుకోవాలన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం మధ్య కొట్టుమిట్టాడుతున్న మహిళలకు కాంగ్రెస్ 'మహాలక్ష్మి' పథకం చేయూతనిస్తుందని.. ప్రతి నెలా రూ.8,500 నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా మహిళలు తమ కుటుంబాల భవితవ్యాన్ని తామే రాసుకోగలరని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కూలనుంది: శిందే

బెంగళూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర తరహాలోనే కర్ణాటక కాంగ్రెస్‌ను కూల్చేందుకు 'ఆపరేషన్ నాథ్' సిద్ధమవుతోందని, కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు కూలడం ఖాయమని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే ప్రస్తావించిన వీడియో రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు పొరుగున ఉన్న మహారాష్ట్రలో వ్యూహం సిద్ధమౌతోందని ఏక్‌నాథ్ శిందే అందులో పేర్కొన్నారు. కర్ణాటక బీజేపీ నాయకులు అక్కడి ప్రభుత్వాన్ని కూల్చేందుకు తనను సాయం కోరినట్లు షిండే తెలిపారు. అయితే ఏక్‌నాథ్‌శిందే ఎప్పుడు ఈ వ్యాఖ్యలు చేసింది స్పష్టత లేదు. కానీ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి పదిరోజుల క్రితం ఆయన రాష్ట్రానికి వచ్చారు. ఆ తర్వాతనే వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. కర్ణాటక శాసనసభలో 224 మంది సభ్యులకుగానూ 136 మంది కాంగ్రెస్‌వారు ఉన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు 66 మంది, జేడీఎస్‌కు 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుతం రెండు పార్టీలు పొత్తులో ఉన్నాయి. రెండు పార్టీలు కలిపినా 85 మంది ఎమ్మెల్యేలే అవుతారు. ప్రభుత్వం ఏర్పాటుకు మేజిక్ నంబరు 113 అవసరం. ఈ వీడియోపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. ఏక్‌నాథ్‌శిందే పగటికలలు కంటున్నారని, తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని అన్నారు.

ఎమ్మెల్యే రేవణ్ణకు బెయిల్ మంజూరు

బెంగళూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మహిళ కిడ్నాప్ కేసులో జైలుపాలైన ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరయింది. ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం సోమవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. రేవణ్ణ దాఖలు చేసుకున్న పిటిషన్‌పై గతవారంలోనే విచారణలు కొనసాగాయి. అయితే అభ్యంతరాల పిటిషన్ దాఖలుకు సోమవారం వరకు గడువు కావాలని సిట్ కోరిన మేరకు వాయిదా పడింది. విచారణ అనంతరం సాయంత్రం 6 గంటల తర్వాత బెయిల్ నిర్ణయాన్ని కోర్టు ప్రకటించడంతో రేవణ్ణ మంగళవారం ఉదయం విడుదల కానున్నారు. రూ.5లక్షల బాండు ఇవ్వాలని, సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నాలు చేయరాదని, కేఆర్ నగర తాలూకాకు వెళ్లరాదని కోర్టు ఆదేశించింది.

బాలిక ఇష్టంతో శృంగారంలో పాల్గొన్నా అత్యాచారమే

చెన్నై, మే 13 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక ఇష్టంతో శృంగారంలో పాల్గొన్నా అది అత్యాచారం కిందకే వస్తుందని, అలాంటి లైంగిక సంబంధాన్ని తాము అంగీకరించబోమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన సతీష్‌కుమార్ (25) అనే యువకుడు 2014లో పదిహేనేళ్ల బాలికను తిరుత్తణి ఆలయానికి తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆ జంట హొగెనేకల్ ప్రాంతంలో కాపురం చేసింది. అయితే ఆ బాలిక కనిపించడంలేదంటూ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ బాలికను తీసుకొచ్చి ఆమె కుటుంబీకులకు అప్పగించారు. అంతేగాక సతీష్‌కుమార్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన చెన్నై పోక్సో కోర్టు 2018లో సతీష్‌కుమార్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్షను సవాల్ చేస్తూ సతీష్‌కుమార్ మద్రాస్ హైకోర్టులో అప్పీలు చేసుకున్నాడు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ హేమలత ఇటీవల విచారణ చేపట్టారు. సతీష్‌కుమార్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్, ఆ బాలిక ప్రేమించుకున్నారని, పరస్పర అంగీకారంతోనే శృంగారంలో పాల్గొన్నారని, అయితే పోలీసులు మాత్రం అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారన్నారు. ఆమె అంగీకారంతోనే శృంగారం నెరిపాడని, అందువల్ల కిందికోర్టు విధించిన జైలుశిక్షను రద్దు చేయాలని అభ్యర్థించారు.

దక్షిణాదిన బీజేపీకి భారీగా సీట్లు

నాలుగు రాష్ట్రాల్లో ఘన విజయం దిశగా పార్టీ.. ఎన్నికల ఫలితాలు వచ్చేలోగా షేర్లు కొనేయండి

» తర్వాత స్టాక్‌మార్కెట్ పుంజుకుంటుంది: అమిత్ షా
» పాక్ బాంబు అంటే ఇండియా కూటవికి బెదురు : మోదీ
» వారణాసీలో నేడు నామినేషన్


మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, మే 13: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దక్షిణాదిన భారీ విజయం సాధిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఘన విజయం దిశగా అడుగులు వేస్తున్నామని సోమవారం ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు. ఈ నాలుగు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 109 లోక్‌సభ సీట్లు ఉండగా, గత ఎన్నికల్లో బీజేపీ 29 స్థానాలు (కర్ణాటక-25, తెలంగాణ-4) గెలుచుకుంది. ఏపీ, తెలంగాణల్లో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. అలాగే 20 లోక్‌సభ స్థానాలున్న కేరళలో కూడా బీజేపీ బోణీ చేయలేదు. కాగా, స్టాక్ మార్కెట్ పతనాలను ఎన్నికలతో ముడిపెట్టకూడదని అమిత్ షా అన్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత మార్కెట్లు మళ్లీ పుంజుకుంటాయని, ఈలోపే షేర్లు కొనుగోలు చేస్తే మంచి లాభాలు అందుకోవచ్చని ఇన్వెస్టర్లకు ఆయన సూచించారు. సెన్సెక్స్ లక్ష మార్కును దాటుతుందో, లేదో వ్యాఖ్యానించడానికి అమిత్ షా నిరాకరించారు. అయితే కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటే స్టాక్ మార్కెట్ సహజంగానే మెరుగైన పనితీరు కనబరుస్తుందని వ్యాఖ్యానించారు. ఈసారి తాము 400 సీట్లు గెలుస్తున్నామని, కేంద్రంలో స్థిరమైన మోదీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఓటు బ్యాంకును కోల్పోతామనే భయంతోనే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అయోధ్య రామమందిరాన్ని సందర్శించలేదని అమిత్ షా ఆరోపించారు. మహారాష్ట్రలోని ధూలే జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దును బుజ్జగింపు రాజకీయాల కారణంగానే ఆయన వ్యతిరేకించారని, దీనిపై శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే రాహుల్ అభిప్రాయాన్ని తెలుసుకోవాలని అమిత్ షా సూచించారు.

కూటమి నేతలు పిరికిపందలు

పాకిస్థాన్ చేతిలోని ఆటంబాంబు అంటే ఇండియా కూటమి నేతలు భీతిల్లిపోతున్నారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. పిరికిపందలు అంటూ కూటమి నేతలను విమర్శించారు. పాక్ వద్ద ఆటంబాంబు ఉన్నదనే విషయం గుర్తుపెట్టుకోవాలంటూ 'ఇండియా' కూటమిలోని కాంగ్రెస్ పార్టీ నేత మణిశంకర్ అయ్యర్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా ఇటీవల వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఐదో విడత ఎన్నికలు జరిగే బిహార్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం జరిగిన ప్రచార సభల్లో దీనిపైనే మోదీ వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్ అంటేనే బెదిరిపోయే నేతలను ఇండియా కూటమి కలిగి ఉన్నట్టు కనిపిస్తోంది. పాక్ ఆటంబాంబు గురించి వారంతా పీడకలలు కంటున్నారు. ఈ నేతలు పాకిస్థాన్‌కు ఒకచేత్తో క్లీన్‌చిట్ ఇస్తారు. మరో చేత్తో, ఆ దేశంపై భారత్ జరిపిన సర్జికల్ స్ట్రయిక్స్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తారు. ఆ కూటమిలోని లెఫ్ట్ మిత్రులు భారత్ వద్ద ఉన్న ఆటంబాంబులు నిర్వీర్యం కావాలని కోరుకుంటారు" అని దుయ్యబట్టారు. యూపీఏ పదేళ్ల పాలనలో ఈడీ స్కూలు బ్యాగులో దాచిన రూ.35 లక్షలను పట్టుకుంటే, ఎన్డీయే అధికారంలోకి వచ్చిన ఇన్నాళ్లలో ఏకంగా రూ.2200 కోట్లను ఈడీ స్వాధీనం చేసుకున్నదని, దానివల్లే ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయన్నారు. తనకు వారసులు లేరని, సామాన్యుడే తన వారసుడు అని వ్యాఖ్యానించారు.

నెహ్రూ తప్పులకు బాధ్యత మోదీదా?

దేశ సరిహద్దుల్లో చైనా దురాక్రమణలు భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ హయాంలోనే జరిగాయని, ఆయన చేసిన తప్పులకు మోదీ ఎందుకు బాధ్యత వహిస్తారని విదేశాంగమంత్రి జైశంకర్ మండిపడ్డారు. చైనా విషయంలో ప్రధాని నరేంద్రమోదీనే బాధ్యత వహించాలని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై సోమవారం జైశంకర్ స్పందిచారు. 1958- 1962 మధ్య కాలంలోనే భారత భూభాగాన్ని డ్రాగన్ ఆక్రమించుకుందని, 1958కి ముందు కూడా కొంత భూవిని ఆక్రమించుకుందని ఆయన పేర్కొన్నారు.


సోమవారం గురుద్వారా పట్నా సాహిబ్‌లో రొట్టెలు చేస్తున్న ప్రధాని మోదీ

వారణాసీలో మోదీ భారీ రోడ్‌షో

వారణాసీ లోక్‌సభ అభ్యర్థిగా మరోసారి పోటీచేస్తున్న నరేంద్ర మోదీ సోమవారం ఆరు కిలోమీటర్ల మేర ఆ పట్టణంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. విద్యా రంగ సంస్కర్త మదన్‌మోహన్ మాలవీయా విగ్రహానికి పూలమాల సమర్పించి తన యాత్రను ఆయన ప్రారంభించారు. రోడ్‌షోలో ఆయన వెంట యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ ఉన్నారు. ప్రధానమంత్రికి ఆహ్వానం పలుకుతూ, కనీసం వంద చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటుచేశారు. కాషాయ దుస్తులు ధరించిన మహిళలు రోడ్డుకు అటు ఇటు పెద్దఎత్తున గుమిగూడి రోడ్‌షోకు స్వాగతం పలికారు. నరేంద్రమోదీపై పూలవర్షం కురిపించారు. కాగా, మంగళవారం ఆయన తన నామినేషన్ పత్రాలను వారణాసీలో రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీ టీడీపీ అధినేత చంద్రబాబు సహా దాదాపుగా ఆ కూటమి నేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

లోకం తీరు



బీజేపీ సీనియర్ నేత సుశీల్‌మోదీ కన్నుమూత

క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస



పట్నా, మే 13: బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత సుశీల్ కుమార్ మోదీ కన్నుమూశారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. సుశీల్ కుమార్ మోదీ ఏడు నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే గత నెలలో 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఆరోగ్యం సహకరించనందున ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో సుశీల్‌మోదీ క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి ఆయన ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. 1973లో విద్యార్థి నేతగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సుశీల్ మోదీ.. 1990లో పట్నా సెంట్రల్ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా, ఎంపీగా సేవలందించారు. 2005 నుంచి 2020 మధ్య రెండు దఫాలుగా 11 ఏళ్ల పాటు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. సుశీల్ మోదీ కన్నుమూతపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. రాజకీయ జీవితంలో ఆయన ఉన్నత ఆదర్శాలను పాటించారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ స్పందిస్తూ.. 'నా స్నేహితుడు, సహచరుడు సుశీల్‌మోదీ ఆకస్మిక మరణం తీవ్ర విచారం కలగజేసింది. బిహార్‌లో బీజేపీ విజయయాత్రలో ఆయనది అత్యంత కీలకపాత్ర. జీఎస్టీ అమలుకు సంబంధించి ఆయన సేవలు మర్చిపోలేం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం' అని పేర్కొన్నారు. బిహార్ సీఎం నితీశ్‌కుమార్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, పలు పార్టీల నేతలు సుశీల్‌మోదీ మృతికి సంతాపం తెలిపారు. మంగళవారం సుశీల్ మోదీ అంత్యక్రియలు జరగనున్నాయి.

కేజ్రీవాల్‌ను తొలగించే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌దే

న్యూఢిల్లీ, మే 13: మనీలాండరింగ్ కేసులో అరెస్టయినందున కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని సోమవారం సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. సీఎంను తొలగించాలని అడిగే చట్టపరమైన హక్కు పిటిషనర్‌కు లేదని తెలిపింది. అవసరం అనుకుంటే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కేజ్రీవాల్‌ను తొలగించాలని కోరుతూ కాంత్ భాటీ అనే వ్యక్తి తొలుత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ పిటిషన్‌ను తిరస్కరించడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ అంశంపై అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్‌కు వినతి పత్రాలు సమర్పించవచ్చని కోర్టు పిటిషనర్‌కు సూచించింది. ఇదిలా ఉండగా, యూట్యూబర్ ధ్రువ్ రాఠీ వీడియోను షేర్ చేసిన వ్యవహారంలో బీజేపీ ఐటీ సెల్ దాఖలు చేసిన పరువు నష్టం దావాలో రాజీపడేందుకు కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు మరికొంత గడువు ఇచ్చింది. ఇందుకు వీలుగా కేసు విచారణపై స్టే పొడిగించింది.

కేజ్రీవాల్ నివాసంలో నాపై దాడి

» ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ ఆరోపణ

న్యూఢిల్లీ, మే 13: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికారిక నివాసంలో సోమవారం తనపై దాడి జరిగిందని అదే పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ, ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ఆరోపించారు. సీఎం వ్యక్తిగత సిబ్బంది తనపై దాడి చేశారని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు కూడా వెళ్లిన స్వాతి మలివాల్.. ఫిర్యాదు మాత్రం ఇవ్వకుండా వెళ్లిపోయారు. ఈ ఘటనపై సీఎం నివాసం నుంచి గానీ, ఆప్ నుంచి గానీ ఎటువంటి ప్రకటన వెలువడలేదు. కాగా, కేజ్రీవాల్ ఆదేశాల మేరకు ఆయన పీఏ వైభవ్‌కుమార్ తనపై దాడి చేసినట్లు స్వాతి ఆరోపించారని కొన్ని వార్తా ఛానళ్లు వెల్లడించాయి. ఈ ఘటనపై 3 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను జాతీయ మహిళా కమిషన్ ఆదేశించింది.

నాలుగో దశలో 67% ఓటింగ్

న్యూఢిల్లీ, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరం నాలుగో దశలో 67.25 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం రాత్రి 11.45 గంటల వరకూ అందిన సమాచారం ప్రకారం.. 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 96 స్థానాల్లో ఈ మేరకు పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఏపీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈసీ వెల్లడించిన వివరాలను బట్టి.. ఆ సమయానికి ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ 76.5 శాతంగా, తెలంగాణలో 64.74 శాతంగా ఉంది. ఏపీ (25), తెలంగాణ(17)లోని మొత్తం ఎంపీ స్థానాలతో పాటు యూపీ (13), మహారాష్ట్ర (11), పశ్చిమబెంగాల్ (8), మధ్యప్రదేశ్ (8), బిహార్ (5), ఝార్ఖండ్ (4), ఒడిశా (4), జమ్మూకశ్మీర్ (1)లోని పార్లమెంటు స్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి ఈ 96 స్థానాల్లో.. ఈవీఎంల మొరాయింపు, ఏజెంట్ల అడ్డగింత వంటి 1700 ఫిర్యాదులు నమోదయ్యాయి. పశ్చిమబెంగాల్‌లో 8 స్థానాల్లో టీఎంసీ, కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య చెలరేగిన ఘర్షణల నేపథ్యంలో మూడు పార్టీలూ పరస్పరం వందలాది ఫిర్యాదులు చేసుకున్నాయి. మొత్తం ఏడు దశల్లో ఈసీ ఈ ఎన్నికలను నిర్వహిస్తుండగా.. తాజాగా పూర్తయిన నాలుగో దశతో దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 379 స్థానాల్లో పోలింగ్ ముగిసినట్టయింది. అలాగే.. ఏపీ, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాలన్నింటికీ, ఒడిశాలో 28 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు ముగిశాయి. కడపటి వార్తలు అందే సమయానికి వీటిలో పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 78.37 శాతం పోలింగ్ నమోదు కాగా.. శ్రీనగర్ నియోజకవర్గంలో అతి తక్కువగా 37.98 శాతం ఓటింగ్ నమోదైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న ఈ తొలి ఎన్నికల్లో 38 శాతం అంటే మనకు తక్కువ అనిపించవచ్చుగానీ.. గత కొన్ని దశాబ్దాల్లో ఇదే అక్కడ అత్యధికం అని ఈసీ ప్రకటించడం గమనార్హం. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా, ఆయన కుమారుడు, పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా.. ఆయన కుమారులు జమీర్, జహీర్ అబ్దుల్లా.. ఇలా అబ్దుల్లా కుటుంబానికి చెందిన మూడు తరాల వారు తమ ఓటు హక్కును శ్రీనగర్‌లో వినియోగించుకున్నారు. ఇక.. బిహార్‌లో 57.06%, ఝార్ఖండ్‌లో 65.2%, మధ్యప్రదేశ్‌లో 70.98%, మహారాష్ట్రలో 59.64%, ఒడిశాలో 73.97%, ఉత్తరప్రదేశ్‌లో 58.05% ఓటింగ్ నమోదైంది. సార్వత్రిక ఎన్నికల మొదటి మూడు దశల్లో వరుసగా 66.14%, 66.71%, 65.68% ఓటింగ్ నమోదైన సంగతి తెలిసిందే. కాగా.. ఇప్పటిదాకా జరిగిన నాలుగు దశల ఎన్నికలతో ప్రజల తీర్పు ఎన్డీయే కూటమికే అనుకూలంగా ఉన్నదన్న విషయం స్పష్టమైందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. దేశం నలుమూలలా ఎన్డీయే అభ్యర్థులకు మంచి మద్దతు లభిస్తోంది. ఇండియా కూటమి అసలు ప్రజల చర్చల్లోనే ఉండట్లేదని ఎద్దేవా చేశారు. శ్రీనగర్‌లో ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటేశారంటూ మోదీ కొనియాడారు.



శ్రీనగర్‌లో ఓటేసిన ఫరూక్, ఒమర్ అబ్దుల్లా

చాబహార్ పోర్టుపై ఇరాన్‌తో ఒప్పందం

న్యూఢిల్లీ, మే 13: సుదీర్ఘ చర్చల తర్వాత చాబహార్ పోర్టు అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి భారత్-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో దేశ వాణిజ్య సంబంధాలు మెరగవడంతో పాటు మరిన్ని పెట్టుబడులు కూడా రానున్నాయి. ఆగ్నేయ ఇరాన్‌లోని ఈ వ్యూహాత్మక ఓడరేవును పూర్తిగా వినియోగించుకునే విషయమై ఆ దేశంతో ఒప్పందం చేసుకునేందుకు కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం అక్కడికి వెళ్లింది. ఈ సందర్భంగా ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్), ఇరాన్‌కు చెందిన పోర్ట్, మారిటైమ్ ఆపరేషన్ (పీఎంవో)తో దీర్ఘకాలిక ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు పదేళ్ల పాటు చాబహార్ పోర్టులోని షాహిద్ బెహెష్టీ టెర్మినల్‌ను భారత్ నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. విదేశాల్లో ఓ పోర్టు నిర్వహణను చేపట్టడం భారత్‌కిదే తొలిసారి. ఈ ఒప్పందం ద్వారా దాయాది దేశమైన పాకిస్థాన్‌పై ఆధారపడకుండా భారత్ నుంచి మధ్య ఆసియా దేశాలకు ఎగుమతులు, సరుకు రవాణా కూడా సులభతరం కానుంది.

మాల్దీవులకు భారత ఆపన్న హస్తం

50 మిలియన్ డాలర్ల సాయం కొనసాగింపు

మాలె, మే 13: మాల్దీవుల ప్రభుత్వ ప్రత్యేక వినతి మేరకు 50 మిలియన్ యూఎస్ డాలర్ల సాయాన్ని మరో ఏడాది పొడిగిస్తూ భారత్ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల క్రితం మాల్దీవుల అధ్యక్షుడిగా మహ్మద్ ముయిజ్జు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించినా భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో మాల్దీవుల ప్రభుత్వం భారత్ సహకారానికి ధన్యవాదాలు తెలిపింది. "మాల్దీవులకు కీలకమైన బడ్జెటరీ సాయం అందించినందుకు భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్, భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు... రెండు దేశాల మధ్య ఉన్న దీర్ఘకాల స్నేహానికి ఇది చిహ్నం." అని మాల్దీవుల విదేశాంగ శాఖ మంత్రి మూసా జమీర్ 'ఎక్స్'లో ప్రకటించారు.


10లో 93.6%..12లో 87.9% ఉత్తీర్ణత

» సీబీఎస్ఈ ఫలితాలు విడుదల..
» జూలై 15 నుంచి సప్లిమెంటరీ

న్యూఢిల్లీ, మే 13: సీబీఎస్ఈ 10వ తరగతిలో 93.60%, 12వ తరగతిలో 87.98% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను సీబీఎస్ఈ సోమవారం విడుదల చేసింది. 10, 12లో ఉత్తీర్ణత గత ఏడాది కంటే స్వల్పంగా పెరగ్గా... ఈ ఏడాది కూడా బాలికల హవా కొనసాగింది. 90, 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. 10వ తరగతిలో 2.12 లక్షల మంది 90 శాతం కంటే, 47 వేల మంది 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 12వ తరగతిలో 1.16 లక్షల మందికి 90 శాతం కంటే, 24,068 మందికి 95 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. వీరిలో 305 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన (సీఎస్‌డబ్ల్యూఎన్ క్యాటగిరీ) విద్యార్థులు ఉన్నారు. 'అనారోగ్యకర పోటీ'ని నివారించడానికి మెరిట్ జాబితా ప్రచురించకూడదని, ప్రథమ, ద్వితీయ, తృతీయ డివిజన్లు కూడా కేటాయించకూడదని సీబీఎస్ఈ నిర్ణయించింది. అయితే వివిధ సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందించనుంది. కాగా, జవహర్ నవోదయ విద్యాలయాల్లో 99.09 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూలై 15 నుంచి 10, 12 తరగతుల సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

ముంబైలో గాలి వాన బీభత్సం

భారీ హోర్డింగ్ కుప్పకూలి 9 మంది మృత్యువాత



ముంబై, మే 13: ముంబైలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం గాలి దుమారం, అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. బలమైన గాలులు, వర్షం మూలంగా ఘట్కోపర్ ప్రాంతంలో 100 అడుగుల ఎత్తైన అక్రమ హోర్డింగ్ పక్కనే ఉన్న పెట్రోల్ పంపుపై కుప్పకూలింది. ఈ ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోగా 70 మందికిపైగా గాయాలపాలయ్యారు. హోర్డింగ్ కింద చిక్కుకున్నవారిని కాపాడేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టారు. హోర్డింగ్ కూలిన ప్రాంతాన్ని సీఎం శిందే సందర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ప్రతికూల వాతావరణం, గాలిదుమారం నేపథ్యంలో ఛత్రపతి శివాజీ ఎయిర్‌పోర్ట్‌లో విమాన సర్వీసులను 66 నిమిషాల పాటు నిలిపివేశారు. వర్షాల కారణంగా లోకల్ రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. కాగా బలమైన గాలులు, వర్షంతో వడాలా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెటల్ పార్కింగ్ టవర్ రోడ్డుపై కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల, మే 13: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఎస్పీ నీలోత్పల్ కథనం ప్రకారం.. భమ్రాగడ్ తాలూకా కాట్రంగట్ట గ్రామం సమీపంలోని అడవుల్లో పెరమిలి దళం మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న సీ-60 యూనిట్‌కు చెందిన కమాండో బలగాలు సోమవారం ఉదయం నుంచి కూంబింగ్ ప్రారంభించాయి. బలగాలను చూసిన నక్సల్స్ కాల్పులు జరిపారని, కమాండోలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా నక్సల్ సహా.. ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో పెరమిలి దళం కమాండర్ వాసు ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనాస్థలి నుంచి ఒక ఏకే-47, మరొక కార్బైన్, ఒక ఇన్సాస్ రైఫిల్, మావోయిస్టు సాహిత్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మరోవైపు.. ఇటీవల ఎన్‌కౌంటర్ జరిగిన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పీడియా అడవుల్లో 14 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ వెల్లడించారు. అడవుల నుంచి వస్తున్న మావోయిస్టుల వద్ద టిఫిన్ బాంబులు, ఇతర పేలుడు పదార్థాలున్నట్లు వివరించారు. అరెస్టయిన వారిలో రేణు కోవాలసి, అవలం మంగ్లి ఉయికా బిచెయ్‌పై రూ.24 లక్షల రివార్డు, కుర్సం షర్మిల, తాటి లక్ష్మి, హేమ్లాపై రూ.15 లక్షల రివార్డు ఉన్నట్లు వివరించారు. కాగా.. బీజాపూర్ జిల్లా బోడ్గా గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. పేలకుండా ఉన్న ఓ బ్యారెల్ గ్రనేడ్ లాంచర్(బీజీఎల్)ను ఇద్దరు చిన్నారులు గుర్తించారు. వారిద్దరూ దాన్ని ఆటవస్తువుగా భావించారు. ఈ క్రమంలో బీజీఎల్ పేలడంతో వారిద్దరూ చనిపోయారు.



అబ్ కీ బార్?



నిజామాబాద్ జిల్లా పడిగెలలో ఓటు హక్కు వినియోగించుకున్న 98ఏళ్ల వృద్ధురాలు





మధిరలో ఓటు వేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



బంజారాహిల్స్ నందినగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కేటీఆర్ దంపతులు



కరీంనగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన బండి సంజయ్‌కుమార్



కరీంనగర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

కొడంగల్‌లో రేవంత్.. చింతమడకలో కేసీఆర్

స్థానికంగా ఎక్కడికక్కడ ఓట్లు వేసిన రాజకీయ నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, భార్య గీతారెడ్డి, కుమార్తె నైనీశా రెడ్డితో కలిసి ఓటు వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మం జిల్లాలోని మధిరలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ తన కూతురు త్రిషతో కలసి జోగిపేటలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సతీమణి శోభతో కలిసి సిద్దిపేట జిల్లా చింతమడకలో ఓటు వేశారు. ముఖ్యమంత్రి పదవి కోల్పోయాక మొదటిసారి చింతమడకకు వచ్చిన కేసీఆర్‌ను చూసేందుకు, మాట్లాడేందుకు గ్రామస్థులు పోటీపడ్డారు. సిద్దిపేటలోని భారత్‌నగర్ అంబిటస్ పాఠశాలలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఆయన భార్య శ్రీనిత, కుమారుడు అర్చిశ్‌మాన్‌తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్‌లో డీజీపీ రవిగుప్తా, ఎస్ఆర్ నగర్‌లో సీఈవో వికాస్‌రాజ్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఓటు వేశారు. బంజారాహిల్స్ రోడు నంబర్ 14లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న హిమాన్షును మీడియా ప్రతినిధులు పలకరించేందుకు ప్రయత్నించగా నవ్వుతూ వెళ్లిపోయారు. కొద్ది రోజుల క్రితం మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నరాజ్యసభ సభ్యుడు కేశవ రావు వీల్ చైర్‌లో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

64.74 శాతం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి పూర్తి సమాచారం అందని కారణంగా పోలింగ్ శాతానికి సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడవుతాయని, మరో రెండు శాతం పోలింగ్ పెరిగే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. కాగా, 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 62.07 శాతం పోలింగ్ జరిగింది. ప్రాథమిక వివరాల మేరకే ప్రస్తుతం ఈ శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగింది. మరోవైపు 17 లోక్‌సభ నియోజకవర్గాల్లోని 35,809 పోలింగ్ స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. 6 గంటల లోపు క్యూలో నిల్చున్న ఓటర్లకు నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇక తొలి రెండు గంటలు ఓటర్లు ఓటింగ్ మందకొడిగా సాగింది. కేవలం 9.48 శాతం నమోదైంది. ఒంటి గంటకు 40.38 శాతం వరకు, తర్వాత రెండు గంటల్లో మరో 52.34 శాతం, సాయంత్రం 5కు 61.16 శాతం పోలింగ్ జరిగింది. మావోయిస్టు ప్రభావిత ఐదు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాలు.. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేటలో సాయంత్రం 4గంటలకే పోలింగ్ ముగిసింది. పోలింగ్ శాతం అత్యధికంగా నమోదయ్యేలా ఎన్నికల సంఘం చేపట్టిన కార్యాచరణ విజయవంతమైందని ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. తాము ఊహించిన ప్రకారం ఓటింగ్ జరిగిందని చెప్పారు. వాతావరణం సైతం అనుకూలించిందని.. చిన్నపాటి ఆటంకాలు తప్ప, పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు నిర్దిష్ట పోలింగ్ శాతం వెల్లడవుతుందని పేర్కొన్నారు. పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి 400 ఫిర్యాదుల రాగా, 38 ఫిర్యాదులకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు 44 స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్‌పై మంగళవారం స్క్రూటినీ ఉంటుందని, ఎక్కడైనా రీ పోలింగ్ అవసరమా? అనేది ఆ తర్వాతే వెల్లడిస్తామని వికాస్‌రాజ్ పేర్కొన్నారు.

జనగామలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

పోలింగ్ సందర్భంగా జనగామ జిల్లా చేర్యాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు బాహాబాహీకి దిగారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాలలోని పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ కేంద్రానికి రాగా, కాంగ్రెస్ నాయకులు జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతి నినాదాలు చేయడంతో గొడవ మొదలైంది. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాకేశ్‌రెడ్డి పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లబోతుండగా, పరస్పరం నినాదాలు చేసుకుంటూ ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పల్లా గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ప్రతిగా బీఆర్ఎస్ నాయకులు కొమ్మూరి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పల్లా పోలింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోవడంతో వివాదం సద్దు మణిగింది. కాగా, జనగామ ధర్మకంచ పోలింగ్ కేంద్రం వద సరళిని పరిశీలించేందుకు కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి వెళ్లడంపై బీఆర్ఎస్ ఏజెంట్ అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్యే పల్లా బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకోగా వాగ్వివాదం జరిగింది.



మోత్కూరులో ఓటుహక్కు వినియోగించుకున్న నాలుగు తరాల మహిళామణులు

మొరాయించిన ఈవీఎంలు..

వనపర్తిజిల్లా అమరచింత జెడ్పీ హైస్కూల్‌లో రెండు గంటలపాటు ఈవీఎంలు పనిచేయకపోవడంతో ఓటింగ్ నిలిపేశారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనూ పలుచోట్ల సాంకేతిక సమస్య తలెత్తింది. అప్పటికప్పుడు కొన్నిటికి మరమ్మతు చేశారు. వీలుకాకుంటే మార్చి కొత్త యంత్రాలను అమర్చారు.

నికాబ్‌పై అధికారులను నిలదీసిన అర్వింద్

నిజామాబాద్ ఖిల్లా రోడ్‌లోని గోల్డన్‌జూబ్లీ పాఠశాలలోని కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ అర్వింద్ అక్కడి పోలింగ్‌ను పరిశీలించారు. మైనార్టీ మహిళలు నికాబ్ తీయకుండా ఓటు వేయడంపై అధికారులను ప్రశ్నించారు.

ఈవీఎంపై చేతి గుర్తు పక్కనే ఇంకు ముద్ర

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం వెంకట్రాంపురం 26వ బూత్‌లో ఈవీఎంలోని చేతి గుర్తు పక్కనే ఇంకు తరహా ముద్ర ఏర్పడి సమస్యకు దారితీయడంతో సుమారు 30 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఈవీఎంపై ఇంకు తరహా ముద్ర ఏర్పడిన పక్కన ఉన్న గుర్తు బటన్‌ను నొక్కాలంటూ పోలింగ్ కేంద్రం బయట కొంత మంది ప్రచారం చేస్తుండడంపై పీవోకు ఫిర్యాదు చేసినట్లు పలువురు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అనంతరం అధికారులు కొత్త ఈవీఎం ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగించారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రాంనగర్‌లో సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రానికి వచ్చిన గణేష్‌పై కానిస్టేబుల్ చేయిచేసుకున్నాడు. దీంతో అతడు సహా కుటుంబ సభ్యులు నలుగురు ఓటు వేయలేదు.

ఓటెత్తిన చైతన్యం

సంగాయిపేట తండాలో 100% పోలింగ్

ఆ తండావాసులు ఓటు కోసం పోటెత్తారు.. పోలింగ్ రోజున తమ చైతన్యం చూపించారు.. దీంతో ఏకంగా వంద శాతం పోలింగ్ నమోదైంది.. కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట తండాలో గతంలో పోలింగ్ బూత్ లేదు. తండావాసులు 2 కిలోమీటర్ల దూరంలోని సంగాయిపేటలో ఓటేసేవారు. తండావాసుల ఇబ్బందులను గుర్తించిన ఎన్నికల సంఘం అధికారులు స్థానికంగానే ఈసారి పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ స్టేషన్‌లో 210 ఓటర్లుండగా.. అందరూ ఓటేశారు. దీంతో అక్కడ వంద శాతం ఓటింగ్ నమోదైంది. కాగా, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణానికి చెందిన మాజీ జెడ్పీటీసీ గాదె సత్యనారాయణ (75) ఆక్సిజన్ మాస్క్ ధరించి పక్కన సిలిండర్.. సహాయకుడితో వచ్చి స్థానిక పోలింగ్‌బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ప్రస్తుత ఎన్నికల పోలింగ్ శాతం

ఆదిలాబాద్	72.96
పెద్దపల్లి	67.88
కరీంనగర్	72.33
నిజామాబాద్	71.47
జహీరాబాద్	74.54
మెదక్	74.38
మల్కాజ్‌గిరి	50.12
సికింద్రాబాద్	48.11
హైదరాబాద్	45.14
చేవెళ్ల	55.45
మహబూబ్‌నగర్	71.54
నాగర్‌కర్నూల్	68.86
నల్లగొండ	73.78
భువనగిరి	76.47
వరంగల్	68.29
మహబూబాబాద్	70.68
ఖమ్మం	75.19

(సోమవారం అర్ధరాత్రి 12:15 వరకు)

రాజధానిలో కనిపించని యూత్ జోష్!

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఎన్నికల సంఘం విస్తృతంగా చేసిన ప్రచారం, స్వచ్ఛందసంస్థలు జరిపిన ర్యాలీలు, సెలబ్రిటీల సూచనలు... ఏవీ హైదరాబాద్ యువ ఓటర్లను కదిలించలేదు. చాలా వరకూ పోలింగ్ స్టేషన్లలో సగటున పది ఓట్లలో 1-2 మాత్రమే తొలి లేదా రెండవసారి (గత అసెంబ్లీ ఎన్నికలలో తొలి ఓటు వేసిన వారు) ఓటు వేస్తున్న నవతరం కనిపించింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో సామాజిక మాధ్యమాలలో హోరెత్తిన యువత సెల్ఫీలు ఈసారి పెద్దగా లేవు. విచిత్రం ఏమిటంటే, ఈసారి రాష్ట్రంలో తొలిసారి ఓటర్లు (18 ఏళ్లు నిండినవారు) భారీ ఎత్తున ఓటు కోసం నమోదు చేసుకున్నారు. ఇది 67 శాతంగా నమోదైందని, దేశంలో తెలంగాణలోనే అత్యధికమని ఈసీ తెలిపింది. యువతలో ఈ ఉత్సాహం చూసి చాలామంది హైదరాబాద్‌లో గతం కంటే చాలా ఎక్కువగా పోలింగ్ నమోదవుతుందని ఆశించారు. కానీ, ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. దీనిపై ఓ పార్టీ నాయకుడు స్పందిస్తూ.. 'ఐపీఎల్ మ్యాచుల మీద యువతకు ఉన్న ఆసక్తి, తమ భవిష్యత్తును మార్చే నేతలను ఎన్నుకోవడంపై లేకపోవటం విషాదం' అని ఆవేదన వ్యక్తం చేశారు.





ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తున్న ఇల్లెందు మండలం కొమ్ముగూడెం తండా గ్రామస్థులు

బహిష్కరణాస్త్రం!

పాలమూరు జిల్లా ఎదిరలో ఓటేయని 3,300 మంది

- పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన
- మైనింగ్‌పై బల్మూర్ మండలం మైలారంలో నిరసన
- ఎన్నికలకు దూరంగా 700 మంది గ్రామస్థులు
- పలు జిల్లాల్లోనూ ఆందోళనలు.. హామీలతో విరమణ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సమస్యలు పరిష్కరించలేదంటూ.. అధికారులకు చెప్పినా పట్టించుకోలేదంటూ.. ఆగ్రహానికి గురైన ప్రజలు తమ నిరసన వ్యక్తం చేయడానికి పోలింగ్ బహిష్కరణను అస్త్రంగా ఎంచుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎదిర గ్రామంలో పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ 59 రోజులుగా టెంట్ వేసి రిలే నిరాహార దీక్షలు చేస్తున్న స్థానికులు సోమవారం ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. మూడు బూత్‌లలో 3,299 మందికిగాను ఎవరూ ఓటేయలేదు. పక్కనే ఉన్న హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన 300 మంది ఓటర్లలోనూ 128 మంది మాత్రమే ఓటేశారు. ఆర్డీవో నవీన్, తహసీల్దార్ గన్సీరాం, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి సర్దిచెప్పినా శాంతించలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామ శివారులోని గుట్టను మైనింగ్ కోసం కేటాయించడంపై కొన్ని నెలలుగా ఆందోళనలు చేస్తున్న ప్రజలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అచ్చంపేట ఆర్డీవో మాధవి నచ్చజెప్పినా వినలేదు. 783 మందికిగాను ఆరుగురే ఓటేశారు. అధికారుల నిర్లక్ష్యంతో తమ ఓట్లు రేఖ్యాతండాకు మారాయంటూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చింతలగడ్డ తండా వాసులు మండిపడ్డారు. 5 కి.మీ. దూరం వెళ్లి ఓటు వేయలేమంటూ 500 మంది పోలింగ్‌ను బహిష్కరించారు.

ఆగ్రహించారు.. శాంతించారు

భద్రాద్రి జిల్లా గుండాల మండలం పెద్దతోగు గిరిజన గ్రామంలో 81 మంది ఓటర్లు ఉండగా 61 మంది ఓటు వేసేందుకు 16 కిలోమీటర్ల దూరంలోని గుండాలలో వెళ్లాల్సి ఉంది. మధ్యలో 6 కి.మీ. రోడ్డు లేదంటూ స్థానికులు 2 గంటల పాటు ధర్నా చేశారు. వచ్చే ఎన్నికల నాటికి అందరి ఓటు గ్రామంలోనే ఉండేలా చూస్తామని గుండాల తహసీల్దార్ ఇమాన్యుయేల్, ఎంపీడీవో సత్యనారాయణ చెప్పడంతో వారు ఓటు వేశారు. ఇల్లెందు మండలం కొమ్ముగూడెం తండావాసులు సైతం ఓటు వేయబోయని భీష్మించగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, తహసీల్దార్ కోట రవికుమార్ పరిష్కారానికి హామీ ఇవ్వడంతో వెనక్కుతగ్గారు. ఎస్ఎస్‌పీ కాల్వపై వంతెన నిర్మించాలంటూ ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రాయమాదారం గ్రామస్థులు పోలింగ్ కేంద్రం ఎదుట ఆందోళన చేశారు. తహసీల్దార్ శేషగిరిరావు వచ్చి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో పోలింగ్‌లో పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం రాంసాగర్ తండావాసులు, ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మన్నూరు, దేగామా గ్రామస్థులు, ఇచ్చోడ మండలం బావోజీపేట వాసులు సైతం నిరసన గళం వినిపించినా.. అధికారుల హామీతో శాంతించారు. అభివృద్ధి పనులు జరగడం లేదంటూ కుమ్రం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం బోరిగాం ప్రజలు ఆందోళనకు దిగినా.. ఆ తర్వాత ఓటేశారు.



2 రోజుల్లో కోటిన్నర మంది!

ఆర్టీసీ బస్సుల్లో రికార్డుస్థాయి రాకపోకలు

హైదరాబాద్ సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల్లో టీఎస్ఆర్టీసీ బస్సుల్లో రికార్డుస్థాయిలో 1.50 కోట్ల మంది రాకపోకలు సాగించారని ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఆయన సోమవారం కొండాపూర్ చిరాక్ పబ్లిక్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటేయడానికి స్వగ్రామాలకు వెళ్లిన వారికి తిరుగు ప్రయాణంలోనూ అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాధారణంగా ఆర్టీసీ బస్సుల్లో రోజూ 55లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ పోలింగ్ నేపథ్యంలో గత రెండు రోజుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ఇది సంక్రాంతి రద్దీ కన్నా 10శాతం అధికమని ఆర్టీసీ అధికారులు చెప్పారు.

ఓటరు అత్యుత్సాహం

సెల్ఫీలు, వీడియోలు తీసిన పలువురిపై కేసు

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కొందరు ఓటర్లు అత్యుత్సాహం చూపారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లి నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం హేమ్లాతండాలోని 160వ బూత్‌కు ఓటేయడానికి వచ్చిన బానోత్ బాలకృష్ణ.ఓటు వేస్తూ మొబైల్‌లో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశాడు. ప్రిసైడింగ్ అధికారి ఫిర్యాదు చేయడంతో బాలకృష్ణపై కేసు నమోదైంది. నల్లగొండ జిల్లా యాద్గార్‌పల్లి 164 పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసిన వస్కుల మధు వీవీ ప్యాట్‌లోని స్లిప్‌ను ఫొటో తీసి వాట్సాప్ స్టేటస్‌గా పెట్టాడు. మధుపై కేసు నమోదైంది. భద్రాద్రి జిల్లా పెగళ్లపాడుకు చెందిన జాటోత్ నరేష్ 169వ పోలింగ్ బూత్‌లో ఓ యువకుడు ఓటు వేస్తుండగా ఫొటోలు తీశాడు. టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మెదక్ జిల్లా బ్రాహ్మణపల్లిలో గణేష్ ఓటు వేస్తూ సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో పెట్టాడు. పోలీసులు సదరు యువకుడిపై కేసు నమోదు చేశారు.

ఆధార్ కార్డులో ఫొటో, నీ ముఖం ఒకటేనా?

పోలింగ్ బూత్‌లో ముస్లిం మహిళకు హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత ప్రశ్న

- నికాబ్ తొలగింపు.. వెనుదిరిగిన మహిళ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఎల్‌వో

చాదర్‌ఘాట్, మంగళ్‌హాట్, చార్మినార్, మే 13 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ వద్ద ఓ ముస్లిం మహిళ ఓటు వేయకుండా వెనుదిరగడానికి కారణమయ్యారంటూ హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న మాధవీలతపై మలక్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. విధులకు ఆటంకం కలిగించారంటూ.. మంగళ్‌హాట్ పోలీసులు కూడా ఆమెపై కేసు పెట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. మలక్‌పేటలోని ఆస్మాన్‌గఢ్ హోలీ మదర్స్ గ్రామర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్(నంబర్ 64)ను బీజేపీ అభ్యర్థి మాధవీలత సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఓటువేసేందుకు కూర్చున్న ముస్లిం మహిళ-- రహ్మతున్నీసా వద్దకు వెళ్లారు. ఆమెతో.. "నీ ఆధార్ కార్డులో ఉన్న ఫొటో.. నీ ముఖం ఒకటేనా?" అంటూ నిలదీశారు. ఆమె నికాబ్(బుర్కాకు ఉండే ముసుగు)ను ఎత్తి చూశారు. "ఆధార్‌లో ఫొటో, నీ ముఖం వేరుగా కనిపిస్తున్నాయి. ఆధార్‌లో వయసుకు, నీ వయసుకు పొంతనే లేదు" అంటూ అసహనం వ్యక్తం చేశారు. దాంతో రహ్మతున్నీసా ఓటు వేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ వీడియో వైరల్ అవ్వడంతో.. ఆస్మాన్‌గఢ్‌లో మీడియా మాధవీలతను ప్రశ్నించగా.. "పాస్‌పోర్టు తీసుకోవడానికి నికాబ్ తీస్తారు. ఆధార్ కార్డు కోసం ఫొటో దిగడానికి నికాబ్ తీస్తారు. అదేవిధంగా ఓటు వేసేప్పుడు కూడా నికాబ్ తొలగించాలి" అని సమాధానమిచ్చారు. ఈ ఘటనపై పోలింగ్ బూత్ బీఎల్‌వో ఎం.అరుణ మలక్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మాధవీలతపై కేసు నమోదు చేశారు. కాగా.. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా మాధవీలతపై కేసు నమోదైంది. గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. బీజేపీ నేత రాకేశ్, మరో వ్యక్తి మంగళ్‌హాట్‌లోని ఆర్కేపేట్ ప్రాంతంలో ఓటర్ స్లిప్పులు ఇస్తూ.. బీజేపీకి ఓటేయాలని ఓటర్లను కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. మంగళ్‌హాట్ ఠాణాకు చేరుకున్న మాధవీలత.. రాకేశ్, మరో యువకుడిని బయటకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు మాధవీలతపై కేసు నమోదు చేశారు. కాగా, బీబీ బజార్ చౌరస్తా వైపు మాధవీలత వెళ్తున్న సమయంలోనే మజ్లిస్ నాయకుడు యాసర్ అర్ఫాత్ ఆమెకు ఎదురుపడ్డారు. వెంటనే యాసర్ తన కారులోంచి కిందకు దిగారు. దాంతో మజ్లిస్ కార్యకర్తలు మాధవీలత కారును అడ్డుకున్నారు. బీజేపీ-మజ్లిస్ వర్గాలు పోటాపోటీగా నినాదాలు చేశాయి. మాధవీలత కూడా కారులోంచి కిందకు దిగడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మీర్‌చౌక్ పోలీసులు ఇరువర్గాలను సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది. రియాసత్‌నగర్‌లో 40వ నంబర్ పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతోందంటూ మాధవీలత ఫిర్యాదు చేశారు. దాంతో.. బూత్ లోపలికి వెళ్లిన పోలీసులు.. అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.

గుండెపోటుతో ఉద్యోగి, ఐదుగురు ఓటర్ల మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు చోట్ల విషాద ఘటనలు చోటు చేసుకున్నాయి. గుండెపోటుతో ఓ ఎన్నికల ఉద్యోగి, ఐదుగురు ఓటర్లు మృతి చెందారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలోని నెహ్రూనగర్ పోలింగ్ బూత్‌లో ఏపీవోగా విధులు నిర్వరిస్తున్న శ్రీకృష్ణ (55) గుండెపోటుతో కుప్పకూలాడు. ఆయన్ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శ్రీకృష్ణ కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అలాగే అశ్వారావుపేట మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన కాశీ నాగేశ్వరరావు (54) వాగొడ్డుగూడెం పోలింగ్ బూత్‌లో ఓటేసి వస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఖమ్మం జిల్లా తాటిపూడిలో ఓటేసేందుకు పోలింగ్ స్లిప్‌తో బయలుదేరిన కొల్లిపాక వీరస్వామి (68) గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మరణించాడు. సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన ఇప్పకాయల సరోజన (80) సహాయకుల ద్వారా పోలింగ్ కేంద్రంలో ఓటేసి వస్తుండగా గుండెపోటు రావడంతో మరణించింది. హైదరాబాద్ ఉప్పల్ ఓల్డ్ భరత్‌నగర్‌కు చెందిన గట్టు విజయలక్ష్మి (65) ఓటేసి బయటకు వస్తూనే గుండెపోటుతో మరణించింది. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో ఓటేసేందుకు వచ్చిన శ్రీగంధం గిర్మవ్వ (83) పోలింగ్ కేంద్రం ఆవరణలోనే స్పృహ తప్పి పడిపోయింది. కుటుంబీకులు ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగానే మరణించింది.

పోలింగ్ సిబ్బంది ఆకలి కేకలు

అనుక్షణం అప్రమత్తతో విధులు నిర్వర్తించాల్సిన స్థితిలో పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బంది ఆకలితో ఇబ్బంది పడ్డారు. వారికి సరైన భోజన వసతి కల్పించలేదు. విధులు మొదలైన ఆదివారం సాయంత్రం నుంచి విధులు పూర్తయ్యే సోమవారం సాయంత్రం దాకా వారికి మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ ఇవ్వలేదు. వాస్తవానికి పోలింగ్ సిబ్బంది కోసం ప్రత్యేక మెనూను రూపొందించారు. అయితే, కొన్నిచోట్ల ఉదయం టీ కూడా ఇవ్వలేదని పోలింగ్ సిబ్బంది తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్‌గా ఉప్మా మినహా మెనూలో పేర్కొన్న ఏ ఒక్కటీ ఇవ్వలేదని పేర్కొన్నారు. భోజన సమయంలోనూ చాలా ప్రాంతాల్లో వెజిటేబుల్ బిర్యానీ మాత్రమే అందించారని వెల్లడించారు. మజ్జిగ, నిమ్మరసం వంటివేవీ ముషీరాబాద్‌లో విధులు నిర్వర్తించిన ఉద్యోగి పేర్కొన్నారు.

ఓటేశాకే హజ్‌యాత్రకు పయనం

» తమ ప్రథమ బాధ్యతను నిర్వర్తించి సౌదీకి బయల్దేరిన 800 మంది ముస్లిం పౌరులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): ఓటు హక్కును వినియోగించడమే తమ ప్రథమ బాధ్యతగా భావించిన సుమారు 800మంది తెలంగాణ ముస్లిం పౌరులు.. ఓటేశాకే హజ్ యాత్రకు బయల్దేరారు. సోమవారం సాయంత్రం మూడు విమానాలు హైదరాబాద్ నుంచి సౌదీకి బయలుదేరాయి. సౌదీకి విమానం బయలుదేరే సుమారు ఎనిమిది గంటల ముందు హజ్‌యాత్రికులు హైదరాబాద్‌లోని నాంపల్లి హజ్‌హౌజ్‌కు చేరుకోవాలి. తెలంగాణలోని మారుమూల పల్లెల నుంచి హైదరాబాద్‌కు చేరుకోవడానికి సుమారు 4 నుంచి 5 గంటలు పడుతుంది. అయినప్పటికీ ముస్లిం పౌరులు వారి స్వగ్రామాలలో ఓటు వేసిన తర్వాతే ఎన్నో ప్రయాసలకోర్చి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి హజ్‌హౌజ్‌లో లాంఛనాలను పూర్తి చేసి పవిత్ర హజ్‌యాత్రకు బయల్దేరారు. భారత పౌరునిగా ఓటు హక్కును వినియోగించుకోవడం తన ప్రథమ బాధ్యత అని జగిత్యాలకు చెందిన షేక్ ఇషాక్ అలీ అన్నారు. అందుకే ఓటు వేసి ధార్మికాచారం ప్రకారం హజ్‌యాత్రకు బయల్దేరినట్లు ఆయన చెప్పారు.

కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం

» రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం: జూపల్లి

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని మంత్రి జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కొల్లాపూర్‌లోని బాలికల పాఠశాలలో సతీమణి సుజనతో కలిసి ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, తెలంగాణలో మెజార్టీ ఎంపీ సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

ఫలించిన వ్యూహం.. ప్రశాంతంగా పోలింగ్

» సిబ్బందికి డీజీపీ రవిగుప్తా అభినందనలు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తవ్వడానికి తెలంగాణ పోలీసుల వ్యూహం ఫలించింది. మావోయిస్టు ప్రభావిత సరిహద్దు జిల్లాల్లోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. కమిషనర్లు, ఎస్పీలు స్వయంగా క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సమీక్షించారు. సిబ్బందికి డీజీపీ రవిగుప్తా అభినందనలు తెలిపారు.

కిషన్‌రెడ్డి, ఈటల, కేటీఆర్‌పై కాంగ్రెస్ ఫిర్యాదు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ నుంచి బయటికి వచ్చిన అనంతరం ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఆ పార్టీ నేత ఈటల రాజేందర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఫిర్యాదు చేశారు. కోడ్‌ను ఉల్లంఘించిన కిషన్‌రెడ్డి, ఈటల, కేటీఆర్‌ల ఓటు చెల్లనిదిగా ప్రకటించాలని ఈసీని ఆయన కోరారు.

పోలింగ్ నాడు సెలవు ఇవ్వని సంస్థలపై కేసులు

హైదరాబాద్ సిటీ, మే13 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజున కార్మికులు, ఉద్యోగులకు సెలవు ప్రకటించకుండా దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలను నిర్వహించిన యజమానులపై కార్మిక శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. సోమవారం నిర్వహించిన తనిఖీలతోపాటు పలు ఫిర్యాదుల మేరకు 30 కేసులు నమోదు చేశారు. కార్మికులు, ఉద్యోగులకు సెలవు ఇవ్వని యజమానులపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

దేశవ్యాప్తంగా మోదీ వ్యతిరేక వేవ్!

కేంద్రంలో ఇండియా కూటమి సర్కారే.. ఈ ఎన్నికలు మా రోజుల పాలనకు రెఫరెండం: సీఎం రేవంత్

కొడంగల్, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని మోదీకి వ్యతిరేక వేవ్ నడుస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. సోమవారం ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం కొడంగల్‌లోని తన ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనకు రెఫరెండమని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో ప్రజలకు చేరువైనట్లు చెప్పారు. బీజేపీ సైతం కేంద్ర ప్రభుత్వ పని తీరు, పదేళ్ల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండమని చెబుతోందని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అత్యధిక సీట్లను గెలుపొంది కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు బంధును రైతుల ఖాతాల్లో జమచేసినట్లే పంద్రాగస్టులోపు రైతు రుణ మాఫీని అమలు చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.5 శాతం ఓట్లు రాగా పార్లమెంట్ ఎన్నికల్లో అంతకుమించి వస్తాయన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తుండగా 400 సీట్లు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రధాని మోదీ భారత రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదన్నారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవని, సామాజికంగా వెనకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్‌ను రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. నవనీత్ కౌర్ 15 సెకన్ల కామెంట్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నుతూ పెట్టుబడులను గుజరాత్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా కేఏ పాల్‌లాగే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తంచేశారు.



కొడంగల్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొత్త శక్తిగా అవతరించనున్నాం

తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తాం.. మిడిమిడి జ్ఞానంతో ప్రధానికి రేవంత్ సవాళ్లు

» మోదీపై దుష్ప్రచారం చేస్తే పెద్ద నేతలు కాలేరు
» హైదరాబాద్‌లో ఓటర్ లిస్ట్ అస్తవ్యస్తం: కిషన్‌రెడ్డి
» ఓటమి భయంతో రేవంత్ కోడ్ ఉల్లంఘించారు
» ఈసీ చర్యలు తీసుకోవాలి: సంజయ్



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్/హుస్నాబాద్ రూరల్/సంగారెడ్డి అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ కొత్త శక్తిగా అవతరించబోతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తమ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఖాయమని స్పష్టం చేశారు. ఏపీలో ఎన్నికలు ఉండటం వల్ల కూడా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తగ్గిందని చెప్పారు. పోలింగ్ ముగిసిన తర్వాత పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం కొంత తగ్గినా, మెజారిటీ ఓటర్లు బీజేపీ వైపే మొగ్గుచూపారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి సానుకూల స్పందన లభించిందని తెలిపారు. ఓటింగ్ శాతంతో సంబంధం లేకుండా సికిందరాబాద్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీలో ఈ విద్యా సంవత్సరంలోనే కొన్ని కోర్సులకు అడ్మిషన్లు ఉంటాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించగానే వర్సిటీ భవనాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మిడిమిడి జ్ఞానంతో ప్రధానిపై సవాళ్లు చేస్తున్నారని విమర్శించారు. స్థాయి మరచి ప్రధానిపై విమర్శలు చేయొద్దని హితవు పలికారు. బీజేపీపై, కేంద్రంపై తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన పెద్ద నాయకులు కాబోరని అన్నారు. "పీఎం అయ్యాక పెళ్లి చేసుకోవాలని రాహుల్ అనుకున్నారు. కానీ ప్రధాని అయ్యే అవకాశం లేదని ఆయనకు తెలిసిపోయింది. అందుకే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారు.. మంచిదే కదా" అని అన్నారు. కాగా, మునిసిపల్ అధికారుల వైఖరి వల్ల హైదరాబాద్‌లో ఓటరు జాబితా అస్తవ్యస్తంగా మారిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తమకు ఓ చోట, తమ కుమారుడికి మరో చోట ఓటు కేటాయించారని.. దీనిపై కేంద్ర మంత్రిగా లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. ఒక వర్గం వారి కోసం షేక్‌పేటలో ఏకంగా 3 వేల ఓట్లను తొలగించారని ధ్వజమెత్తారు. షేక్‌పేటలో ఓట్లు గల్లంతయిన పోలింగ్ కేంద్రాన్ని కిషన్‌రెడ్డి సందర్శించారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామని.. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రేవంత్‌కు కోడ్ వర్తించదా..?: సంజయ్

రాష్ట్రంలో బీజేపీ మెజారిటీ సీట్లలో గెలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్‌కు ఓటమి తప్పదన్న టెన్షన్ ఆయన ముఖంలో కనిపించిందని, అందువల్లే కోడ్ ఉల్లంఘించి మాట్లాడారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన సీఎం రేవంత్ రెడ్డిపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి నిబంధనలను బేఖాతరు చేస్తూ.. ప్రధాని మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా.. కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తే.. ఆయనకు ఎన్నికల కోడ్ వర్తించదా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లకు మద్యం, డబ్బు పంచుతూ ప్రలోభాలకు గురిచేసినా చర్యలు తీసుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందని మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా బీజేపీకి మెజారిటీ సీట్లు తథ్యమని, కరీంనగర్‌లో బంపర్ మెజారిటీ ఖాయమని సంజయ్ తేల్చి చెప్పారు.

రేవంత్‌పై ఈసీకి ఫిర్యాదు: రఘునందన్‌రావు

కొడంగల్‌లో ఓటు వేసేందుకు వెళ్లి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఉద్దేశపూర్వంగా ప్రధాని మోదీని కించపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డిపై తమ పార్టీ ప్రత్యక్షంగా, మెయిల్ ద్వారా ఈసీకి ఫిర్యాదు చేసిందని తెలిపారు. తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్‌తో గెలవబోతుందని, రేవంత్‌రెడ్డి ఓటమిని అంగీకరించారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ స్థానాలకు ఇబ్బందవుతుందనే అనుమానంతో రైతుబంధు వేశామని, రేపు రుణమాఫీ చేస్తామంటూ వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరమని రఘునందన్ అన్నారు.

ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర

» ఈ ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదు
» ప్రధాని మోదీపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది
» మీడియాతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సిద్దిపేట/సిద్దిపేటటౌన్/బంజారాహిల్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో ప్రాంతీయ పార్టీలే కీలక పాత్ర పోషించబోతున్నాయని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. సిద్దిపేట జిల్లా చింతమడకలో సోమవారం ఓటు వేసిన అనంతరం జాతీయ మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదని చెప్పారు. బీజేపీ సొంత నిబంధనల ప్రకారం 75 ఏళ్లు దాటిన తర్వాత ఎవరూ ఏ పదవినీ చేపట్టరని, మోదీ కూడా ప్రధాని పదవి నుంచి తప్పుకోవాల్సిందేనని అన్నారు. ఇండియా కూటమిలో చేరతారా? అన్న మీడియా ప్రశ్నకు స్పందిస్తూ.. ఈ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారనున్నాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు.

ఎన్నికలు.. సువర్ణావకాశం: కేటీఆర్

ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓటువేసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యావంతులు, మేధావులు బయటకు వచ్చి ఓటు వేయడం వల్ల దేశాభివృద్ధికి నాంది పలికినట్టు అవుతుందన్నారు. కాగా, ప్రశ్నించే గొంతుక ఉండాలని ప్రజలు ఆలోచిస్తున్నారని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఓటు వేసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పోలింగ్ నమోదవుతుందని, పట్టణాల్లోనూ గతంలో కంటే ఎక్కువ నమోదు కావడం సంతోషదాయకమన్నారు.

ఉత్తరం ఒకలా.. దక్షిణం మరోలా

» తెలంగాణ ఓటింగ్‌లో తేడా.. భారీగా క్రాస్ ఓటింగ్
» గత ఎంపీ ఎన్నికల తరహాలోనే విభిన్న పోలింగ్
» అభ్యర్థుల కంటే.. పార్టీ ఆధారంగానే పడిన ఓట్లు



హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఊహించినట్లుగానే అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా పోలింగ్ జరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో కుల ప్రాతిపదికన ఓటింగ్ జరిగింది. అలాగే ఉత్తర తెలంగాణలో ఒకలా.. దక్షిణ తెలంగాణలో మరోలా పోలింగ్ జరిగినట్లు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా ఐదున్నర నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం.. ఈ ఎన్నికల్లో పూర్తిగా రివర్స్ అవుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల ఓట్లు భారీగా క్రాస్ అయినట్లు సమాచారం. మెజారిటీ స్థానాల్లో అధికార కాంగ్రెస్, బీజేపీనే ప్రధాన ప్రత్యర్థులుగా కనిపించాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ లాంటి చోట్ల ఓటరు నాడి విభిన్నంగా కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల శాతానికి.. సోమవారం పడ్డ ఓట్ల శాతానికి తేడా స్పష్టంగా కనిపించింది. ఈ నియోజకవర్గాల్లో కొందరు సిటింగ్ ఎంపీలపై వ్యతిరేకత ఉన్నప్పటికీ.. కేవలం వారి పార్టీ, కేంద్రంలో ఎవరు ఉండాలన్న దాని ఆధారంగానే ఓటింగ్ జరిగినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నియోజకవర్గాల్లో బీజేపీకి సానుకూల ఓటింగ్ పడిందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ మినహా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోనే బీజేపీ ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది. ఇప్పుడు ఎంపీ ఎన్నికలకు వచ్చేసరికి అన్ని చోట్ల అధికార కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అనే స్థాయికి వచ్చింది. మెదక్‌లో బీఆర్ఎస్‌దే పైచేయి అవుతుందని, ఒక్క సిద్దిపేటలో వచ్చే మెజారిటీతోనే తాము బయటపడగలమని గులాబీ దళం భావిస్తోంది. కానీ అక్కడ కూడా బీజేపీకే సానుకూల ప్రచారం (మౌత్ పబ్లిసిటీ) ఎక్కువగా జరిగిందని చెబుతున్నారు. ఇక కరీంనగర్ పరిధిలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే సామాజికవర్గ అభ్యర్థులను రంగంలోకి దించినప్పటికీ.. వెలమ సామాజిక వర్గంలో మెజారిటీ ఓట్లు కాంగ్రెస్‌వైపు వెళ్లినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. వరంగల్, పెద్దపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, నల్గొండ, నాగర్ కర్నూల్, భువనగిరి, మహబూబ్‌నగర్ స్థానాల్లో అధికార పార్టీకి సానుకూలంగా ఓటింగ్ జరిగినట్లు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, ఒకటి రెండు చోట్ల అధికార కాంగ్రెస్ ఓట్లు బీఆర్ఎస్ అభ్యర్థులకు పోలైనట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఖమ్మం పరిధిలో తమ సామాజిక వర్గానికి అధికార పార్టీ టికెట్టు కేటాయించలేదన్న ఆగ్రహంతో... వారు బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేశారు. అలాగే కొన్ని నియోజకవర్గాల్లో.. తమ అభ్యర్థి ఎలాగూ గెలవడన్న అభిప్రాయంలో ఉన్న ఆ పార్టీ కేడర్, ఓటర్లు... బీజేపీవైపు మొగ్గు చూపారు. ఫలితంగా.. 2019తో పోలిస్తే కమలనాథులకు గణనీయంగా సీట్లు పెరగొచ్చని ఓ రాజకీయ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు.

ఓటింగ్ శాతంలో తేడా...

2018 అసెంబ్లీ ఎన్నికల్లో 73.74% ఓటింగ్ జరిగింది. నాటి అధికార బీఆర్ఎస్‌కు 46శాతం ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 28.40, బీజేపీకి 6.98 శాతమే వచ్చాయి. ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 41శాతం ఓట్లే వచ్చాయి. బీజేపీ అనూహ్యంగా 19.65శాతం ఓట్లు రాబట్టుకొని, నాలుగు ఎంపీ సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ సైతం 29.79శాతం ఓట్లు తెచ్చుకొని మూడుసీట్లు గెలుచుకుంది. ఇక.. నిరుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 71.97 శాతం పోలింగ్ నమోదు కాగా.. కాంగ్రెస్‌కు 39.40%, బీఆర్ఎస్‌కు 37.35%, బీజేపీకి 13.9% ఓట్లు వచ్చాయి. కానీ, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటింగ్ శాతం తగ్గి.. బీజేపీకి బాగా పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సర్వే సంస్థల అంచనాల ప్రకారం.. కాంగ్రెస్‌కు 8-10, బీజేపీకి 6-8 సీట్లు, మజ్లిస్‌కు ఒక స్థానం దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలవకపోవచ్చని, అదృష్టం మెదక్‌లో గట్టెక్కే అవకాశం ఉందని చెబుతున్నారు.



పూరి గుడిసెనే.. పోలింగ్ స్టేషన్

దోమలపెంట, మే 13 : ఈ చిత్రంలో కనిపిస్తున్న అతి చిన్న పూరి గుడిసెను నల్లమల చెంచులు బొడ్డు గుడిసె అంటారు. నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట మండల పరిధిలోని రాయలేటిపెంటలో అధికారులు ఇందులోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గుడిసెలో ఓ మంచం వేసి.. దానిపై ఈవీఎం, వీవీ ప్యాట్‌ను పెట్టారు. వెలుతురుకు ఇబ్బంది లేకుండా గుడిసె చూరుకు టార్చ్‌లైట్ కట్టి.. ఆ వెలుతురు ఈవీఎంపై పడేలా చేశారు. గిరిజన పెంటల్లో భవనాలు లేకపోవడంతో అధికారులు ఇలా ఏర్పాటు చేశారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

పోలింగ్ డే.. కూల్ కూల్

» ఒక్కరోజులో 5డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రతలు
» పోలింగ్ కేంద్రాలకు ఓటర్ల బారులు
» రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

హైదరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): పార్టీల నేతలు, కార్యకర్తలను పోలింగ్ డే హీటెక్కిస్తే.. భానుడు మాత్రం శాంతించాడు. ఆదివారం దాకా రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్లా భారీ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా పోలింగ్ రోజైన సోమవారం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవడంతో ఈ మార్పు కనిపించింది. ఒక్కరోజు ముందు వరకు రాష్ట్రంలో 46డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు ఉండగా.. ఎన్నికల రోజు 41 డిగ్రీలకు తగ్గాయి. దీంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 62శాతం పోలింగ్ నమోదవ్వగా ఈసారి అంతకుమించి నమోదైంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

ఎవరి ధీమా వారిదే!

10-12 సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ అంచనా.. ముస్లిముల ఏకపక్ష పోలింగ్‌పై భరోసా

» పోల్ మేనేజ్‌మెంట్లో ముందున్నామని విశ్లేషణ
» 9-10 గెలుస్తామంటున్న బీజేపీ వర్గాలు
» మోదీ క్రేజ్ గ్రామాల్లోనూ ఉందని విశ్వాసం
» ఆరు గెలుచుకుంటామని బీఆర్ఎస్ అంచనా

హైదరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ పోలింగ్ ముగిసింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన త్రిముఖ పోరులో విజయం ఎవరిదనే చర్చ అన్ని పార్టీల్లో మొదలైంది. మూడు పార్టీలూ ఫలితాల పట్ల ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అత్యధిక స్థానాలు గెలుచుకుంటామని, గత నవంబరు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అదృష్టం కాదని నిరూపిస్తామని కాంగ్రెస్ ధీమాగా చెబుతోంది. సోమవారం సొంత గ్రామంలో ఓటేసిన సందర్భంగా కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికల ఫలితాలు తమ ప్రభుత్వ పనితీరుకు రెఫరెండమేనని పునరుద్ఘాటించారు. పది నుంచి 12 సీట్లు దక్కే అవకాశం ఉందని పార్టీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, ఆదిలాబాద్, పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, చేవెళ్ల సీట్లలో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. హైదరాబాద్‌ను వదిలేస్తే... సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, మల్కాజ్‌గిరీ సీట్లలో ప్రత్యర్థి పార్టీలతో గట్టి పోటీని ఎదుర్కొంటున్నట్లు వివరిస్తున్నాయి. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరీ సీట్లలో ఓటర్లు సహజంగా అధికార పార్టీకి మొగ్గు చూపుతారని, ముస్లిం మైనార్టీలూ కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతుగా నిలిచిన నేపథ్యంలో రెండూ తమకే దక్కుతాయని అంచనా వేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనితీరు పట్ల ఉన్నసానుకూలత, బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందన్న ప్రచారాలకు తోడు రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం మైనార్టీల్లో మెజారిటీ ఓటర్లు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవడడంతో కాంగ్రెస్‌కు సానుకూల పరిస్థితి స్పష్టంగా కనిపించిందని పార్టీ నేతలు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ మోదీ క్రేజ్

రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాలు తామే సాధించబోతున్నామని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం పెరుగుతోందని, ఇది తమకు అనుకూలిస్తుందని అంటున్నారు. ఓటుబ్యాంకు భారీగా పెరుగుతోందని, 9-10 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. "పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గినా బీజేపీకి ఆదరణ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ మోదీ క్రేజ్ విస్పష్టంగా కనిపించింది" అని బీజేపీ సీనియర్ నేత ఒకరు విశ్లేషించారు. ఒక ప్రధాన కులం ఈసారి పూర్తిగా తమ ప్రత్యర్థి వైపు మొగ్గు చూపినట్లు సమాచారం అందిందని, అయితే, దీని ప్రభావం పెద్దగా ఉండబోదని చెప్పారు. యువత పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారని, మోదీ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడం కలిసి వచ్చిందని చెబుతున్నాయి. ప్రధానిగా మోదీ మరోసారి కొనసాగాల్సిన అవసరాన్ని ప్రచారం చేశామని, యువత కూడా అనుకూలంగా స్పందించిందని తెలిపాయి.

ఓటింగ్ శాతం తగ్గదు: బీఆర్ఎస్

కనీసం ఆరు స్థానాల్లో గెలుపు తథ్యమని బీఆర్ఎస్ భావిస్తోంది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ వైఫల్యాలు, కేంద్రంలో బీజేపీ తెలంగాణకు ఏమీ చేయడం లేదన్న అంశాలే ప్రధాన ఎజెండాగా బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించింది. మెదక్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కరీంనగర్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి లోకసభ స్థానాల్లో గెలుస్తామని భావిస్తున్నట్లు తెలిసింది. ఓటింగ్ శాతం ఏ మాత్రం తగ్గదని అంచనా వేస్తున్నారు. మెదక్ ఏళ్ల తరబడి కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్న స్థానమని, అక్కడ గెలుపు తేలికేనని, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పరిధిలో పార్టీ ఎమ్మెల్యేలు ఉండటం, సికింద్రాబాద్‌లో పార్టీ అభ్యర్థికి ప్రజల్లో ఎక్కువ ఆదరణ లభించడం కలిసివస్తాయని అంచనా వేస్తున్నారు.

బీఆర్ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్

పోలింగ్ తేదీ నాటికి రాష్ట్రంలోని మెజారిటీ లోక్‌సభ సీట్లలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే ముఖాముఖీ పోటీ నెలకొన్నట్లుగా వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో ఆయా స్థానాల్లో బీఆర్ఎస్ ఓట్లు భారీగా క్రాస్ అయినట్లు చెబుతున్నారు. ఒకటి, రెండు శాతం ఓట్లే గెలుపోటములను నిర్ణయిస్తున్న క్రమంలో క్రాస్ అయిన బీఆర్ఎస్ పార్టీ ఓట్లు.. ఎవరి కొంప ముంచుతాయోనన్న ఆందోళన ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ వర్గాల్లోనూ నెలకొంది. ముఖ్యంగా మల్కాజ్‌గిరీ, చేవెళ్ల, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, జహీరాబాద్, నిజామాబాద్ వంటి చోట్ల క్రాస్ ఓటింగ్ భారీగా జరిగిందని చెబుతున్నారు. బీఆర్ఎస్‌లోని కాంగ్రెస్ వ్యతిరేకులు బీజేపీ వైపు, బీజేపీ వ్యతిరేకులు కాంగ్రెస్ పార్టీకి క్రాస్ చేసినట్లూ వార్తలు వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో ఐదేళ్ల సమయం ఉన్న నేపథ్యంలో అధికార పార్టీతో మంచి కోసమూ కొందరు బీఆర్ఎస్ నేతలు.. కాంగ్రెస్ అభ్యర్థులకు క్రాస్ చేయడానికే మొగ్గు చూపినట్లూ చెబుతున్నారు. పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులకు ఉన్న వ్యక్తిగత పరిచయాలతోనూ క్రాస్ ఓటింగ్ జరిగిందంటున్నారు. చేవెళ్ల నియోజకవర్గం తీసుకుంటే ఇటు కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, అటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు ఇద్దరూ గతంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలుగా పనిచేసిన వారే. ఆ పార్టీ నాయకులతో ఇద్దరికీ వ్యక్తిగత పరిచయాలు, ప్రయోజనాలు ఉన్నాయి. దీంతో ఎవరికి వీలైనంతగా వారు బీఆర్ఎస్ ఓటింగ్‌ను తమవైపునకు తిప్పుకున్నట్లు చెబుతున్నారు.

బీఆర్ఎస్‌కు భారీ దెబ్బ

ముక్కోణపు పోటీలు జరిగితే మెజారిటీ సీట్లలో రెండో ప్లేసు దక్కించుకునైనా ఉనికి నిలబెట్టుకోవాలని భావించిన బీఆర్ఎస్ నాయకత్వం ఆశలకు.. ఈ క్రాస్ ఓటింగ్ భారీగా గండి కొట్టినట్లు చెబుతున్నారు. మెజారిటీ సీట్లలో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోనున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికే ప్రమాదంలో పడేందుకూ ఆస్కారం ఉన్నట్లు చెబుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 14 మే 2024
diksuchi@andhrajyothy.com

అంతర్జాతీయ సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.

హైసీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్ల)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీకాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీ'ని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.



బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ధి చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఐఐఎఫ్‌టీ
ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జులై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



మహిళలు రాజకీయ భాగస్వామ్యం

ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగం మహిళలందరికీ రాజకీయ భాగస్వామ్యంలో సమానత్వానికి హామీ ఇచ్చింది. మహిళల సమానత్వం, అభివృద్ధిని ప్రోత్సహించడానికి భారతదేశం కొన్ని ప్రత్యేకమైన ప్రక్రియలను చేపట్టింది. మహిళల ప్రయోజనాలు పరిరక్షించడానికి, దేశాభివృద్ధిలో నారీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి రాజ్యాంగంలో ప్రత్యేక నిబంధనలను పొందుపర్చడంతోపాటు భారత పార్లమెంట్ అనేక చట్టాలను రూపొందించింది.

సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ, ఆలోచన, భావ ప్రకటన, నమ్మకం, స్వేచ్ఛను మన రాజ్యాంగ పీఠిక హామీ ఇచ్చింది. విశ్వాసం, ఆరాధన, హోదా, అవకాశాలలోను సమానత్వాన్ని వాగ్దానం చేస్తుంది. మహిళల రాజకీయ సమానత్వం కోసం తలెత్తిన ఉద్యమంలో ఓటు హక్కు కోసం జరిగిన పోరాటాన్ని మొదటిదిగా చెప్పవచ్చు. దీని ఫలితంగా భారత రాజ్యాంగం కల్పించిన వయోజన ఓటు హక్కును నిర్విఘ్నంగా ఉపయోగించుకుంటున్నారు.

భారత రాజ్యాంగం భారతీయ మహిళలందరికీ సమానత్వాన్ని(ఆర్టికల్ 14) కల్పించింది. రాజ్యం వివక్షతను ప్రదర్శించరాదని(ఆర్టికల్ 15(1)); అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని(ఆర్టికల్ 16); సమాన పనికి సమాన వేతనాన్ని కల్పించాలని(ఆర్టికల్ 39డి); మహిళలు, పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించవచ్చని(ఆర్టికల్ 15(3)) నిర్దేశించింది. సంఘాలను ఏర్పరచుకునే ప్రాథమిక స్వేచ్ఛలో భాగంగా రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని స్త్రీ, పురుషులకు సమానంగా(ఆర్టికల్ 19(1) (సి)) రాజ్యాంగం కల్పించింది. అదేవిధంగా మహిళల గౌరవ ప్రతిపత్తికి భంగం కలిగించే చర్యలను విడనాడటం(ఆర్టికల్ 51 ఎ(సి)); పని చేసే చోట మానవీయ పరిస్థితులను, ప్రసూతి సౌకర్యాలను కల్పించడం(ఆర్టికల్ 42); కుల, మత, లింగ, జన్మస్థలం ఆధారంగా కాకుండా కేవలం వయసు ప్రాతిపదికగా ఓటు హక్కును కల్పించింది. తద్వారా రాజకీయాలలో భాగస్వామ్యాన్ని కలిగించే ఆర్టికల్ 326, అదేవిధంగా 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 243డి, 243టి ఆర్టికల్స్ ద్వారా కల్పించారు. ఇందులో భాగంగా సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధ సంస్థగా మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. మహిళా సాధికారత సంవత్సరమైన 2001ని దృష్టిలో ఉంచుకుని మహిళా సాధికారత కోసం 'జాతీయ పాలసీ 2001'ని రూపొందించారు. ఇటీవల లోక్‌సభ, రాష్ట్ర శాసన సభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే 106వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది.



పైన పేర్కొన్నట్లుగా భారత రాజ్యాంగం అన్ని రంగాలలో మహిళల సమానత్వం, సాధికారతను పెంపొందించడానికి బలమైన నిబంధనలు రూపొందించింది.

- స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తరవాత అంటే 17వ సాధారణ ఎన్నికల తరవాత 2019లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో నిలుచున్న పురుషుల సంఖ్యతో పోల్చితే మహిళల భాగస్వామ్యం 67.18% . దీనితో మొట్టమొదటిసారిగా పురుషుల భాగస్వామ్యాన్ని మహిళలు అధిగమించినట్లయింది.

చట్ట సభలు - మహిళలు - ఒక విశ్లేషణ

- 1970 వరకు లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య 5 శాతం కంటే తక్కువ. 2009లోనే మొదటి సారి మహిళల ప్రాతినిధ్యం 10 శాతాన్ని దాటింది. 2023 వరకు పరిశీలిస్తే 17వ లోక్‌సభలోనే ఎక్కువ మంది మహిళా సభ్యులు ఉన్నారు.
- ప్రస్తుత 17వ లోక్‌సభ(2019-2024)లోని మొత్తం సభ్యులలో దాదాపు 15 శాతం మంది మహిళలు కాగా, రాష్ట్ర శాసనసభలో సగటున మొత్తం సభ్యుల్లో 9.1 శాతం ఉన్నారు.
- 2023 వరకు రాజ్యసభలో మహిళల ప్రాతినిధ్యం 13 శాతం కంటే మించలేదు.
- 2014 సార్వత్రిక ఎన్నికల్లో 670 మంది మహిళా అభ్యర్థులు పోటీపడ్డారు. 2009 కంటే 20 శాతం పెరుగుదల.
- అదేవిధంగా 1984లో ప్రతి 100 మంది పురుష అభ్యర్థులకు ముగ్గురు మహిళా అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2014 నాటికి ఈ సంఖ్య 9కి పెరిగింది. ఇది గణనీయమైన పెరుగుదల.
- మహిళా అభ్యర్థుల పెరుగుదలకు అనుగుణంగా వాస్తవ మహిళా ప్రాతినిధ్యం నమోదు కాలేదు. 2014లో లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య 63. ఇది ఒక రికార్డు. అయితే మహిళా అభ్యర్థుల విజయావకాశాలు 9.4 శాతం మాత్రమే.

అయితే రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ మహిళలకు ఎన్నికల్లో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదు. రాజ్యాంగ నిబంధనల కంటే సామాజిక నిబంధనలు, సమాజంలో లోతుగా పాతుకు పోయిన పితృస్వామ్య భావజాల ఆధిపత్య ధోరణులు మహిళలకు సమాన రాజకీయ భాగస్వామ్య స్థాయిని అందించే రాజకీయ వాతావరణాన్ని ఏర్పరచలేకపోయాయి. ఫలితంగా పాలనలో, రాజకీయ నిర్ణయీకరణలో మహిళల భాగస్వామ్యం అతి తక్కువగా కన్పిస్తుంది.

స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి 30 సంవత్సరాలు గడిచి, సుమారు 13 లక్షల మంది రాజకీయ పదవులు పొందినప్పటికీ... వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో చొరవను ప్రదర్శించలేక పోతున్నారు.

సాధారణ ఎన్నికలు - జెండర్ పరంగా పోటీదారులు - విజేతలు

17వ లోక్‌సభ(2019)లో అత్యధికంగా 78 మంది మహిళా సభ్యులున్నారు. 16వ లోక్‌సభ(2014)లో 62 మంది, ఆరో లోక్‌సభ(1977)లో అత్యల్పంగా మహిళా సభ్యులున్నారు. మొదటి లోక్‌సభ(1952)లో 22 మంది మహిళా సభ్యులున్నారు. అయితే 17వ లోక్‌సభ(2019) ఎన్నికల్లో మొత్తం పోటీదారులు 8054 కాగా, వీరిలో 726 మంది మహిళలు, 7334 మంది పురుషులు ఉన్నారు. 17వ సాధారణ ఎన్నికల్లో మహిళల గెలుపు శాతం 14.4 శాతం కాగా, పురుషులది 6.34 శాతం.

- 2019 ఎన్నికల్లో ఆరుగురు ట్రాన్స్‌జెండర్లు పోటీ చేశారు.
- 2019 వరకు మహిళల ఓటింగ్ శాతం పురుషుల ఓటింగ్ శాతం కంటే తక్కువగా ఉండేది. అయితే మొదటి సారిగా 2019 ఎన్నికల్లో మహిళల ఓటింగ్ శాతం 0.17 శాతం తేడాతో పురుషుల ఓటింగ్ శాతాన్ని అధిగమించింది.
- 1957 నుంచి రాజ్యసభలో మహిళల బలం దుర్భరంగా ఉంది. మహిళా రాజ్యసభ సభ్యుల సగటు సంఖ్య 9.5 శాతం కాగా, అత్యధికంగా 2014లో 12.7 శాతం నమోదైంది.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్.

లిటిల్స్



మీకు తెలుసా?

- ఎర్రటి శరీరం, నల్లని ముక్కు ఉండే కొంగలాంటి పక్షి పేరు 'స్కార్లెట్ ఐబిస్'.
- వీటి వింగ్ స్పాన్ 53.3 సెం.మీ. ఇవి ఆరెంజి, ఎరుపు, నలుపు, గోధుమ రంగు రంగుల్లో కూడా ఉంటాయి.
- దక్షిణ అమెరికా, కరేబియన్ దీవులు, బ్రెజిల్ దేశాల్లో ఎక్కువగా కనపడతాయి.
- ఇవి కరెంటు స్థంబాల మీద, చెట్ల పైభాగంలో గూళ్లు కనడతాయి. మూడు నుంచి ఐదు గుడ్లు పెడతాయి. వీటి పొదిగే కాలం 19 రోజుల నుంచి 23 రోజులు. పుట్టిన పిల్లలు నల్లగా ఉంటాయి. ఆ తర్వాత క్రమంగా ఎర్రగా మారతాయి.



- పురుగులు, మెత్తటి మట్టిలో ఉండే కీటకాలు, నీళ్లలోని చిన్న జీవులను తింటాయి. ఇవి నీళ్ల దగ్గర ఉండే ప్రాంతంలో ముఖ్యంగా గడ్డిపొదల్లో నివసిస్తాయి.
- వీటి గుడ్లను దొంగలించటం, వేటాడటం వల్ల రోజు రోజుకీ ఈ జాతి పక్షులు తగ్గిపోతున్నాయి. ఇవి 20 ఏళ్లు జీవిస్తాయి. వీటి ఆనవాళ్లు అరవై మిలియన్ల సంవత్సరాల కాలంనాటిదని శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది.
- ఒకటిన్నర కేజీ ఉంటాయి దాదాపు. ఆడ పక్షులు చిన్నగా కనపడతాయి. ఇకపోతే ఇవి గాల్లో వేగంగా వెళ్తాయి. ఇవి ఒక చోట నుంచి మరోచోటకు వెళ్లటానికి ఇబ్బంది పడవు. ఆకాశంలో వెళ్తోంటే.. 'వి' ఆకారంలో ప్రయాణిస్తాయి. ఆ సమయంలో చూడటానికి ఎంతో అందంగా ఉంటాయివి.

సరైన నీడ ఏది?






10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 306

					9		2	3
			2				6	
			5	6		4	7	
		2		9		7	8	
9	7						4	6
	1	4		7		5		
	2	6		1	5			
	3				8			
4	8		9					

సుడోకు - 305 సమాధానం

8	9	7	4	5	2	6	3	1
5	4	6	3	1	7	8	9	2
1	2	3	9	6	8	5	4	7
3	6	9	2	4	5	7	1	8
4	1	8	7	3	6	9	2	5
2	7	5	8	9	1	3	6	4
9	8	1	5	2	3	4	7	6
6	5	4	1	7	9	2	8	3
7	3	2	6	8	4	1	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.